
ఆంధ్రభూమి

సంపుటి: 30 · సంచిక: 226 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | మంగళవారం 15 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00



శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ నవమి రా.7.35
నక్షత్రం: అశ్విని ఉ.9.32 వరకు
శేష వర్జ్యం: ఉ.7.02వరకు
తిరిగి రా.7.08 నుండి 8.44 వరకు
దుర్ముహూర్తం: ఉ.08.24 నుండి 09.12 వరకు
తిరిగి రా.10.48 నుండి 11.36 వరకు
రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు
విశేషాలు: మకర సంక్రాంతి



ముగ్గుమురిపాల ముంగిళ్ళు ముద్దులొలుక
కోరికల పుంజులెగయగ కాళ్ళుదువ్వి
గాలిపటములు నింగిని కలియతిరగ
మకర సంక్రాంతి పర్వము మనసులూపె.

శుభాకాంక్షలు

పాఠకులు, చందాదారులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు.

- చీఫ్ ఎడిటర్

గమనిక

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రభూమి కార్యాలయానికి నేడు సెలవు. ఈ కారణంగా రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం జనవరి 17 గురువారం

- యాజమాన్యం

ఈ సంచికతో..



ప్రధాన పార్టీల్లో అటెన్షన్!

- వచ్చే నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్?
- అమరావతి కేంద్రంగా అధినేతల వ్యూహాలు
- అభ్యర్థుల జాబితా, మేనిఫెస్టోలపై కసరత్తు
- మారుతున్న రాజకీయ సమీకరణలు

- 6వ పేజీలో -

వ్యవసాయంలో 11 శాతం వృద్ధి

రైతులకు ముఖ్యమంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు



కాశిపెంట్ల గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 14: రాష్ట్రంలో పండ్ల తోటల ఆదాయంలో చిత్తూరు జిల్లా రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు సోమవారం జిల్లాకు వచ్చిన చంద్రబాబు నాయుడు మండలంలోని కాశిపెంట్ల గ్రామంలో హెరిటేజ్ ఫుడ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ ప్రపంచం మొత్తంలో ప్రజల ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. ప్రజలు ఎక్కువగా పండ్లు, కూరగాయలు తింటున్నారని చెప్పారు. 11శాతం వ్యవసాయంలో అభివృద్ధి సాధించామన్నారు. ప్రభుత్వానికి రైతులు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 34వేల ఎకరాలను రైతులు

- మిగతా 6వ పేజీలో

భోగి పిడకల నుండి పిండివంటల వరకూ..

అంతా రెడీమేడ్!

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 14: సంస్కృతి, సంప్రదాయాలు మారుతోన్న కాలానికి అనుగుణంగా మార్పులకు గురవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంలో క్షణం తీరుబడి లేని దైనందిన జీవితంలో మనిషి ప్రతీ దానికి అప్పటికపుడు లభ్యమయ్యే అవసరాలపై ఆధారపడుతున్న పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో ఆఖరికి సంక్రాంతి పండగలో ప్రధానంగా తెలుగు లోగిళ్లలో తెలుగు పిండి వంటల ఘుమఘుమలు కాస్తా ఇపుడు మార్కెట్‌లో విస్తరిస్తున్నాయి. సంక్రాంతి తెలుగు పిండి వంటలు దుకాణాల్లో రెడీమేడ్‌గా లభించే పరిస్థితి చిక్కడంతో మార్కెట్‌పైనే ఆధారపడుతున్న పరిస్థితి కనిపించింది. ప్రధానంగా వంటలు మార్కెట్ శైలిని సంతరించుకున్నాయి. తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పిండి వంటలైన సున్నుండలు, పాకుండలు, పొంగడాలు, అరిసెలు, చక్కెడాలు, చల్లగుత్తులు, కరకజ్జం తదితర రకాల

- మిగతా 6వ పేజీలో



రాజమహేంద్రవరంలో భోగి పిడకల విక్రయాలు

సంఘ ప్రముఖులపై కాంగ్రెస్ కన్ను

- వారి సేవలను వినియోగించుకునేందుకు వ్యూహం
- గుర్తించిన వారితో మార్చిలో భేటీ కానున్న రాహుల్
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రచారానికి యోచన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 14: లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏను ఓడించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తున్నారు. రాహుల్ అధ్యక్షతన గత వారం జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో పార్టీ లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ పథకానికి శ్రీకారం చుట్టినట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. బీజేపీ జాతీయ నాయకత్వం లోక్‌సభ ఎన్నికలకోసం గ్రామస్థాయిలో ప్రజలను ప్రభావితం చేసేందుకు సిద్ధమవుతుంటే కాంగ్రెస్ పార్టీ సమాజంలోని వివిధ



వర్గాల నాయకులు, వైద్యులు, ఇంజనీర్లు, లాయర్లు, కార్మిక సంఘాల నాయకులు, మేధావులు, ఆయా రంగాల్లో ప్రముఖులు, వ్యాపార సంఘాల ప్రముఖులు, ఇతర ప్రముఖులను ప్రచార బరిలోకి

- మిగతా 6వ పేజీలో

ఇంత దౌర్భాగ్యమా..

- సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం
- దోషులపై కఠిన చర్యలు తీసుకోండి
- పోలీసు కమిషనర్‌కు షర్మిల ఫిర్యాదు
- సైబర్ క్రైం పోలీసుల విచారణ ప్రారంభం


ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు (జగన్మోహన్ రెడ్డిసోదరి) షర్మిల నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం షర్మిల తన భర్త అనిల్ కుమార్, పార్టీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్‌ను కలిసి ఈ మేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సినీ నటుడు ప్రభాస్‌తో తనకు సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులపై చర్య తీసుకోవాలంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. షర్మిల ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ అంజనీ కుమార్ వెంటనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సైబర్ క్రైం అదనపు

- మిగతా 6వ పేజీలో




హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న షర్మిల



సామరస్యం అయోధ్య అభిమతం!

- ఆలయ వివాదంతో మరుగునపడ్డ వైశిష్ట్యం
- చారిత్రక లోతుల్లోకి తాజా పుస్తకం

న్యూఢిల్లీ, జనవరి 14: మూడువేల మూడొందల సంవత్సరాల ఘనకీర్తి ఆ పట్టణం సొంతం. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవానికి తరతరాలుగా మూలకందంగా భాసిల్లుతున్న పవిత్ర నగరం అది. తరాలు అంతరిస్తున్నా ఎప్పటికప్పుడు కొత్త తరాన్ని ఆకట్టుకుంటూ భారతీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న అయోధ్య నగర వైశిష్ట్యం నిరుపమానమే. శ్రీరాముడు జన్మించిన స్థలంగా గణతికెక్కిన అయోధ్య నగరం గురించి తాజాగా వెలువడిన ఓ పుస్తకం ఎన్నో లోతైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. ఈ నగరం కేవలం రామాలయ వివాదంతోనే ముడివడి లేదని దీని ప్రాధాన్యత మతాలకు అతీతమని ఈ పుస్తక రచయిత, ప్రముఖ పాత్రికేయుడు వలయ్ సింగ్ స్పష్టం చేశారు. అయోధ్య చరిత్ర, దాని గొప్పతనానికి ఆయన పుస్తక రూపం ఇచ్చారు. 'అయోధ్య- సిటీ ఆఫ్ ఫెయిత్, సిటీ ఆఫ్ డిస్కార్డ్' పేరుతో సింగ్ పుస్తకాన్ని రాశారు. ఇటీవలే ఆవిష్కృతమైన పుస్తకంలో అయోధ్య మహోన్నత, మనోహర




మైన చరిత్ర రామమందిర వివాదంతో మరుగున పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.'అయోధ్యకు విస్తృతమైన ఘన చరిత్ర ఉంది. బుద్ధిజం, ఇస్లాం, జైనిజంతో నగరానికి అనుబంధం ఉంది'అని రచయిత పేర్కొన్నారు. నగరంలో

- మిగతా 6వ పేజీలో



Gripper





తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న విధాన మండలి చైర్మన్ స్వామిగౌడ్

భద్రత కట్టుదిట్టం చేయండి

డీజీపీని ఆదేశించిన కౌన్సిల్ చైర్మన్ స్వామి గౌడ్ ❖ అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలపై సమీక్ష

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 17 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని కౌన్సిల్ చైర్మన్ కే. స్వామిగౌడ్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం కౌన్సిల్ చైర్మన్ పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై భద్రతా ఏర్పాట్ల గురించి సమీక్షించారు. ఈ సమావేశంలో మండలి కార్యదర్శి వీ. నరసింహాచార్యులు, డీజీపీ వి. మహేందర్ రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అసెంబ్లీకి కొత్త సభ్యులు ఎన్నికై ప్రమాణం చేసేందుకు వస్తున్నందున, వారి బంధు, మిత్రులు, అనుచరులు వచ్చే అవకాశం ఉన్నందున, విధుల్లో ఉండే పోలీసులు లౌక్యంగా మాట్లాడేలా సూచనలు చేయాలని చైర్మన్ స్వామి గౌడ్ వారికి సూచించారు. ఈ నెల 16న సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ ఖాన్‌తో ప్రమాణం చేయిస్తారు. 17న 11 గంటలకు అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ ఖాన్ సభ్యులతో ప్రమాణం చేయిస్తారు. అదే రోజున స్పీకర్ ఎన్నిక కోసం ఆయన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 18న స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. 19న గవర్నర్ నరసింహన్ ఉభయ సభల సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ఉభయ సభలూ ధన్యవాదాలు చెబుతూ తీర్మానాన్ని ఆమోదిస్తాయి.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలు అరికట్టాలి

కరీంనగర్, జనవరి 14: తెలంగాణ రాష్ట్రంలో గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టి బాధితులకు బాసటగా నిలవాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి వినతి చేసినట్లు గల్ఫ్ రిటర్నింగ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చాంద్‌పాషా తెలిపారు. ఉన్న ఊళ్లో ఉపాధికరువై బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టి అక్కడ చేతినిండా పని దొరకక భారతీయులు కొందరు అర్ధాకలితో అలమటిస్తుండగా, మరికొందరు పస్తులుండి తలదాచుకుంటున్నారని, ఏజెంట్ల మోసాలతోనే ఇదంతా జరుగుతోందని సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ షేక్ చాంద్‌పాషా వెల్లడించారు. ఉపాధికోసం గల్ఫ్ వెళ్లినవారికి అక్కడ చేతినిండా పనిదొరకక అనేకమంది ఆత్మహత్యలు చేసుకోగా, కనీసం కడసారి చూపునకు నోచుకోని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు అక్కడ మృత్యువాత పడిన పట్టించుకోని పరిస్థితి ఉందని, కంపెనీలలో సక్రమంగా పనిలేక పారిపోయి ఇతర చోట్ల ఉపాధి మార్గాలు ఎంచుకుంటున్నవారు అనేక మందిని అక్కడి పోలీసులు అరెస్ట్‌లు చేసి జైళ్లలో పెడుతుండగా నరకయాతన అనుభవిస్తున్నారని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌కు వివరించినట్లు తెలిపారు. తెలిసో తెలియకో ఏజెంట్ల మాయ మాటలను నమ్మి పరాయి దేశం వెళ్లి అక్కడ క్షణమొక యుగంగా కాలం వెళ్లదీస్తున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి గల్ఫ్ బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తూ ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని కోరానన్నారు.

జనరల్ సీట్లలో బీసీలను గెలిపించండి

పార్టీల సంఘాల నేతల విజ్ఞప్తి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేసే బీసీలకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని, బీసీలంతా కలిసి బీసీ అభ్యర్థులనే గెలిపించాలని 14 బీసీ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యతో సహా బీసీ సంఘాల నేతలు గుజ్జకృష్ణ, దాసు సురేష్, నీలం వెంకటేష్, సీ. రాజేందర్, గొలిగే మల్లేష్ యాదవ్, టిఆర్ చందర్, ఉపేందర్‌గౌడ్, జి. అంజి, కే. నర్సింహగౌడ్, మధుసూదన్, ఎస్. వెంకన్న, కే. నటరాజ్, శ్యాంసుందర్ తదితరులు సంయుక్తంగా సోమవారం ఇక్కడ ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలకు పంచాయతీల్లో రిజర్వేషన్లు 34 శాతం నుండి 22 శాతానికి తగ్గించడం వల్ల బీసీ ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. బీసీల రిజర్వేషన్లను తగ్గిసూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై తాము సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశామని, ఈ కేసులో సుప్రీంకోర్టులో రెండు, మూడురోజుల్లో వాదనలు జరుగుతాయన్నారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేయించాలని, ఓట్లను కొనుగోలు చేసేందుకు నగదు పంపిణీ జగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

బొమ్మూరు పోలీసుస్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం, జనవరి 14: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్ బొమ్మూరు పోలీసుస్టేషన్ సోమవారం తెల్లవారుజామున గంజాయి కేసులో నిందితుడు ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం సృష్టించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన నడింపల్లి సీతారామరాజు కారులో గంజాయిని రవాణా చేస్తుండగా ఆదివారం రాత్రి బొమ్మూరు పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 240కేజీల గంజాయిని వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మరో కారులో వెనుక వస్తున్న సీతారామరాజుతో పాటు నెల్లూరు జిల్లా లక్ష్మీనరసింహపురంకు చెందిన షేక్ అహ్మద్ బాషా, నల్లజర్ల మండలం సింగరాయపాలెంనకు చెందిన సిహెచ్ రాంబాబులను పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ నిమిత్తం బొమ్మూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారణ సందర్భంగా పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తారని, తనకు జైలు శిక్ష ఖాయమన్న భయంతో పోలీసుస్టేషన్‌లోనే సీతారామరాజు సోమవారం తెల్లవారుజామున మరుగుదొడ్డికి వెళతానని చెప్పి వెళ్లాడు. అక్కడ ఉన్న ఇనుప రేకుతో కంఠం కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన సీతారామరాజును చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, 2014లో ప్రత్తిపాడు పోలీసుస్టేషన్ పరిధిలో ఒకసారి సీతారామరాజు గంజాయి అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డాడు. ఈకేసులో అతను జీవితఖైదును విధించారు. జైలు నుంచి విడుదలైన సీతారామరాజు మరోసారి పోలీసులకు పట్టుబడటంతో ఈఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. స్వతహాగా ఆస్తిపరుడైన సీతారామరాజు అనంతర కాలంలో ఆస్తిని పోగొట్టుకుని, గంజాయి అక్రమ రవాణాను చేపట్టినట్లు పోలీసులు చెబుతున్నారు.

చిరు ధాన్యాల్లో పౌష్ఠికాహార విలువలు

❖ పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: చిరుధాన్యాలైన సజ్జలు, కొర్రలు, రాగులు, ఆరికెలు, సాములు తదితర పంటల ఉత్పత్తికి ప్రభుత్వం తరఫున చేయూత ఇస్తామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'పాత పంటల జాతర'కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించేందుకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండాలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సు, పాత పంటల జాతర జరిగింది. ఈ సందర్భంగా సబర్వాల్ మాట్లాడుతూ డీడీఎస్ ద్వారా దాదాపు 5000 మంది పేద, బలహీనవర్గాలకు చెందిన మహిళలు సంఘటితంగా చిరుధాన్యాలను పండిస్తూ, సామాజిక, ఆర్థిక అసమానతలను దాటి, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత వైపు అడుగులు వేయడం హర్షణీయమన్నారు. రైతులు తమ ఇష్టమైన పంటలను పండించుకునే హక్కు ఉందని, ప్రభుత్వం తరఫున రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం అందుతోందన్నారు. చిరుధాన్యాలు పౌష్టికరమైన ఆహార పదార్థాలని గుర్తు చేశారు. ఎలాంటి పౌష్టిక విలువలు లేని ఆహార పదార్థాలను పట్టణ, నగరాల ప్రజలు వినియోగిస్తున్నారని, చిరుధాన్యాలను వాడటం మంచిదని సలహా ఇచ్చారు. దీని వల్ల ప్రజలకు పౌష్టికరమైన ఆహారం లభించడమే కాకుండా, రైతులకు కూడా లబ్ధి జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ గాలెబ్ హాజరయ్యారు. జీవవైవిద్యం పట్ల విషేష కృషి చేసిన బిలాల్ పూర్ గ్రామ మహిళా రైతు మేథరి నాగమణి, అలగోల్ గ్రామానికి చెందిన మిసనగారి ఇందిర తదితరులను సత్కరించారు.



పాత పంటల జాతరను ప్రారంభిస్తున్న సబర్వాల్

విద్యార్థులకు ఉచితంగా కెరీర్ కౌన్సెలింగ్

చండీగఢ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'లక్ష్య' ప్రారంభం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: విద్యార్థులకు కేరీర్ పరంగా ఉచిత కౌన్సెలింగ్ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా చండీగఢ్ యూనివర్శిటీ 'లక్ష్య' కేంద్రాలను ప్రారంభించిందని, అందులో భాగంగా హైదరాబాద్‌లో కూడా ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు వర్శిటీ మీడియా హెడ్ ప్రొఫెసర్ ప్రభుదీప్ సింగ్ చెప్పారు. సోమాజీగూడలో ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించామని, తెలంగాణ విద్యార్థులు అంతా సంవత్సరం పొడవునా కెరీర్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు ఉచితంగా పొందవచ్చని అన్నారు. సోమవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు యువతరంలో నైపుణ్యాన్ని సంబంధించి పారిశ్రామిక రంగం అంచనాలు కూడా మారుతున్నాయని అన్నారు. పరిశ్రమ అంచనాలకు తగ్గట్టు యువతను సుశిక్షితులను చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాన్నీ తమ విద్యావిధానాన్ని సమూలంగా మార్చుకుంటున్నాయని చెప్పారు. కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చే వారికి సైకోమెట్రిక్ పరీక్ష నిర్వహిస్తామని, తమ జీవితానికి సంబంధించిన కేరీర్‌ను ఎంచుకునే అతికీలకమైన నిర్ణయం తీసుకునేందుకు ఇది విద్యార్థులకు ఎంతో సాయపడుతుందని పేర్కొన్నారు. యువతకు కెరీర్ అవకాశాలను మెరుగుపరిచే కొత్త ప్రోగ్రాంలను రూపొందించడంలో యూనివర్శిటీలు పోటీ పడుతున్నాయని, చండీగఢ్ యూనివర్శిటీలో దాదాపు 250 మంది తెలంగాణ విద్యార్థులు వేర్వేరు వృత్తి విద్యాకోర్సులను చదువుతున్నారని ప్రొఫెసర్ సింగ్ చెప్పారు. ఉన్నత విద్యకు సంబంధించి రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఎన్నో విజయాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు. 2018 బ్యాచ్‌లో 50 మంది విద్యార్థులకు గానూ 43 మంది విద్యార్థులవు కేంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా టాప్ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ పొందారని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థి మోనిక కాగ్నిజంట్, సైటేజ్ సాఫ్ట్‌వేర్‌లో ప్లేస్‌మెంట్ పొందారని అన్నారు. పెద్దపల్లికి చెందిన ఎంబీఏ విద్యార్థిని ఆకృతికి రిలయన్స్ సంస్థ , ఎంఆర్‌ఎఫ్ , నౌక్రీ డాట్ కామ్‌లలో ప్లేస్‌మెంట్ లభించిందని తెలిపారు. పరిశోధనకు సంబంధించిన రంగాల్లో తెలంగాణ విద్యార్థులు సాధించిన విజయాలు ప్రస్తావిస్తూ, ఆస్తమా డయాబెటిక్ రోగుల రక్షణకు మందుల అభివృద్ధి కంపెనీలో అమిత్ వీరపు భాగస్వామిగా ఉన్నారని అన్నారు. యూనివర్శిటీ 800 స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందని, దీనికి సంబంధించి అఖిల భారత స్థాయిలో సీయూశాట్-2019ను దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీయూశాట్ స్కాలర్‌షిప్ విధానం కింద 2019-20లో 109కి పైగా వృత్తివిద్యా కోర్సుల్లో 100 శాతం స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇందుకోసం విద్యార్థులు 'ఫాస్టుట్రాక్ డాట్ సీయుసిహెచ్‌డీ డాట్ ఇన్' అనే వెబ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని అన్నారు. యూనివర్శిటీ, కాలేజీ ప్రొఫెసర్లు చేస్తున్న కృషికి గౌరవంగా వారి పిల్లలకు 10 శాతం అకడమిక్ స్కాలర్‌షిప్‌ను అందించే కొత్తకార్యక్రమాన్ని కూడా ప్రొఫెసర్ సింగ్ ప్రకటించారు.



చండీగఢ్ వర్శిటీ ఆధ్వర్యంలో లక్ష్య కౌన్సెలింగ్ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్న వర్శిటీ మీడియా హెడ్ ప్రొఫెసర్ ప్రభుదీప్ సింగ్, జడ్‌ఎం శాంతికుమార్, ఏఎం క్రాంతికుమార్‌రెడ్డి, కౌన్సెలర్ ప్రసన్న

భారత అఖండతకే ఏబీవీపీ గౌరవ యాత్ర

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: భారత అఖండత , సార్వభౌమత్వాన్ని కాపాడేందుకే గౌరవ యాత్ర నిర్వహిస్తున్నట్టు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మట్ట రాఘవేందర్ పేర్కొన్నారు. అఖండతను కాపాడేందుకు ఈశాన్య రాష్ట్రాలు మొదలు చాలా మందిలో ఉన్న వ్యతిరేకత భావాన్ని తొలగించడం కోసం స్టూడెంట్స్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్ స్టేట్ లివింగ్ అనే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. విద్యార్థులను మిగిలిన రాష్ట్రాల్లో పర్యటింపచేసి జాతీయ భావాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేశామని అన్నారు. ఈ ఏడాది గౌరవ యాత్ర పేరుతో హైదరాబాద్‌కు 30 మంది విద్యార్థులు విచ్చేశారని, వారిని ప్రముఖుల ఇళ్లల్లో ఆశ్రయమిచ్చి మూడు రోజుల పాటు తెలంగాణ సంస్కృతిని, హైదరాబాద్ నగర విశిష్టతను తెలియజేయడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ మోహన్, , డిప్యుటీ మేయర్ ఫసియుద్దీన్‌లతో అల్పాహార సమావేశం ఏర్పాటు చేశామని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులతో, జేఎన్‌టీయూ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ జాతీయ అధ్యక్షుడు మురళీ మనోహర్, ప్రిన్సిపాల్ సాయి బాబా రెడ్డి, క్షేత్ర సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు రామకృష్ణ, డాక్టర్ శంకర్, శ్రీహరి, ఆనంద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు

సర్కారీ వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా తయారైందని , సంక్షేమ హాస్టళ్లకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కనీస వసతులు కూడా కల్పించకుండా ప్రకటనలకే పరిమితం అయిందని ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. శీతాకాలంలో చలికి అల్లాడుతున్న విద్యార్థులకు దుప్పట్లు, స్వెర్టర్లు , యూనిఫారాలు, కాస్మొటిక్ చార్జీలు సకాలంలో అందించకుండా , విడుదల చేసిన నిధులను పూర్తిగా ఖర్చు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. జిల్లా కన్వీనర్లు సుమన్, సురేష్, హాస్టళ్ల ఇన్‌ఛార్జి నరేందర్ ఆధ్వర్యంలో హాస్టళ్లను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక వినతి పత్రాన్ని అందజేశారు.

పవన్ చిలుక పలుకులు

వైకాపా నేత సజ్జల విమర్శ



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: జన సేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్ టీడీపీకి దగ్గరయ్యేందుకు చిలుక పలుకులు పలుకుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సజ్జల రామకృష్ణా రెడ్డి విమర్శించారు. టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తాజాగా రూట్ మార్చి పవన్‌ను పల్లెత్తు మాట అనకుండా ప్రధాని నరేంద్ర మోదీని, తమ పార్టీని టార్గెట్ చేసి విమర్శిస్తున్నారని సజ్జల సోమవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. సమైక్యాంధ్ర కోసం పోరాటం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చరించిన టీఆర్‌ఎస్ నాయకులే ఇప్పుడు పొగుడుతున్నారని పవన్ కల్యాణ్ ఆదివారం అన్నారని ఆయన చెప్పారు. సమైక్యాంధ్ర కోసం పోరాటం చేసింది గతం అని, రాష్ట్ర విభజన తర్వాత ఆ ప్రస్తావన అవసరం లేదని ఆయన అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు లేఖ ఇస్తామనడం గొప్ప విషయమని ఆయన తెలిపారు. తాను ఏర్పాటు చేయబోయే ఫెడరల్ ఫ్రంట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్య గురించి ప్రశ్నించగా, కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా మూడో ప్రత్యామ్నాయం ఏర్పాటైతే తాము చేరేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. పవన్ కల్యాణ్ తనకు తాను రాజకీయాలకు కొత్త అని చెప్పుకుంటున్నారని, నిజానికి పదేళ్ళుగా రాజకీయాల్లో ఉన్నారని ఆయన చెప్పారు. తనకు ఏమీ తెలియదంటే అది గొప్ప కాదని, అనర్హత అవుతుందన్నారు. పవన్ బస్సు మిస్ అయ్యిందని, విమానంలో ఇంధనం అయిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పుడు మళ్లీ వ్యూహం మార్చారని ఆయన విమర్శించారు.

షర్మిల ఉద్దేశం అది కాదు..

తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీ కుమార్‌కు ఫిర్యాదు చేసిన షర్మిల ఏపీ పోలీసులపై నమ్మకం లేకే ఇక్కడ ఫిర్యాదు చేశానని చెప్పడంతో ఏపీ పోలీసు సంఘం నిరసన వ్యక్తం చేయడం గురించి ప్రశ్నించగా, పోలీసులను వ్యక్తిగతంగా అనలేదని అన్నారు. ప్రభుత్వంపై నమ్మకం లేదని, కొంత మంది పోలీసు అధికారులు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నందున షర్మిల ఆ విధంగా వ్యాఖ్యానించారని సజ్జల చెప్పారు.

నవరత్నాలు కాపీ..

తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే ఏమీ చేస్తామో ప్రజలకు చెప్పేందుకు ప్రకటించిన నవరత్నాలను చంద్రబాబు కాపీ కొట్టారని, అందుకే పెన్షన్ పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని సజ్జల విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కదిరి, జనవరి 14: కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్ళాపూర్ సమీపంలో ఆర్టీసీ బస్సు లారీనీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరికొంత మందికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా కదిరి డిపో బస్సు బెంగళూరు వెళ్తుండగా చిక్‌బళ్ళాపూర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో బస్సు డ్రైవర్ హేమంత్‌కుమార్(35), కదిరికి చెందిన ప్రయాణికుడు నందసాయి(14) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

మూడో పెళ్లికి యత్నిస్తున్న

భర్తపై ఇద్దరు భార్యల ఫిర్యాదు

సనత్‌నగర్, జనవరి 14: ఇద్దరు భార్యలు ఉండగా మూడో పెళ్లికి యత్నిస్తున్న భర్తపై భార్యలు ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే....బోరబండకు చెందిన మహ్మద్ ఖాన్ గతంలో రుక్సార్ బేగం, నిస్సార్ బేగంలను వివాహం చేసుకున్నాడు. రెండో భార్య నిస్సార్ బేగం 15 రోజుల క్రితం బాబుకు జన్మనిచ్చింది. మూడో పెళ్లికి సిద్ధమైన మహ్మద్ అనుమతి పత్రంపై సంతకాలు చేయాలంటూ కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనితో ఆమె అతనిపై కేసు పెట్టింది.

సినీ దర్శకుడు రంగారావు మృతి

మేడారంలో అంత్యక్రియలు • నివాళులర్పించిన డైరెక్టర్ శంకర్



మేడారం గ్రామంలో సినీ దర్శకుడు రంగారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖ దర్శకుడు శంకర్



నేరేడుచర్ల, జనవరి 14: ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు, తెలుగు ఫిల్మిం అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కట్ట రంగారావు (59) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. గత కొంతకాలం నుంచి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. రంగారావు నల్లగొండ జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన కట్ట వెంకటరామయ్య అనుసూర్యల పుత్రుడు, వృత్తిపరంగా హైదరాబాద్‌లోని మలకోపేట్‌లో స్వగృహం నిర్మించుకొని నివసిస్తున్నారు. ఆయనకు భార్య వనజతో పాటు ఇరువురు కుమారులు ఉన్నారు. సినీ రంగంపై మక్కువతో సుమారు 1985 ప్రాంతంలో చెన్నైలో వివిధ దర్శకుల వద్ద సహాయకులుగా పనిచేశారు. 1989లో నేరేడుచర్లకు చెందిన నిర్మాత వల్లంశెట్ల శ్రీనివాస్ రావు నిర్మించిన రాజశేఖర్ జీవిత జంటగా ఇంద్రధనస్సు సినిమాతో దర్శకత్వం వహించి సినీ రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. 1990 సంవత్సరంలో ఉద్యమం సినిమాకు కథరచయితగా, దర్శకునిగా పనిచేసి నంది అవార్డు పొందారు. అంతేకాకుండా అలెగ్జాండర్, నమస్తే అన్న, ఆఖరి క్షణం, చెప్పుకోండిచూద్దాం, వారెవా మొగుడా, బొబ్బిలి బుల్లోడు తదితర తెలుగు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఇటీవల తెలుగు ఫిల్మిం అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ సినీ రంగానికి సేవలందిస్తున్నారు. రంగారావు అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన నేరేడుచర్ల మండలం మేడారంలో నిర్వహించారు. ఆయన ఆకస్మిక మృతిపట్ల బంధుమిత్రులు, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారీ ఎత్తున బంధువులు, మిత్రులు సినీ రంగానికి చెందిన పలువురు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సినీ దర్శకుడు కట్ట రంగారావుకు మేడారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఎన్.శంకర్ పాల్గొన్నారు. రంగారావు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ రంగారావు అత్యంత సౌమ్యుడని తెలుగు ఫిల్మిం అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సేవలందిస్తు పలువురి డైరెక్టర్ల ప్రశంసలు అందుకున్నారని ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన వెంట తెలుగు ఫిల్మిం అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రాంప్రసాద్, జాయింట్ డైరెక్టర్ ఎంఎస్ సభ్యులు రమేష్‌రెడ్డి, మన్నెవాసి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు మామిడి నాగసైదులు పాల్గొన్నారు.



మురమళ్ల బరిలో కోడి పందేలు దృశ్యం

కో‘ఢీ’..!!

తొలి రోజు రూ. 50 కోట్ల పందేలు, జూదాలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 14: గోదావరి జిల్లాల్లో కోడి చట్టాన్ని ‘ఢీ’ కొట్టింది. ఆడతామని పోలీసులతో పందెం కట్టింది. పోలీసు యంత్రాంగం నిర్బంధం మధ్య సోమవారం భోగి రోజు జిల్లాలో పందేలు మొదలయ్యాయి. సోమవారం వేకువ జాము నుంచి పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ మధ్యాహ్నం నుంచి పందేలు మొదలయ్యాయి. చాలావరకు బరులు పోలీసులకు తెలియకుండా తయారు చేశారు. పోలీసులు పసిగట్టిన కోడిపందేల బరుల వద్దకు వెళ్లే పోలీసులు నిర్వాహకులను, పందెం రాయుళ్లను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు.

గోదావరి జిల్లాలో కోనసీమ, మెట్ట, మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి యధేచ్ఛగా సాగాయి. కోడి పందెం బరులకు అనుబంధంగా నంబర్ గుండాట, పేకాట తదితర జూదాలతో పాటు మద్యం అమ్మకాలు కూడా జోరుగానే మొదలయ్యాయి. జిల్లాలో మొదటి రోజు ఇటు పందేలు, అటు అనుబంధ జూదాలు కలిపి దాదాపు రూ.50 కోట్ల వరకు జరిగి ఉంటాయని అంచనా వేశారు.

కోర్టు ఆంక్షలు, పోలీసు దాడులు ఉన్నప్పటికీ జిల్లాలో భోగి రోజు సుమారు 90 బరుల్లో పందేలు జరిగాయి. చివరి నిముషంలో రాజకీయ వత్తిళ్లకు పరిమితమయ్యారని తెలుస్తోంది. ఇప్పటికే పలు కేసులు పెట్టి దాదాపు భోగిరోజు వరకు చాలా హడావిడి చేశారు. అయితే పండగ మూడు రోజులైనా తప్పదన్నట్టుగా రాజకీయ వత్తిళ్ళ నేపథ్యంలో పోలీసులు స్టేషన్లకు పరిమితమైనట్టు తెలిసింది.

కోనసీమలోని ఐ పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, రాజోలు, మల్కిపురం, అంబాజీపేట మండలాల్లో కోడి పందేలు, గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. కాట్రేనికోన మండలానికి ఇతర ప్రాంతాల నుంచి పందెం కాసేవారు రాకుండా పోలీసులు పికెటింగ్ కూడా నిర్వహించారు. కాట్రేనికోనలో చెయ్యేరు, ఉప్పూడి, రాజుపాలెం, పాత ఇంజరం, కొత్తలంక, ఎదుర్లంక, మూలపాలెం, గుత్తెనదీవి, కేశనకుర్రు, నడవపల్లి, ఐ పోలవరం మండలం అన్నంపల్లి, అల్లవరం మండలం కొమరిగిరి, గోడిలంక తదితర గ్రామాల్లో పందేలు జరిగాయి. కాట్రేనికోన మండలం గెద్దనాపల్లి, అల్లవరం గోడిలంకలో భారీ స్థాయిలో జరిగినట్టు తెలిసింది.

ఎన్నికలు సమీపిస్తోన్న క్రమంలో ప్రజా ప్రతినిధులెవరూ పందేల ఛాయలకు కూడా వెళ్లకూడదని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యేలెవరూ పందేల జోలికి వెళ్లలేదు. అనపర్తి మండలంలో ఉదయం నుంచే కోడిపందేలు ఆరంభమయ్యాయి. పోలీసులు ఉదయం నుంచీ ఆయా బరుల వద్ద హడావిడి చేశారు. అనంతరం రాజకీయ వత్తిళ్లతో పోలీసులు పక్కకు తప్పుకున్నారని తెలిసింది. అయితే ఇప్పటికే పోలీసులు ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో కేసులు నమోదు చేశారు కాబట్టి అనంతరం ఎదురయ్యే కోర్టు సమస్యలకు కూడా తాము కేసులు పెట్టామని చెప్పుకునేందుకు సరిపోతుందన్నట్టు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్టు తెలిసింది. మైదాన ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి కోడిపందేలు జోరందుకున్నాయి. అనపర్తి మండలం పేరారామచంద్రపురం, మహేంద్రవాడ, అనపర్తి, దుప్పలపూడి, రాయవరం మండలం కొప్పవరం, పులగుర్త ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించారు. పోలీసులు వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా హడావిడి చేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలీ, తాడిపూడి, లొల్ల, పులిదిండి, పేరవరం ప్రాంతాల్లోనూ, పిఠాపురం మండలం వీరవాడ, రంపచోడవరం మండలం వేములకొండ, సోకులగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. జగ్గంపేట మండలం మర్రిపాకలో పామాయిల్ తోటలో కోడిపందేలు యధేచ్ఛగా సాగాయి. ఉప్పలగుప్తం మండలం కూనవరం, చల్లపల్లి, గొల్లపల్లి, భీమనపల్లి ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా జరిగాయి. సామర్లకోట మండలం వేట్లపాలెం, వీకే రాయవరం, రాజానగరం మండలం రాజానగరం, దివాన్‌చెరువు, నరేంద్రపురం, పుణ్యక్షేత్రం, కొత్తపేట మండలం కొత్తపేట, రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వై రామవరం, దేవీపట్నం మండలాల్లోనూ అరకొరగా కోడిపందేలు నిర్వహించారు. కోరుకొండ, గోకవరం మండలాల్లో ఒక చిన్న తరహాలో కోడిపందేలు యధేచ్ఛగా సాగాయి.



పందెం కోడి పుంజులకు కత్తులు కడుతున్న దృశ్యం



సంక్రాంతి అంటేనే సరదా. సంక్రాంతి సరదాల్లో మరింత ముఖ్యమైన, ఆకర్షణీయమైన అంశం కోడి పందేలు. చిన్నా పెద్దా, పేద, ధనిక తారతమ్యం లేకుండా సంక్రాంతి కోడిపందేలకు సై అంటారు. దీనిలో భాగంగానే విశాఖ నగర పరిధి సింహాచలంలో కోడి పందేల ముచ్చట తీర్చుకుంటున్న మంత్రి గంటా శ్రీనివాసరావు. -బ్యూరో, విశాఖపట్టణం

తిరుగు ప్రయాణాలకు 3020 ఆర్టీసీ బస్సులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 14: సంక్రాంతి సెలవుల సందర్భంగా తమ స్వగ్రామాలకు చేరిన ప్రయాణికులు తిరిగి తమ నివాస ప్రాంతాలకు చేరుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ముందెన్నడూ లేనివిధంగా 3020 బస్సులు సిద్ధం చేసింది. ఈ బస్సులు ఈ నెల 16 నుంచి 20 వరకు తిరుగుతాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రధానంగా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి రాష్ట్రేతర ప్రాంతాలకు, రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడవనున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ నగరానికి వివిధ జిల్లాల నుంచి 1115 బస్సులు నడుస్తాయి. హైదరాబాద్‌కు విజయవాడ నుంచి 275, గుంటూరు నుంచి 150, ఒంగోలు నుంచి 160, తూర్పు గోదావరి జిల్లా నుంచి 150, కర్నూలు నుంచి 100, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 75 బస్సులు నడుస్తాయి. ఇక బెంగళూరుకు చిత్తూరు నుంచి 200, కడప నుంచి 110, కర్నూలు నుంచి 90, నెల్లూరు నుంచి 55, అనంతపురం నుంచి 50, మిగిలిన ప్రాంతాల నుంచి మరికొన్నిటితో కలిపి మొత్తం 570 బస్సులు నడుస్తాయి. చెన్నై నగరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 202 బస్సులు నడుస్తాయి. ఇందులో విజయవాడ నుంచి 35, నెల్లూరు నుంచి 35, కడప నుంచి 35 బస్సులు నడుస్తాయి. ఇక విశాఖకు 219 బస్సులు నడవనుండగా, విజయనగరం, శ్రీకాకుళం నుంచి 110, తూర్పు గోదావరి నుంచి 72, విజయవాడ నుంచి అమలాపురం, రాజమండ్రి వైపు 175 బస్సులు, తూర్పు గోదావరి జిల్లా నుంచి విజయవాడకు 123 బస్సులు నడిపేందుకు సిబ్బందిని సన్నద్ధం చేశామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీ సురేంద్రబాబు ఆంధ్రభూమి ప్రతినిధికి తెలిపారు.

‘రిటర్న్ గిఫ్ట్’ తప్పదు బాబూ..!

★ తెలంగాణ మాజీ మంత్రి తలసాని వ్యాఖ్య ★ దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

★ యాదవ్ కార్పొరేషన్ కోసం సర్కారుకు సూచన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 14: రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ పనితీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని, వచ్చే ఎన్నికల్లో బాబుకు తప్పకుండా టీఆర్‌ఎస్ తరపున రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాజకీయాల్లో ఇచ్చిపుచ్చుకోవటం సహజమేనని వ్యా ఖ్యానించారు. నగరానికి సమీపంలోని ఇబ్రహీంపట్నం నుంచి భారీ ర్యాలీగా వచ్చిన తలసాని సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుని మొక్కుబడి తీర్చుకున్నారు. అనంతరం తనను కలిసిన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సంక్షేమం, అభివృద్ధి కోరుకుంటున్నారని, అయితే చంద్రబాబు మాత్రం బాహుబలి సెట్టింగ్‌లు చూపిస్తున్నారని తలసాని విమర్శించారు. హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్ అంతా తానే కట్టినట్టు ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలంతా బీజేపీ, కాంగ్రెస్ లేని ఫెడరల్ ఫ్రంట్‌ను కోరుకుంటున్నారని చెప్పారు. బాబు వెంటపడి తాము ఏనాడైనా ఆంధ్రకు వచ్చామా అని ప్రశ్నిస్తూ ఆయన మాత్రం తరచూ తెలంగాణకు వచ్చి తమకు వ్యతిరేకంగా పనిచేస్తుంటే.. తాము మాత్రం ఇక్కడకు వచ్చి పని చేయాలా, వద్దా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చినప్పుడు తాముకూడా ఇక్కడకు వచ్చి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి కదా అన్నారు. బాబుపై తమకు కోపం లేదంటూ దేశ రాజకీయాల్లో పని చేసే క్రమంలోనే ఆంధ్రకు కూడా రాబోతున్నామని చెప్పారు. తాను ఇక్కడకు వస్తున్నానని తెలిసి దాదాపు లక్ష ఫోన్‌కాల్స్ వచ్చాయని, రాష్ట్ర రాజకీయాల్లో తాను మరింత జోక్యం చేసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారన్నారు. తమ గిఫ్ట్ ప్రభావం ఏమేర, ఎంతలా ఉంటుందో త్వరలోనే ప్రజలంతా చూస్తారని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో జరిగిన యాదవుల ఆత్మీయ సమ్మేళంలో తలసాని మాట్లాడుతూ ఆంధ్రలో యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో ఐదుగురు శాసనసభ్యులు, ఒక రాజ్యసభ సభ్యుడితో యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 5వేల కోట్ల రూపాయలతో ఒక నిధిని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.




దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు అమ్మవారి ఆలయ కేలండర్, ప్రసాదం అందజేస్తున్న ఈవో కోటేశ్వరమ్మ

తెలుగుదేశం, చంద్రబాబుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం

★ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఖండన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 14: సోషల్ మీడియాలో షర్మిలపై జరుగుతున్న ప్రచారాన్ని తాము ఖండిస్తున్నామని, షర్మిల తమపై ఆరోపణలు చేయడం దురదృష్టకరమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసే నీచ సంస్కృతి వైసీపీకే ఉందని, తమ అధినేత చంద్రబాబుది అలాంటి సంస్కృతి కాదన్నారు. వారి ఆరోపణలకు సాక్ష్యాధారాలుంటే బయటపెట్టాలన్నారు. రాష్ట్ర పోలీసులకు సాక్ష్యాధారాలు ఇస్తే దోషులపై చర్యలు తీసుకుంటారన్నారు. తెలుగుదేశం నాయకులపై సోషల్ మీడియాలో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమ నాయకులపై సోషల్ మీడియాలో వైసీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి ప్రొఫైల్ పెట్టుకుని దుష్ప్రచారం, అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టినప్పుడు సాక్ష్యాధారాలు సహా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు వారిని అరెస్టు చేస్తే వైసీపీ నాయకులు, లాయర్లు పూచీకత్తు, జామీన్లు ఇచ్చి విడిపించిన సందర్భాలున్నాయని, సాక్ష్యాధారాలతో సహా తాము నిరూపిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీపై, చంద్రబాబుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనికి జగన్, షర్మిల్ బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. ఎవరో సైకోలు చేసిన పనికి తమ పార్టీని, చంద్రబాబును బురదలోకి లాగడం సరికాదని వైవీబీ అన్నారు. జగన్ దాడి కేసు ఎన్‌ఐఏకు అప్పగిస్తే తమకేమీ భయం లేదన్నారు. కోడికత్తి కేసును సీఐఏతో విచారణ జరుపుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. ఎన్‌ఐఏ విచారణ రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్లో కేంద్రం అనుచిత జోక్యం చేసుకోవడమేనని వ్యతిరేకించారు. ఆంధ్ర ప్రజల సార్వభౌమత్వానికి ఇది మచ్చ అని ఖండించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నాడు మోదీ ఎన్‌ఐఏ విచారణను ఎందుకు వ్యతిరేకించాడో జీవీఎల్, కన్నా, బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఆంధ్ర బీజేపీ నాయకులు తెలుగు ప్రజలకు శనిగ్రహాల్లా దాపురించారని ఆయన విమర్శించారు. దగ్గుబాటి కుటుంబం వైసీపీలోకి ప్రవేశించడంతో మోదీ - జగన్‌ల లాలూచీ, కుట్ర రాజకీయాలు బహిర్గతం అవుతున్నాయన్నారు. బీజేపీ, వైసీపీ పరస్పరం లాలూచీతో నాయకులను పంచుకుంటున్నాయని, చంద్రబాబు పించన్ల పెంపు పంచ్‌తో వైసీపీకి దిమ్మ తిరిగిపోయిందన్నారు. పింఛన్ల పెంపుతో 60లక్షల పేద కుటుంబాలు నిజమైన సంక్రాంతి జరుపుకుంటున్నాయని వైవీబీ స్పష్టం చేశారు. విలేఖరుల సమావేశంలో పార్టీ నాయకులు షేక్ మొహ్మద్ ఫైజాన్, తెలుగు యువత నాయకులు కొండా ప్రవీణ్, యలమంచిలి ప్రసాద్ పాల్గొన్నారు.



తొలిదశలో 42 పంచాయతీలు ఏకగ్రీవం

★ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో రెండో దశకు భారీగా నామినేషన్లు

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 14: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొలి దశలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో 42పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ఆదివారం అధికారులు అన్ని పత్రాలను పరిశీలించి ఖమ్మం జిల్లాలో 21, కొత్తగూడెం జిల్లాలో 21పంచాయతీలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. 42సర్పంచ్ పదవులతో పాటు 316వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. రెండో దశలో ఎన్నికలు జరిగే 14మండలాల పరిధిలోని గ్రామాల్లో కూడా అధిక భాగం ఏకగ్రీవం చేసేందుకు ఆయా పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. కొన్నిచోట్ల అధికారులు కూడా లోపాయికారీగా స్థానిక నేతలతో మాట్లాడుతూ ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం నుంచి 10లక్షల రూపాయల నిధులు వస్తాయని చెబుతున్నట్లు తెలుస్తోంది. రెండో దశ ఎన్నికలు జరిగే 14మండలాల్లో ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గుచూపిన నేపథ్యంలో ఈ ప్రాంతాలపై అందరి దృష్టి పడింది. టీడీపీ శాసనసభ్యులుగా గెలిచిన సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు గ్రామ పంచాయతీ ఎన్నికలపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో కార్యకర్తలు తమ వైఖరిని చెప్పలేకపోతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న పరిస్థితులను బట్టి ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకుంటూ ఎన్నికలకు వెళుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఘోర పరాజయం పాలైన టీఆర్‌ఎస్ నేతలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో ఎక్కువ మంది సర్పంచ్‌లను గెలుచుకోవడం ద్వారా ఈ రెండు జిల్లాల్లో పార్టీ బలహీనపడలేదని తమ అధినేతకు తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అందులోభాగంగా తొలి దశలో ఏకగ్రీవమైన 42పంచాయతీల్లో ఎక్కువ మందిని తమ శిబిరంలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే రెండో దశలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో కూడా ఎక్కువ మంది తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. రెండో దశ నామినేషన్ల ఘట్టం ముగియడంతో 14మండలాల పరిధిలోని సర్పంచ్ పదవులకు 1656 మంది, వార్డు పదవులకు 7,477 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కారేపల్లి మండలంలోని 41 పంచాయతీలకు అత్యధికంగా 280 సర్పంచ్ పదవులకు, 356 వార్డులకు 996 మంది పోటీ పడటం విశేషం.

పెరిగిన చలి గాలులు

★ కమ్ముకుంటున్న పొగ మంచు

★ ఉత్తర గాలుల ప్రభావంతో పెరిగిన చలి

★ విమానాల రాకపోకలకు అంతరాయం

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 14: తెలుగు రాష్ట్రాల్లో చలి గాలుల తీవ్రత పెరుగుతోంది. పలు పట్టణాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా తగ్గుతున్నాయి. సాయంత్రం అయ్యే సరికి చలి తీవ్రత మరింత పెరుగుతూ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. సైబీరియా నుంచి వచ్చే గాలులు తగ్గుముఖం పట్టినప్పటికీ, సముద్రంపై నెలకొన్న పీడనం పెరిగి పొగమంచు కమ్ముకునే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఉత్తరాదిలో పెరుగుతున్న చలి తీవ్రత ఆంధ్రప్రదేశ్‌కు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల వరకూ కొనసాగుతోంది. దీని ప్రభావం కూడా కొంతమేర ఆంధ్రప్రదేశ్‌పై నెలకొంటోంది. ఈ పరిస్థితి మార్చి నెలాఖరు వరకూ కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు భానుకుమార్ ‘ఆంధ్రభూమి’కి తెలిపారు. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉంటుందన్నారు. దీనితో పాటు విశాఖ పరిసరాల్లో పారిశ్రామిక వాతావరణం కూడా పొగమంచు దట్టంగా కమ్ముకోవడానికి ఒక కారణంగా పేర్కొన్నారు. ఇక గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. తెలంగాణాలో కూడా ఇదే పరిస్థితులు ఉన్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొంటున్నారు. కోస్తాలో 2 డిగ్రీల వరకూ తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా విశాఖలో సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఉదయం 9 గంటల వరకూ పొగమంచుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పొగమంచు కారణంగా విశాఖ విమానాశ్రయంలో ఉదయం రావాల్సిన పలు విమానాలు 20 నుంచి 30 నిముషాలు ఆలస్యంగా నడిచాయి. మధ్యాహ్నం 2.10 గంటలకు విశాఖ వచ్చి 2.40 గంటలకు తిరిగి వెళ్లాల్సిన బెంగళూరు-విశాఖ ఇండిగో విమానం రద్దయింది.



రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేని జగన్‌కు ఇక్కడి ఓట్లెందుకు?

★ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనందసూర్య విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 14: సొంత రాష్ట్ర పోలీసులపై ఏమాత్రం నమ్మకం లేని ప్రతిపక్ష నేత జగన్‌కు ఈ రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు లేదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పింఛన్లను క్రమంగా పెంచుతూ నిస్సహాయులకు చేయూతనిస్తున్నారని చెప్పారు. గతంలో రూ.200 ఉన్న వృద్ధాప్య పింఛన్లను ఏకంగా వెయ్యి రూపాయలకు పెంచగా, ఈ జనవరి నుంచి వారందరికీ రూ. 2వేలు చేస్తూ సగర్వంగా ప్రకటించారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సంక్రాంతి కానుకగా పేద బ్రాహ్మణులకు వృద్ధాప్య పింఛన్ రూ. 2వేలు అందజేయనున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని బ్రాహ్మణ యువతులకు నియోజకవర్గానికి 100 కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఇప్పటివరకు బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా రూ. 270 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ. 15కోట్లు వెచ్చించటానికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పేద అర్చకులు, వేద పండితులను పెళ్లి చేసుకునే అమ్మాయిలకు రూ. 75వేలు కల్యాణమస్తు పథకం ద్వారా ఇస్తున్నామన్నారు. రాష్ట్రం రూ. 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్నా సంపద సృష్టించి రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర ప్రజలు మళ్లీ గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. అనేక సంక్షేమ పథకాలు చేపడుతూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్న ముఖ్యమంత్రిపై హైదరాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ కుమార్తె షర్మిళ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయటం అనుచితమన్నారు. తనపై సోషల్ మీడియాలో వచ్చిన అసభ్యకర వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయటంలో తప్పులేదని, కానీ సీఎంపై ఫిర్యాదును తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేకపోవటం వల్లే పక్క రాష్ట్రంలో ఫిర్యాదు చేశామని ఆమె అనటం హాస్యాస్పదమన్నారు. ఐదేళ్లుగా పోస్టింగ్‌లు వస్తుంటే ఇప్పుడే ఆమెకు మెలకువ వచ్చిందా? అని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి కుమార్తెగా ఆమెకు తగిన గౌరవ మర్యాదలు లభిస్తాయని, కానీ తనపై అసభ్య వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ ప్రోత్సహిస్తోందని ఆమె ఆరోపించటం చాలా వింతగా, విడ్డూరంగా ఉందని ఖండించారు. రాష్ట్ర పోలీస్ శాఖ తన సోదరుడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు పూర్తిగా భద్రత కల్పించిన విషయాన్ని షర్మిల మరచిపోవటం అన్యాయమన్నారు. కోడికత్తి డ్రామాతో రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని జగన్ చెబుతున్నారని, ఇదే పద్ధతిలో ఆయన సహోదరి షర్మిళ కూడా విమర్శలు చేయటం హాస్యాస్పదమని ఆనంద సూర్య ఖండించారు.

మహిళల్ని కించపరిచే సంస్కృతి వైసీపీదే

★ తోబుట్టువులుగా భావించే పార్టీ టీడీపీ

★ మంత్రి పరిటాల సునీత స్పష్టీకరణ

గుంటూరు, జనవరి 14: మహిళలను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టించిన సంస్కృతి, చరిత్ర వైసీపీ నాయకులదేననే విషయాన్ని వైఎస్ షర్మిల గుర్తుంచుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత అన్నారు. సోమవారం ఇక్కడి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న సోషల్ మీడియా తెలుగుదేశం పార్టీ మహిళా ఎమ్మెల్యేను కించపరుస్తూ అసభ్యకరంగా పోస్టింగులు పెట్టించిన విష్ణయాన్ని మీరు మర్చిపోయినా, ప్రజలు మరవలేదన్నారు.

మహిళా శాసనసభ్యులపై వ్యక్తిగత విమర్శలు చేసి కంటతడి పెట్టించిన ఘనుడు మీ సోదరుడు జగనేనన్న వాస్తవాన్ని గుర్తెరగాలన్నారు. షర్మిలపై జరుగుతున్న ప్రచారంతో తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, షర్మిలతో పాటు ఏ మహిళపై ఇలాంటి ప్రచారం జరిగినా తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వైసీపీ నాయకుల ఆరోపణలు అర్ధరహితమంటూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఇన్నాళ్లూ ఈవిషయంలో మౌనంగా ఉండి కేవలం ఎన్నికల సమయంలో దీన్ని రాజకీయం చేసే ఉద్దేశంతోనే షర్మిల రాద్ధాంతం చేస్తున్నారని ఆమె విమర్శించారు.

మహిళలను కించపరచడం తగదు

★ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 14: రాజకీయాల్లో మహిళలను కించపర్చేలా అసత్య ప్రచారాలు చేయడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా వైఎస్ షర్మిలపై దుష్ప్రచారాలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మహిళలు ఏ రాజకీయ పార్టీల వారైనప్పటికీ తల్లి, చెల్లిలా గౌరవించాలన్నారు. రాజకీయ కుయుక్తుల కోసం మహిళలను బలిపశువులను చేయడం తగదని హితవు పలికారు. షర్మిలపై తప్పుడు ప్రచారాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించి షర్మిలకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను కోరుతున్నట్లు రామకృష్ణ తెలిపారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

మంగళవారం, 15 జనవరి 2019

మకర సంక్రాంతి ఖగోళంలో సంభవించే వెలుగుల విప్లవానికి ప్రతీక. ఈ వెలుగుల విప్లవం సూర్యుని చుట్టూ భూమి తిరగడంవల్ల ప్రతి సంవత్సరం నియతంగా ప్రస్ఫుటిస్తున్న పునరావృత్తి! సృష్టిగత వాస్తవాలు మానవ జీవన సంస్కృతిగా సమాజగతం కావడం అనాదిగా కొనసాగుతున్న హైందవ జాతీయ ప్రస్థానం. భారత ఖండపు భౌతిక సాంస్కృతిక పరిధికి ఆవల ఉన్న మానవులు చాలా ఆలస్యంగా గుర్తించిన ఈ వెలుగుల విప్లవం గురించి భారతీయులకు అనాదిగా తెలుసు. ఈ వాస్తవ ధ్యాస ప్రాతిపదికగానే 'మకర సంక్రాంతి' మన దేశంలో అనాదిగా జరుగుతోంది. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమించడంవల్ల పనె్నండు సంక్రాంతులు ఏర్పడుతున్నాయి. వీటిలో మకర సంక్రాంతికి కర్కాటక సంక్రాంతికి అధికాధిక్యమైన ప్రాముఖ్యం ఉంది. కర్కాటక సంక్రాంతి నుంచి ఆరు నెలలపాటు- భూమికి సాపేక్షంగా- సూర్యుడు క్రమక్రమంగా దక్షిణం వైపు జరుగుతాడు. అందువల్ల భూమిపైన ఉత్తరార్ధగోళంలో క్రమంగా వెలుగు తగ్గుతుంది. పగటి నిడివి తగ్గుతుంది, రాత్రి కాలవ్యవధి పెరుగుతుంది, చీకటి పెరుగుతుంది. ఉత్తరార్ధగోళంలోని ప్రజలకు అందువల్ల ఈ ఆరునెలల 'దక్షిణాయనం' అంత ఇష్టంకాదు. చీకటి సమయం సగం కంటె ఎక్కువ కాబట్టి. మకర సంక్రాంతికి ముందురోజున ఉత్తరార్ధగోళంలో ఈ వైపరీత్యానికి పరాకాష్ఠ! 'మకర సంక్రాంతి' ఏర్పడడంతో- భూమి నుండి గమనించినప్పుడు సాపేక్షంగా- సూర్యుని ఉత్తర దిశాప్రస్థానం మొదలవుతుంది. భూమధ్య రేఖకు దక్షిణంగా ఇరవై మూడున్నర అక్షాంశ 'భాగా'- డిగ్రీ-ల దూరంలో మకర రేఖ నెలకొని ఉంది. భూమధ్య రేఖకు ఉత్తరంగా ఇరవై మూడున్నర 'భాగా'ల దూరంలో "కర్కాటక" రేఖ నెలకొని ఉంది. కర్కాటక రేఖ మన దేశంలోని గుజరాత్ మధ్యప్రదేశ్ ఝార్ఖండ్ పశ్చిమ బెంగాల్ ప్రాంతాల మీదుగా ఈశాన్య ప్రాంతంవరకు కొనసాగుతోంది. కర్కాటక రేఖ నుంచి మకర రేఖ వరకు ఆరునెలల సూర్యుని ప్రస్థానం దక్షిణాయనం. మకర రేఖనుంచి కర్కాటక రేఖవరకు సూర్యుని ఆరు నెలల ప్రస్థానం ఉత్తరాయణం! ఉత్తరాయణం ఆరంభం కావడంతో మకర సంక్రాంతినుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఉత్తరార్ధ గోళంలో క్రమంగా రాత్రి నిడివి తగ్గుతుంది, చీకటి సమయం సగానికంటె తక్కువస్థాయికి తగ్గుతుంది. పగటి సమయం పెరుగుతుంది, వెలుగు వికసిస్తుంది, విస్తరిస్తుంది. ఉత్తరార్ధ గోళంలో వెలుగుల విస్తరణకు ఆరంభం మకర సంక్రాంతి! మన దేశం ఉత్తరార్ధగోళంలో ఉంది! అందువల్లనే క్రమంగా, చీకటి పెరగడానికి ప్రతీక అయిన కర్కాటక సంక్రాంతిని మనం ఉత్సవంగా జరుపుకోవడం లేదు. క్రమంగా వెలుగును పెంచే సూర్యుని ఉత్తరాయణానికి శుభారంభమైన మకర సంక్రాంతి ఈ దేశంలో అనాదిగా ఉత్సవమైంది. ఈ వెలుగుల విప్లవానికి దక్షిణార్ధగోళం లోను, ఉత్తరార్ధగోళంలోను పరస్పరం వ్యతిరేకగతిని సంతరించుకొని ఉండడం సృష్టిగతమైన ఖగోళ వాస్తవం!

వెలుగులను పంచుతున్న సూర్యుడు, వెలుగులను పెంచుతున్న భూమి పరిభ్రమణం 'మకర సంక్రాంతి'కి ప్రాతిపదిక! సూర్యుని ప్రాధాన్యం గుర్తించిన భారతీయులు అనాదిగా సూర్యుని ఆరాధిస్తున్నారు!! 'సౌరశక్తి దేశాల కూటమి'- ఇంటర్ నేషనల్ సోలార్ అలియన్స్-ని ఏర్పాటుచేయడం ద్వారా మన ప్రభుత్వం సూర్యుని ప్రాధాన్య ధ్యాసను మరింత పెంచగలిగింది. అమెరికా బ్రిటన్ రష్యా చైనాలు సహజంగానే ఈ కూటమిలో లేవు. ఎందుకంటె ఈ దేశాలన్నీ సౌరశక్తి మండలానికి ఉత్తరంగా నెలకొని ఉన్నాయి.

వెలుగుల విప్లవ వేళ..

మకర రేఖ నుంచి కర్కాటక రేఖ వరకు విస్తరించిన 'భూగోళం'మాత్రమే సౌరశక్తి మండలం. ఈ సౌరశక్తి మండలం మానవ నిర్మితం కాదు, ఇది ప్రకృతిలో సహజంగా నిహితమై ఉన్న అనాది వ్యవస్థ!... సంపన్న అగ్ర రాజ్యాలను ఈ కూటమినుంచి తొలగించడానికి ప్రకృతి ఇలా సహకరించింది. ఈ కూటమికి మన దేశం నాయకత్వం వహించగలగడం ఇలా ప్రకృతి సిద్ధమైన పరిణామం! ప్రకృతిలో మానవాళి మాత్రమేకాదు సమస్త జీవజాలం భాగం. మకర సంక్రాంతి సందర్భంగా ప్రకృతికి పూజలు చేస్తున్న భారతీయులు అనాది ఈ 'అద్వైత' వాస్తవాన్ని గుర్తించారు. సృష్టి, సృష్టికర్త వేఱు వేఱుకాదు. సృష్టి సృష్టికర్త ఒకటే! ప్రకృతి పరమాత్మ వేఱు వేఱు కాదు, ఒకటే! ఈ అద్వైత స్థితిని గుర్తించిన భారతీయులు ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానం చేసుకున్నారు. ''ప్రకృతిని ఆరాధించడం''అంటే ప్రకృతిని పరిరక్షించడమే! ఇలా ప్రకృతిని పరిరక్షించడం మానవులు తమనుతాము పరిరక్షించుకోవడం! పంటలు ఇంటికి చేరేవేళ 'మకర సంక్రాంతి'ని ఉత్సవంగా జరుపుకొనడం ద్వారా ప్రకృతికి ప్రాతిపదిక అయిన భూమాతకు అంజలి ఘటిస్తున్నాము. భూమి మిగిలిన ప్రాకృతిక శక్తులయిన నీరు, నిప్పు, గాలి, ఆకాశాలకు ఆధారం అన్నది సనాతన జీవన సత్యం... అందువల్లనే పుడమితల్లిని పూజించడం 'మకర సంక్రాంతి' ఉత్సవం...!

నీరు, గాలి, ఆకాశం, భూమి కాలుష్యగ్రస్తం అయిపోతుండడం నడచిపోతున్న వైపరీత్యం. భూమిని సహజంగా దున్ని సారవంతంచేస్తున్న వానపాములు- ఎఱలు- ప్రాకృతిక పరిపుష్ట వ్యవస్థలో భాగం, ఈ వానపాములకు ఆహారమైన ఆవుల పేడ పశువుల పేడ ఆకులు అటవీ ఉత్పతుతలు వ్యవసాయాన్ని పోషించాయి. అందువల్లనే 'గోమాత' ఈ దేశ ప్రజలకు అనాదిగా ఆరాధ్యం అయింది. అడవి, 'కనుమ' పర్వతము పూజనీయతకు ప్రతీకలయ్యాయి. కనుమను పర్వతాన్ని అనాదిగా భారతీయులు పూజించారు. ద్వాపర యుగంలో బలరామకృష్ణుల ఆధ్వర్యంలో జరిగిన 'గోవర్ధనగిరి' పూజ కనుమ పండుగకు ఒక ప్రతీక మాత్రమే! చరిత్రలో అసంఖ్యాక ఉదాహరణలు. కనుమల నుంచి పర్వతాల నుంచి ప్రభవిస్తున్న వాగులు, ఏఱులు, నదులు మహాప్రవాహాలుగా మారి వివిధ పద్ధతుల ద్వారా పంట భూములను పండిస్తున్నాయి, మానవులకు జంతువులకు, వృక్షాలకు జీవజవాలను ప్రసాదిస్తున్నాయి. ఇలా పర్వత నిసర్గజీవన జలాలు అమృతము! అందువల్లనే పర్వతాలు మాతృదేవికి మాతృభూమికి స్తనమండనం' - వక్షస్థలమైంది. ఈ వక్షస్థలం నుంచి పాలను, నీళ్లను పొందుతున్న 'జన సముదాయాలు' ఈ భూమి పట్ల మాతృభావాన్ని కలిగి ఉండడం సహజం! జన సముదాయం కానీ అనేక జన సముదాయాలు కానీ ఒక జాతిగా ఒకే జాతిగా వికసించడానికి ఈ మాతృ మమకారం మౌలికమైన ప్రాతిపదిక! భారతీయులు అనాదిగా ఒకే జాతిగా జీవనప్రస్థానం సారించడానికి ఇదీ కారణం. ఈ సృష్టిగత వాస్తవం సమాజ స్థితం కావడమే అనాదిగా వైదిక జీవనం, సనాతన సంస్కృతి, భారతీయత... హైందవ జాతీయతత్త్వం! పుడమి పరిరక్షణ మకర సంక్రాంతి పూజలకు, ఉత్సవాలకు ఫలశ్రుతి....

ఇలాంటి సనాతన జీవన స్వచ్ఛతకు దశాబ్దుల తరబడి అపవాదం ఏర్పడింది! ఈ అపవాదం- ఎక్సెప్షన్- సాధారణ నియమం- జనరల్ రూల్-గా మారిపోవడం శతాబ్దుల విదేశీయ దురాక్రమణ ఫలితం! భౌతిక దురాక్రమణ నుంచి విముక్తమైన భారతావని ఆర్థిక దురాక్రమణకు బలిఅవుతుండడం నడుస్తున్న చరిత్ర. గోసంతతిని హత్యచేశారు, అడవులను నరికివేశారు. సంప్రదాయ సిద్ధమైన 'ఎఱువులు' మృగ్యం అయ్యాయి. కృత్రిమ రసాయనాలతో కలుషితమైన పుడమి, ప్రకృతి గాయపడడం నడుస్తున్న చరిత్ర. వానపాములు, ఉడుతలు, పిచ్చుకలు హరించుకొనిపోతున్నాయి, హననం అవుతున్నాయి! మన పంటలకు 'బి.టి.' - బాసిలస్ తురిన్ జెన్సిస్- తెగులు సోకడం కాలుష్యానికి పరాకాష్ఠ! పత్తిని 'ప్లాస్టిక్'దిగమింగింది! భారతీ గగన వీధులలో చైనావారి 'పతంగు'లు - గాలిపటాలు- ఎగురుతుండడం 'మకర సంక్రాంతి'ని నిలదీస్తున్న వికృత దృశ్యాలు! ఈ ఆర్థిక దురాక్రమణ తొలగి మన సీమలలో స్వచ్ఛమైన మధుర సంక్రాంతి శోభలు కొలువుతీరేదెప్పుడో....??

సరిహద్దు రక్షణ సైనికులది రాజకీయ రక్షణ ఓటర్లది

భారతదేశాన్ని నిర్వీర్యం చేసి వారివారి సిద్ధాంతాలను, మతాలను వ్యాపింపచేయాలని మూడు రకాల శక్తులు తీవ్రంగా పనిచేస్తున్నాయి. ప్రపంచంలోనే అధిక జనాభాగల చైనాతో మావోయిస్టులు- మార్క్సిస్టులతో సంబంధం కొనసాగిస్తున్నవారు. క్రైస్తవ దేశాల క్రైస్తవ మిషనరీల నుండి అండదండలు పొందుతూ ఉన్న క్రైస్తవ మత ప్రబోధకుల, ఇస్లాం మతం ప్రబోధకుల ఉపన్యాసాలకు మతి చలించి వారితో సంబంధం పెట్టుకున్న జీహాదీలు.

భారతదేశం వేల ఏళ్లుగా కులాల ప్రాతిపదికనే కొనసాగటం భారత జాతీయ నిష్ఠకు నిదర్శనం. కాని స్వాతంత్య్రం పొందిన తరువాత స్వపరిపాలన, సుపరిపాలనతో విదేశీయుల పాలనలో అంతమొందించబడిన ఆర్థిక వ్యవస్థను, సామాజిక, సాంస్కృతిక, విద్యావ్యవస్థలను పునరుద్ధరించుకొనుటకు ఏర్పాటుచేసికొన్న అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. కాని ఇట్టి రాజ్యాంగం విదేశీ మతాల భావజాలానికి, విదేశీయుల కనుసన్నలలో విదేశాలలో విద్యనభ్యసించిన విద్యావంతులచేత ఏర్పాటుచేయనైనది.

జ్ఞానం అనేది జన్మపొందిన ప్రతి ప్రాణికి ఉంటుంది. కాని విజ్ఞానం మాత్రం విద్య ద్వారానే సాధ్యమౌతుంది. జ్ఞానికి, విజ్ఞానికి అస్థిత్వం అనేది ప్రధానం. అస్థిత్వం అనేది ఆయా వ్యక్తులు జన్మించిన జన్మభూమిలోని అనాదిగా వస్తున్న, కొనసాగుతున్న సంస్కృతి ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. అట్టి సంస్కృతినే జాతి లేదా జాతీయత అంటాము. ప్రపంచంలోని అనేక దేశాలలో జాతి వ్యక్తులవల్ల ఏర్పాటైంది. ఎందుకంటే పూర్వం వారు ఉండే ప్రాంతంనుండి జాతి నుండి కొన్ని అనివార్య కారణాలవల్ల వారినుండి దూరం కావలసి వచ్చినప్పుడు, వారిని అణగత్రొక్కబడుతున్న వారికి ఎదురొడ్డే వారికి నాయకత్వం వహించి అట్టి బృందానికి విముక్తికలిగించి వారిని ప్రత్యేక తెగవారిగా నామకరణం చేసి వారికి ప్రత్యేక అస్తిత్వం కలిగించిన వారు ఆ తెగవారికి జాతిపితగా మారుతున్నారు. అట్టి జాతి భాషా ప్రాతిపదికనగానీ, భౌగోళిక పరిస్థితుల కనుగుణంగా గానీ, పూర్వం వున్నవారి సంస్కృతిలో కొంత మార్పుచేసికొని నూతన జాతులు అనేకం ఏర్పడ్డాయి. అట్టి జాతులవారికి ఒక మతం కావలసి వస్తుంది. అట్టివారు నూతన సిద్ధాంతాలను, పద్ధతులను, ఆచార వ్యవహారాలను ఏర్పాటు చేసికొని దానిద్వారా వారి ఉనికిని కాపాడుకొనుటకు జనబాహుళ్యాన్ని పెంచుకొని జన సంఖ్య ద్వారా రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొనుటకు ఆధిపత్య పోరు ప్రారంభిస్తారు. ఇది రెండు రకాలుగా చేస్తుంటారు. ఒకటి మతం ఆధారంగా, రెండు అధికారం ద్వారా సాధించే ప్రయత్నం చేస్తుంటారు.

క్రీ.శ.712లో ఆక్రమణదారులైన ఇస్లాంలు భారతదేశంపై విజయం సాధించారు. వీరి తరువాత పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి వీరి వెనువెంట బ్రిటన్‌వారు మన దేశానికి వచ్చినవారే. వీరందరు ఆక్రమణదారులు, దోపిడీదారులే తప్ప వలసవాదులు కాదు. వీరిలో ప్రతి ఒక్కరు వారివారి స్థాయిలలో భారతదేశ సంపదను దోచుకున్నారు. అంతటితో ఆగకుండా వారివారి మతాలను, భాషలను, సంస్కృతిని భారతీయులపై ప్రతిష్ఠించడానికి వివిధ రకాలైన అకృత్యాల ద్వారా వారు మొదటగా రాజ్యాల ఆక్రమణ, దేవాలయాల విధ్వంసం, విద్యాలయాలు, వ్యాపార కేంద్రాల ఆక్రమణ, భారతీయ ఇతిహాసాల వక్రీకరణ, భారతీయ భాషల స్థానంలో వారివారి భాషలను ప్రవేశపెట్టుట జరిగింది. అదే క్రమంలో మసీదులను, చర్చీలను నిర్మాణం చేశారు. వాటి నిర్వహణ పేరుతో లక్షల ఎకరాల భూములను కేటాయించి వారి మతాల ఆస్తులుగాను చిత్రీకరించారు. ఇస్లాం మతస్తులకు, క్రైస్తవ మతస్తులకు స్మశాన వాటికలకు లక్షల ఎకరాలు భూములను కేటాయించి, భారత భూభాగాన్ని ఇస్లాం, క్రైస్తవ మతాలవారు కబ్జాచేసుకున్నారు.

ఇరవై ఎనిమిదవ కలియుగం 5120 సంవత్సరాలని చెప్పుకుంటున్న భారతీయుల జీవిత కాలం 196 కోట్ల సంవత్సరాలని చెప్పుకుంటున్న భారతీయుల సంస్కృతి జీవన విధానం ఈనాటికి కొనసాగుతున్నప్పటికీ 1947 తరువాత పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆక్రమిత కాశ్మీర్ మత ప్రాతిపదికన భారత భూభాగం నుండి వేరైనప్పటినుండి కూడా భారతదేశంలో దాదాపు 85 శాతం హిందువులున్నారు. భారతదేశంలో గ్రామ స్థాయి నుండి మహానగరాల వరకు హిందువులకు స్మశాన వాటికలు లేవు. గ్రామాలలో ఒకటి రెండు కుటుంబాలు ఉన్న ఇస్లాం మతం, క్రైస్తవ మతాల వారికి మసీదు, ఈద్గా, చర్చి, స్మశాన వాటికలు ఉన్నాయి. హిందువులు మాత్రం వారివారి వ్యవసాయ భూములలో, భూములు లేని వారు గ్రామానికి దూరంగా ఉన్న అడవి ప్రాంతంలో ఎవరికి తోచిన దగ్గర వారు దహన సంస్కారం చేసుకొని చేతులు దులుపుకుంటున్నారు. హిందువులకు మహానగరాలలో స్మశాన వాటికలు ఉన్నా అవి నామమాత్రమే. కాని స్మశాన వాటిక కావాలని కోరుతున్నవారు లేకపోవడం శోచనీయం. భారత ప్రజలలో అస్తిత్వం లేకుండా చేసినవారు భారతీయులకు జాతిపిత అయినారు. ఎన్నికల సందర్భాలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాత్రం ఇస్లాంలకు, క్రైస్తవులకు మసీదులు, చర్చీల నిర్మాణానికి భూములు, నిధులు సమకూర్చుతామని అలాగే స్మశాన వాటికకు కూడా భూములు కేటాయిస్తామని వాగ్దానాలు చేస్తుంటారు. ఇలా వాగ్దానాలుచేసే రాజకీయ పార్టీలు, నాయకులు 'సెక్యులరిస్టులు' వీరికి హిందువుల అవసరాలు కనిపించవు. ఎందుకంటే మేము హిందువులమే కాబట్టి హిందువుల ఓట్లు మాకెలాగూ వేస్తారనేది వారి ప్రగాఢ నమ్మకం. అంతేకాదు వివిధ రకాల తాయిలాలు వ్యక్తిగత లాభాపేక్షకు ఉపయోగపడేవి అందిస్తామంటారు. వ్యక్తిగత లాభాపేక్షకే పరిమితమైన హిందువులు సామూహికమైన, సమాజహితమైన అభివృద్ధిని మాత్రం కోరుకోరు. సామూహిక, సమాజహితమైన అభివృద్ధిచేసే రాజకీయ పార్టీలను ప్రజలు గుర్తించటంలో పొరబడుతున్నారు. ఆదరించినా తాత్కాలికమే! వ్యక్తిగత, తాత్కాలిక తాయిలాలూ మాత్రమే అభివృద్ధిగా భావించడం స్వాతంత్య్రం వచ్చిన నాటినుండి ఈనాటివరకు అదే కొనసాగుతున్నది. 2018 డిసెంబర్ 7నాటికి ముగిసిన ఐదు రాష్ట్రాల ఎన్నికలలో వివిధ పార్టీల నాయకులు చేసిన వాగ్దానాలన్నీ వ్యక్తిగతంవి మాత్రమే తప్ప రాష్ట్రహితం, సమాజహితానికి సంబంధించినవి నామమాత్రమే.

ప్రపంచంలో లేని పథకాలను ఆవిష్కరించడంవల్లనే తెలంగాణా ప్రజలు గుర్తించి పట్టం కట్టినారని చెప్పే పెద్దమనిషి ఇండ్లులేని బీదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి కేంద్రంనుండి వచ్చిన నిధులను ఉపయోగించలేక బీదలకు చేసిన నష్టాన్ని ప్రజలు ముందుంచకుండా అత్యధిక మెజారిటీ సాధించిన కారణాన వచ్చే సాధారణ ఎన్నికలలో బిజెపి, కాంగ్రెసేతర కూటమి ఏర్పాటుచేస్తానని చెప్పడం హాస్యాస్పదం కాదా? తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూటమి ఏర్పాటుచేసి తననుతానే కాకుండా కూటమినే బొక్కబోర్లవేసి కేంద్రంలో చక్రం తిప్పుతానంటున్న చంద్రబాబు ముందు తన పాలనలో ఉన్న తన రాష్ట్రంలో తిరిగి ప్రభుత్వాన్ని సాధించగలనని బిజెపియేతర కూటమి ఏర్పాటుచేయగల సమర్థత ఉన్న వీరు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు హామీ ఇవ్వగలడా? ఒకవైపున రాష్ట్రాన్ని దోచుకుంటూ ఏసుప్రభువు దయవల్ల పిలుపు ఇవ్వగానే 35వేల ఎకరాల భూమిని రైతులు ఏమి ఆశించకుండా రాజధాని నగర నిర్మాణానికి ఇచ్చినారంటూ బహిరంగ సభలలో మాట్లాడటం సామాన్య ప్రజలలో మత విశ్వాసాలను నాటడం కాదా? భూములను త్యాగంచేసిన వారేమో హిందువులు. కొనియాడుతున్నదేమో ఏసు ప్రభువును. ఇదే చంద్రబాబు రాజకీయ అనుభవం. మరోవైపేమో మా రాష్ట్రానికి నరేంద్రమోదీ నిధులు ఇవ్వకుండా మోసం చేసినాడని వాపోతుంటాడు. ఇచ్చిన నిధులకేమో లెక్కలు చెప్పడు. రాష్ట్ర అభివృద్ధిని పక్కకుపెట్టి ముస్లింల మసీదులకు, ఇమామ్‌లకు వారి పిల్లల విదేశాల చదువులకు కోట్ల రూపాయలు ప్రకటించినాడు. వీటి ప్రచారానికి ఎలక్ట్రానిక్ మీడియాకు లక్షలు ఖర్చుపెట్టడం అంత అవసరమా?

మిజోరాం రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు స్థానాలకే పరిమితమైందంటే మిజోరాం రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదనేదే కదా? వీరిని ఎన్నుకుంటే దేశానికేం చేస్తారనేది దేశ ప్రజలకు తేటతెల్లమైంది. మధ్యప్రదేశ్‌లోను, రాజస్థాన్‌లోను స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేని ఇతరులపై ఆధారపడిన కాంగ్రెస్ వాపును చూసి బలుపుగా మురిసిపోతున్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే కాంగ్రెస్ ఓటమిపాలైన బిజెపి కంటే తక్కువ ఓట్లువస్తే ప్రజలు వారి పక్షాన ఉన్నట్లు ఎట్లైతదో చెప్పలేరు. ఐదు సంవత్సరాలకొక పర్యాయము ప్రభుత్వాన్ని మార్చే ఆనవాయితీ కొనసాగుతున్న రాజస్థాన్‌లో కాంగ్రెస్ గెలుపు విశేషమా? ఇక చత్తీస్‌గఢ్ గెలుపంటారా? అర్బన్ నక్సలైట్లు, క్రైస్తవ మిషనరీల అంతర్గత అండదండల నేది బహిరంగ రహస్యమే కదా! రమణ్‌సింగ్ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేయలేదని అక్కడి ప్రజలు ఒక్కరుకూడా చెప్పరు.

రాబోవు సాధారణ ఎన్నికలలో దేశ ప్రజలు ప్రలోభాలకు, మోసాలకు, సెంటిమెంట్లకు లోనుకాకుండా, వ్యక్తిగత లాభాపేక్ష ఆశించకుండా, సామూహిక అభివృద్ధి ఆశిస్తూ, దేశ భద్రత, అవినీతి నిర్మూలన, అన్ని రంగాలలో అభివృద్ధి, యువకులకు ఉపాధి, స్త్రీల, రైతుల సంక్షేమము 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' చేయగల సమర్థవంతమైన, నిజాయితీపరుడైన, కఠోర పరిశ్రమ, నిరంతరం దేశహితంకొరకు పనిచేసే ప్రధానమంత్రిని దేశానికి అందించే పార్టీనే గెలిపించడం ప్రజల విజ్ఞత.

-బలుసా జగతయ్య.. *90004 43379*

లోపభూయిష్ట రిజర్వేషన్ల విధానం

సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి ఇస్తున్న రిజర్వేషన్లు, తాజాగా ఆర్థికంగా వెనుకబడిన ఉన్న వారికి ఇస్తున్న రిజర్వేషన్లు ఓట్లు దండుకునే మంత్రాంగంగా మారటం శోచనీయం. రాజకీయ నాయకులు తమ పదవులను పదిలం చేసుకునేందుకు రిజర్వేషన్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు తప్ప ఆయా సామాజిక వర్గాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగించటం లేదు. రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరుగుతున్నాయా? లేదా? అనేది ఏరోజూ సమీక్షించలేదు. రిజర్వేషన్ల విధానం లోపభూయిష్టంగా మారినా దీనిని సంస్కరించే ధైర్యం మన పాలకులు చూపించలేకపోతున్నారు. రిజర్వేషన్ల విధానం రాజకీయ పార్టీలకు ఓట్లు తెచ్చిపెట్టే సాధనాలుగా మారాయి తప్ప సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాల అభ్యున్నతికి ఆశించిన స్థాయిలో తోడ్పడటం లేదు. రిజర్వేషన్ల మూలంగా బాగుపడిన వాడే బాగుపడుతున్నాడు తప్ప నిజంగా అవసరమున్న వాడికి పెద్దగా మేలు కలగటం లేదు. ఓటు బ్యాంకు రాజకీయానికి అలవాటుపడిన మన నాయకులు తమ పదవీ రాజకీయాల కోసం మరింత మందిని రిజర్వేషన్ల పరిధిలోకి తెస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం హిందు, సిక్కు, జైన, బౌద్ధ, ఇస్లాం మతాలని అగ్రవర్ణాలలోని ఆర్థికంగా వెనుకబడి ఉన్న లేదా బీద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న వర్గాల ప్రజలకు 27 శాతం, ఎస్.సిలకు 12 శాతం, ఎస్.టిలకు ఏడు శాతం రిజర్వేషన్లకు తోడుగా ఇప్పుడు అగ్రవర్ణాలలోని ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. దీని వలన మొత్తం రిజర్వేషన్ల శాతం అరవైకి చేరుకున్నది. మిగతా నలభై శాతం అన్ని వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు కేటాయిస్తారు.

రాజ్యాంగ నిర్మాతలు విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే ఉద్యోగాలు, ఉన్నత విద్యలో రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. అందుకే రాజ్యాంగంలోని పదిహేనవ ఆర్టికల్‌లో విద్యాపరంగా వెనుకబడి ఉన్న వారికి రిజర్వేషన్లు కల్పించాలని పొందుపరస్తే 16వ ఆర్టికల్‌లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలనే అంశాన్ని పొందుపరిచారు. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉన్నత వర్గాలలోని బీద ప్రజలకు ఆర్థికంగా వెనుకబడి ఉన్నందుకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు కొట్టివేయకుండా చూసేందుకు రాజ్యాంగంలోని 15,16 ఆర్టికల్‌లను సవరించి అందులో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న వారితోపాటు ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి కూడా రిజర్వేషన్లు కల్పించేందుకు వీలు కల్పించారు. సుప్రీం కోర్టు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా తమ తీర్పులు ఇస్తుంది కాబట్టే నరేంద్ర మోదీ ప్రభుత్వం తాజాగా తీసుకున్న పది శాతం రిజర్వేషన్లను కొట్టివేయదని బి.జె.పి నాయకులు వాదిస్తున్నారు. మన పాలకులు గత డెబ్బై సంవత్సరాల పాలనలో వెనుకబడిన వర్గాలు, ఎస్.సి, ఎస్.టిలను ఉన్నత స్థాయికి తీసుకురాలేక పోయారు కానీ ఉన్నత వర్గాలలోని పది శాతం జనాభాను వెనుకబడిన వర్గాలుగా మార్చివేసిన ఘనత సాధించారు. ఇది సిగ్గుచేటు కాదా. సమాజంలోని ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి వెళ్లాలి తప్ప కింది స్థాయికి జారి పోకూడదు. మన దేశంలో ఇందుకు భిన్నంగా జరుగుతోందనేందుకు ఉన్నత వర్గాలలోని బీద వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించటమే నిదర్శనం. ప్రజలు ఏ వర్గానికి చెందినవారైనా రిజర్వేషన్ల ఊతంతో కాకుండా స్వశక్తితో ముందుకు సాగగలిగినప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు అవుతుంది. రిజర్వేషన్ల మద్దతు ఉన్న వారు అభివృద్ధి చెందకపోవటం ఒక ఎత్తైతే ఉన్నత వర్గాల వారికి కూడా రిజర్వేషన్ల అవసరం ఏర్పడటం అంటే మనం పురోగమిస్తున్నామా? తిరోగమిస్తున్నామా? ఉన్నత వర్గాల వారు సైతం రిజర్వేషన్ల సహాయం తీసుకోవలసి రావటం మన పాలకుల అసమర్థత పాలనకు అద్దం పడుతోంది. మన దేశం జనాభా దాదాపుగా 132 కోట్లు కాగా ఇందులో దాదాపు డెబ్బై శాతం మంది బి.సి, ఎస్.సి, ఎస్.టిలుంటే ముప్పై శాతం మంది ఉన్నత వర్గాల వారున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న మొత్తం ఉద్యోగాల సంఖ్య దాదాపుగా రెండు కోట్ల ఇరవై లక్షలు. ఇందులో సైనిక దళాల, ఇతర భద్రతా దళాల ఉద్యోగాలు లేవు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య ముప్పై రెండు లక్షలైతే ఆయా రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఉద్యోగాల సంఖ్య దాదాపు ఒక కోటి డెబ్బై లక్షలు. ఈ మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత వర్గాల వారి సంఖ్యే అధికమనే ఒక వాదన. ఎందుకంటే మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఏ కులం వారు ఎంత శాతం ఉన్నారనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం రావటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పేందుకు అంగీకరించటం లేదు. ఇదిలా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పాలకులందరు దాదాపుగా ఉన్నత వర్గాల వారే. గవర్నర్లు, ఇతర ఉన్నత పదవులను పరిశీలించినా ఉన్నత వర్గాల వారే అధికంగా కనిపిస్తారు. ఇక న్యాయ వ్యవస్థలో దాదాపు తొంభై శాతం పదవులు ఉన్నత వర్గాల వారి ఆధీనంలో ఉన్నాయి. అందుకే న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేయాలని లోకజనశక్తిపార్టీ అధినాయకుడు, కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ పదే పదే డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రివర్గాల్లో ఏ కులం వారు ఎక్కడెక్కడ ఉన్నారనేది పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ముఖ్యమైన మంత్రి పదవులు, ముఖ్యమైన శాఖలన్నీ ఉన్నత వర్గాల వారికే ఉన్నాయి. ఇక ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల వ్యవహారం పరిశీలిస్తే ఆశ్చర్యం వేయకమానదు. దేశంలోని అన్ని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, నిర్మాణ రంగాలు ఉన్నత వర్గాల వారివే. విద్యా రంగం, సినిమా రంగం, భవన నిర్మాణ రంగం, ఇలా ప్రతి రంగం ఉన్నత వర్గాల వారి చేతుల్లో ఉండటంతోపాటు అందులోని ఉద్యోగాలు కూడా ఉన్నత వర్గాల వారికే అందుతున్నాయి. ఉన్నత వర్గాల్లో విద్యావంతుల సంఖ్య అధికం కావటం వల్లనే ఈ పరిస్థితులు నెలకొన్నాయి. మెజారిటీ ఉన్నత పదవుల్లో ఉన్న అగ్రవర్ణాల వారిలో కూడా ఆర్థికంగా వెనుకబడిన వారున్నప్పుడు ఇక బి.సి, ఎస్.సి. ఎస్.టిలు ఎలాంటి దుర్భర పరిస్థితులలో ఉన్నారనేది సులభంగానే అంచనా వేయవచ్చు. బి.సి, ఎస్.సి. ఎస్.టి వర్గాల వారు ఇటీవల బాగా చదువుతూండటం వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పోటీ పెరిగిపోయింది. ఒక వైపు బి.సి, ఎస్.సి, ఎస్.టికి చెందిన విద్యావంతులు పెరిగిపోవటం, దీనికి రిజర్వేషన్లు తోడు కావటంతో ఈ వర్గాలకు చెందిన వారు ఉన్నత విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో అగ్రవర్ణాల వారికి పోటీ ఇవ్వటం వలన ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. విద్యా రంగంలో ముందుకు వెళితే తప్ప మనకు భవిష్యత్తు లేదని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్న వెనుకబడిన కులాల వారు తమ పిల్లలను కష్టపడైనా చదివిస్తున్నారు. దేశంలోని కోట్లాది మంది వెనుకబడిన వర్గాల్లో విద్యావంతుల సంఖ్య పెరిగే కొద్దీ ఉద్యోగాలు, ఇతర రంగంల్లో పోటీ పెరిగిపోయి సమాజంలో అనూహ్యమైన మార్పులు రావటం ఖాయం. వెనుకబడిన కులాల వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పించటం అనేది రికార్డులకు మాత్రమే పరిమితమై పోయింది. వాస్తవానికి బి.సిలకు ఏడెనిమిది శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ల సౌకర్యం లభించటం లేదు. ఇక ఎస్.సి, ఎస్.టిల్లో రిజర్వేషన్ల అమలు అత్యంత గందరగోళంగా ఉన్నది. ఎస్.సి, ఎస్.టిలో రిజర్వేషన్ల మూలంగా ఉన్నత పదవులు సంపాదించుకున్న వారి పిల్లలే రిజర్వేషన్ల సౌకర్యం పొందుతున్నారు. అట్టడుగున ఉన్న ఎస్.సి, ఎస్.టి వర్గాల ప్రజల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఎస్.సి, ఎస్.టి ఏ.ఐ.ఎస్ అధికారుల పిల్లలకు కూడా రిజర్వేషన్ల సౌకర్యం కల్పించటం ఏ విధంగా సమర్థనీయం. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల విషయంలో అస్తవ్యస్థ విధానాలను అవలంభిస్తున్నాయి. రాజకీయ పార్టీలు బి.సి, ఎస్.సి, ఎస్.టి, ఓ.సిలలోని బీద ప్రజల ఓట్లను ఆశిస్తున్నాయి తప్ప వారి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేయటం లేదు. రిజర్వేషన్ల ఫలితాల గురించి జాతీయ స్థాయిలో లోతైన సమీక్ష జరగాలి. చిత్తశుద్ధితో సమీక్ష జరిపి దీనిలోని లోపాలు, తప్పులను సరిదిద్దేందుకు ధైర్యంతో కూడిన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. రాజకీయాధికారంలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం లభించనంత వరకు వారి అభివృద్ధి, అభ్యున్నత అసాధ్యం. వడ్డించే వాడు మన వాడు కాబట్టే సమాజంలోని కొన్ని వర్గాల వారు మాత్రమే అభివృద్ధి చెందుతూ అన్ని సౌకర్యాలు పొందుతున్నారు. రాజ్యాధికారం అన్ని వర్గాల వారికి లభించినప్పుడే సమసమాజ స్థాపన సాధ్యం అవుతుంది.

ఢిల్లీ కబుర్లు

కె.కైలాష్ 98115 73262

ఔను! ఆర్.. అంటే రాహుల్‌గాంధీ!

శిష్ట్ర వాక్యం

ప్రొ. ముదిగొండ శివప్రసాద్

మిషెల్ జేమ్స్ క్రిస్టియన్ బ్రిటీషు పౌరుడు. అమెరికాలోని స్పింక్స్ మెకానికా సంస్థకు దళారీగా పనిచేస్తున్నాడు. ఇతడు ఇండియాతో సహా చాలా దేశాలకు తన సంస్థ తరపున హెలీకాప్టర్లు సరఫరా చేస్తుంటాడు. ఆ సందర్భంలో కొందరు ప్రముఖులకు తగిన రీతిలో ముడుపులు (కమీషన్లు) సమర్పించి కాంట్రాక్టులు తెచ్చుకుంటుంటాడు. ఇది అతని వ్యాపార రహస్యం.

ఈ ముడుపుల బాగోతంలో అతనిని మిలన్ కోర్టు అభిశంసించింది. ఈయన అరబ్ ఎమిరిటస్ పారిపోయి అక్కడ దాక్కున్నాడు. ఇండియాకు కావలసిన హెలీకాప్టర్ల కొనుగోలు శ్రీమతి సోనియాగాంధీ తన సౌకర్యార్థం కొనుగోలు చేసింది. ''ఎత్తైన విమానాలు నేను ఎక్కలేను'' అని విమానం ఎత్తును తగ్గించి కాంట్రాక్టు ఇప్పించింది. మిషెల్ తండ్రి (బ్రిటన్) ఈమెకు సన్నిహితుడు. ''నా కొడుకుకు ఏదైనా పెద్ద కాంట్రాక్టు ఇప్పించండి'' ఆయన సోనియాగాంధీని వేడుకున్నాడు. ఆ మేరకు అగస్తా వెస్ట్‌లాండ్ రక్షణ విమానాల కొనుగోలు కాంట్రాక్టు వీరికి లభించింది. ఇది 300 కోట్ల వ్యవహారం. ఇందులో మిషెల్ భారీగా కొందరికి ముడుపులు అందజేశాడు. ఈ విషయం తర్వాత పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు ఆనాటి రక్షణ మంత్రి ఎ.కె.ఆంటోనీ 'ముడుపులు కొందరికి అందిన మాట వాస్తవమే- అందుకే కాంట్రాక్టు రద్దుచేస్తున్నాము' అని పార్లమెంటులోనే ప్రకటించాడు.

ఇంతకూ ఈ ముడుపులు ఎవరెవరికి అందాయి? ఆనాటి రక్షణాధికారి త్యాగి కుటుంబానికి అందినట్లు నిర్ధారణ అయింది. ఇంకా కొందరి పేర్లు మిషెల్ డైరీ నోట్‌లో దొరికాయి. అవి కోడ్ నేమ్స్- అంటే పొడి అక్షరాలల్లో ఉన్నాయి. ''ఎ-పి'' అంటే ఎవరు?

1) ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకుడు కావచ్చు. అప్పుడు ఎ.పి వ్యక్తి రక్షణ ఉపమంత్రిగా ఉన్నాడు. ఆయన పేరు పళ్లంరాజు. ఐతే వ్యక్తిగతంగా పళ్లంరాజు నిజాయితీకి పర్యాయ పదం కాబట్టి ఈ ఎ-పి కేంద్ర మంత్రి ముడుపులు తీసుకున్నాడు- అని ఎవరూ నమ్మరు.

2) ఎ-పి అంటే అడ్మిరల్ ప్రకాశ్ ఇతడు రక్షణ శాఖాధికారి. ఈ కోణంలో విచారణ జరుగుతున్నది.

3) ఎ-పి అంటే అహ్మద్‌పటేల్. ఇతడు సోనియా ఇటాలియాకు రాజకీయ సలహాదారు. ఆర్థిక బినామీలను చూచుకుంటూ ఉంటాడు. కాబట్టి ఎ-పి. అంటే అహ్మద్‌పటేల్ అని నిఘా విభాగం వారు నిర్ధారించుకుంటున్నారు.

ఇక ఆర్ అంటే ఎవరు? ఇది రాహుల్‌గాంధీ పేరు పొడి అక్షరం. 'సిగ్నోరా గాంధీ' అంటే శ్రీమతి గాంధీ అని అర్థం. ఇక ఈ సందర్భంలో రెండు ఉత్తరాలు దొరికాయి. వాటిల్లో 'జి' అనే అక్షరానికి గాంధీ అని అర్థం. 'ఇటాలియన్ వనిత కుమారుడు భవిష్యత్తులో భారత ప్రధాని కాబోయేవాడు' అని 2010నాటి ఆ లేఖలో ఒక వాక్యం ఉంది. అంటే 'ఆర్' అనే పొడి అక్షరానికి రాహుల్ గాంధీ అని అర్థం. ''ఆర్.వి.'' అంటే రాబర్ట్ వద్రా అని తాత్పర్యం. ఇతనికి ముట్టిన సంపద ఎంత?? అది ఏ విదేశీ బ్యాంకులో జమచేయబడింది??

లోగడ బోఫోర్స్ కుంభకోణానికి సంబంధించి రాజీవ్‌గాంధీకి లభించిన ముడుపులు ఆయన స్వయంగా పాకిస్తాన్‌కు చెందిన ఒక బ్యాంకులో జమ చేశాడు. ఆ పాకిస్తాన్ బ్యాంకు బ్రాంచీ బొంబాయిలో ఉంది. అక్కడికి రాజీవ్ గాంధీ ఒక నల్ల సూట్‌కేసులో డబ్బును తీసుకొని పోయి జమ చేశాడు.

ఇప్పుడు అరబ్ ఎమిరిటస్‌నుండి ఇండియాకు తరలింపబడ్డ మిషెల్‌ను సిబిఐ విచారిస్తుంటే ఆయనను విడిపించటంకోసం జోసఫ్ అనే న్యూఢిల్లీ కాంగ్రెసు నాయకుడు (లాయర్) వకాల్తా పుచ్చుకున్నాడు. ఈయన వాదం ఏమిటంటే. ఈ డైరీలు ప్రామాణికం కాదు. లోగడ జైన్ హవాలా కేసులోను సహారా కేసులోను కోర్టులు డైరీ వ్రాతలకు ప్రాధాన్యం ఇవ్వలేదు అంటే డైరీలో ఎవరైనా ఈ పొడి అక్షరాలు వ్రాయవచ్చు. ఈ వాదం బాగుంది కదూ!!

సోదికోసం సోదికి పోతే పాత రంకులు బయటపడ్డాయి అని తెలుగులో ఒక జానపద సామెత ఉంది. అగస్తా వెస్ట్‌లాండ్ ఛాపర్ డీల్‌లోని ముడుపులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేటు మిషెల్ జేమ్స్ క్రిష్టియన్‌ను విచారిస్తుంటే కేవలం వెస్ట్‌లాండ్ ఛాపర్స్‌ల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలే కాకుండా లోగడ జరిగిన మరికొన్ని రక్షణ కొనుగోళ్ల సందర్భంలో ముట్టిన ముడుపుల వివరాలు కూడా బయటకు వచ్చాయి. వాటిని ఇ-డి, సిబిఐ దర్యాప్తు కోర్టుకు లిఖిత పూర్వకంగా జనవరి మొదటివారంలో సమర్పించింది.

న్యాయమూర్తి అరవిందకుమార్‌కు అందిన సమాచారం ప్రకారం రక్షణశాఖ పరికరాల కొనుగోళ్లను 25 మిలియన్ యూరోలు ముట్టాయి. అగస్టా వెస్ట్‌లాండ్ ఛాపర్ల కొనుగోళ్లలో 16096245 పౌండ్ల మేరకు ముడుపులు అందాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి.పి.సింగ్- ఎన్‌కె మిట్టాల్ అందించిన సమాచారం ప్రకారం మిషెల్ రహస్య సమాచారాన్ని క్రమక్రమంగా వెల్లడిస్తున్నట్లు అవగతమవుతున్నది. ఈ పాపం నుండి ఇక సోనియాగాంధీ తప్పించుకోజాలదు. మిషెల్‌కు బెయిల్ ఇప్పించి ఇండియా నుండి తప్పించాలని జోసఫ్ అనే కాంగ్రెస్ నాయకుడు ప్రయత్నిస్తున్నాడు. అదే జరిగితే మిషెల్ తన స్వదేశమైన బ్రిటన్‌కు పారిపోతాడు అని ప్రాసిక్యూటర్లు వాదిస్తున్నారు.

***

కేరళలో కాసరగోడ్ నుండి తిరువనంతపురం వరకు సిపియం మహిళలతో మానవ హారం నిర్వహించింది. ఈ ర్యాలీకి ఒకవైపు పినరాయ్ విజయన్ మరొకవైపు బృందాకారత్ నిలబడ్డారు. శబరిమలై దేవాలయంలోకి వయోభేదంతో సంబంధం లేకుండా అందరూ ప్రవేశించాలి అనేది సిపియం లక్ష్యం. విచిత్రమేమంటే ఈ మానవ హారంలో పాల్గొన్న సిపియం కార్యకర్తలు ఎవరూ ఎప్పుడూ దేవాలయాలకు వెళ్లేవారుకారు సరికదా ''మతం మత్తుమందు'' అని ప్రచారం చేసినవారే. మరి ఈ భారీ మానవహారం ఎందుకు నిర్వహించినట్లు? అంటే మరొక నూరు రోజుల తర్వాత రాబోయే పార్లమెంటు ఎన్నికలలో విజయం కోసం చేస్తున్న ప్రచారంలో ఇది అంతర్భాగం. దాదాపు అన్ని సర్వేలు కేరళ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో సిపియం అధికారాన్ని కోల్పోతున్నదని కాంగ్రెస్ అధికారం చేపట్టబోతున్నదని జోస్యం చెప్పాయి. 16 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్, 4 స్థానాలు సిపియం, 0 స్థానాలు బిజెపి గెలుచుకోబోతున్నదని తెలుస్తున్నది. శబరిమలై సమస్య మరో అయోధ్య సమస్యలాగా రగిలించటంద్వారా రాజకీయ పక్షాలు లబ్ధిపొందుతున్నాయి. పినరాయ్‌విజయన్‌కు ప్రజాస్వామ్యం మీద కానీ శబరిమలేశుని మీద గానీ ఎట్టి విశ్వాసమూ లేదు. ఐనా అతనిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. త్రిశూర్ జిల్లాలో రిగ్గింగ్ చేసి హత్యలు చేసి అతడు బాలకృష్ణన్ పిళ్ళై అధికారంలోకి వచ్చారు. 2019 తర్వాత అక్కడ కమ్యూనిజం అంతరించబోతున్నది. మొన్నట కేరళ వరదలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో లభించిన సహాయ సామగ్రి సిపియం కార్యకర్తలు ఇళ్లకు చేరవేసుకున్నట్లు కాంగ్రెస్-ఇతర పార్టీలు ఆరోపించాయి!

ఫ్రాంకో ములక్కల్ అనే జలంధర్ ఏరియా బిషప్ దశాబ్దాలుగా నన్స్‌మీద లైంగిక వేధింపులు జరుపుతుంటే ఈ ముఖ్యమంత్రి చూస్తూ ఊరుకున్నాడు.

***

మధ్యప్రదేశ్‌లో కొద్దిరోజుల క్రితం కాంగ్రెసు పార్టీ కమలనాథ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేసిన మొట్టమొదటి పని 'వందేమాతరం' గీతాన్ని పాఠశాలల్లో పాడకుండా నిషేధించటం. ఇలా ఎందుకు చేశారు? అంటే ఆ గీతం ముస్లింలకు ఇష్టంలేదు అని కమలనాథ్ సమాధానం చెప్పాడు. ఇతడు 1984 సిక్కుల హత్యకేసులో ముద్దాయి. ఇతనిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను శ్రీమతి సోనియాగాంధీ నీరుగార్చింది. భారతదేశంలో వందేమాతరం గీతం పాడటం పాపకార్యమైంది. దేశ విభజన తర్వాత కూడా పాకిస్తాన్ అనుకూల వర్గాల గుప్పెట్లో భారతదేశంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఈ జాతి ఎంత పాపం చేసుకున్నదో దీనినిబట్టి నిర్ధారించుకోవచ్చు. బంకించంద్ చటర్జీ రచించిన వందేమాతర గీతం స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపింది. ఇవ్వాళ ఆ గీతంపై కాంగ్రెసువారు నిషేధం విధించారు. అంటే ఆ పార్టీ ఎంత పతనమైందో తెలుస్తున్నది.

గుజరాత్‌లోని హైస్కూళ్లలో విద్యార్థులు 'జైభారత్' అని అనకూడదు అంటూ హార్థిక్‌పటేల్ వంటి ప్రతిపక్ష నాయకులు వాదిస్తున్నారు. ఇతడు అహమ్మదాబాదులో సెక్సు స్కాండల్‌లో ఓ హోటల్లో రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డాడు. వీళ్లా మన నాయకులు?? ఈ దేశానికి భవిష్యత్తు ఉందా?? ■

గణతంత్రానికి సన్నద్ధం..







త్రివిధ దళాల పాటవానికి ప్రతీకగా గణతంత్ర వేడుకలకు భారత్ సన్నద్ధమవుతోంది. నౌక, వైమానిక, పదాతి దళాలు ఇందుకు సిద్ధమవుతున్నాయి. సోమవారం ఢిల్లీలో రిహార్సల్స్ అద్భుతంగా జరిగాయి. మహిళా సైన్యం కూడా ఇందులో ఉత్సాహంగా పాల్గొంది. కనువిందుగా సాగిన ఈ కవాతు సైనిక పటిమకు అద్దం పట్టింది

మా ప్రభుత్వం సుస్థిరం

❑ అస్థిరత ముప్పే లేదు ❑ కర్నాటక సీఎం కుమారస్వామి ఉద్ఘాటన



బెంగళూరు, జనవరి 14: రాష్ట్రంలో తమ ప్రభుత్వ సుస్థిరతకు ఎలాంటి సమస్య లేదని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి ఉద్ఘాటించారు. కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం చాలా బలంగా ఉందని, దీనిని కుప్పకూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ వచ్చిన కథనాలను ఆయన కొట్టిపారేశారు. ఆపరేషన్ లోటస్ పేరిట కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని గత కొంతకాలంగా కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో కుమారస్వామి స్పందించారు. అయితే, అధికార కూటమికి చెందిన ఎమ్మెల్యేలను తమవైపునకు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న విషయం నిజమేనని, అయితే, తమ ఎమ్మెల్యేలెవరూ ఆ పార్టీవైపు వెళ్లే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. 'ఆపరేషన్ లోటస్ గురించి మీడియాలో వచ్చిన కథనాలను చూశాను. అంతేకాదు, కర్నాటకలో రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉందన్న సంకేతాలు అందుతున్నాయి. అయితే, ఈ రకమైన తప్పుడు కథనాలకు సూత్రధారులు ఎవరన్నది ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రకమైన తప్పుడు కథనాల వల్ల ఎవరికి ఏ రకమైన లాభం చేకూరుతుందో తనకు అర్థం కావడంలేదని, అంతిమంగా వీటివల్ల రాష్ట్ర ప్రజలకే నష్టం వాటిల్లుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 6 నుంచి 8 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే అవకాశం ఉందంటూ ఇప్పటికీ వదంతులు బలంగానే వినిపిస్తున్నాయి. అంతేకాదు, వీరిలో కొంతమంది ఎవరికీ అందుబాటులో లేకపోవడం కూడా ఈ కథనాలకు బలం చేకూరుస్తోంది. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకుల సమక్షంలో ముంబైలోని ఒక హోటల్‌లో ఉన్నారంటూ జలవనరుల మంత్రి డీకే శివకుమార్ చేసిన ఆరోపణను ప్రస్తావించినపుడు 'వీరంతా నన్ను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉన్నారు' అని స్పష్టం చేశారు. అయితే, వారి పేర్లను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా తన సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని ఆయన అన్నారు. వ్యక్తిగత పనుల మీదే ఈ ఎమ్మెల్యేలు ముంబై వెళ్లారే తప్ప దానికి మరో కారణం లేదని, దీనికి రాజకీయాలను ఆపాదించాల్సిన అవసరం లేదని తెలిపారు. 'నా ప్రభుత్వానికి ముప్పువాటిల్లుతున్న పరిస్థితులే ఉంటే నేను ఏవిధంగా మీ ముందు ఇంత ధీమాగా మాట్లాడగలుగుతాను' అని కుమారస్వామి వ్యాఖ్యానించారు.

కేంద్రంలో మేమే కీలకం

❑ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ జోస్యం ❑ బీఎస్పీ-ఎస్పీ పొత్తుపై హర్షం



మీడియాతో మాట్లాడుతున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ , పక్కన అఖిలేష్

లక్నో, జనవరి 14: లోక్‌సభ ఎన్నికల తరువాత కేంద్రంలో ఏ ప్రభుత్వం ఏర్పాటవుతుందో నిర్ణయించేదీ బిహార్, యూపీలేనని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. యూపీలో ఎస్పీ,బీఎస్పీ ఎన్నికల పొత్తు నేపథ్యంలో సోమవారం ఆయన ఇక్కడ మీడియాతోమాట్లాడారు. ఇది ఒక్క యూపీకే కాదు దేశంలో ఇలాంటి పొత్తులు ఏర్పడతాయని ఆయన చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం ఏ ప్రభుత్వం ఉండాలో నిర్ణయించేది బిహార్, యూపీ ప్రజలేనని ఆయన అన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయిన తరువాత తేజస్వీ విలేఖరులతో మాట్లాడారు. ఆదివారం రాత్రి బీఎస్పీ అధినేత్రి మాయావతితోనూ తేజస్వీ సమావేశమయ్యారు. 'యూపీలో 80 లోక్‌సభ స్థానాలుంటే బీహార్‌లో 40 స్థానాలున్నాయి...పక్కనున్న జార్ఖండ్‌లోని 14 స్థానాలు, మూడు రాష్ట్రాల పార్లమెంట్ నియోజకవర్గాలను కలుపుకొంటే 134. గత ఎన్నికల్లో బీజేపీ 115 లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలిచింది'అని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల మధ్య పొత్తులు కుదిరితే బీజేపీ వంద సీట్లను కోల్పోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కమలనాథుల పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదని ఆయన విమర్శించారు. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్న ప్రధాని మోదీ దగా చేశారని యాదవ్ ఆరోపించారు. సీఎం నితీష్‌కుమార్ రాజకీయ ప్రయోజనాల కోసమే తమతో విడిపోయి బీజేపీతో జతకాగుతున్నారని ఆయన ధ్వజమెత్తారు.'యూపీలో బీఎస్పీ-ఎస్పీ ప్రయోగం మున్ముందు మంచి ఫలితాలను సాధించిపెడుతుంది. ఆర్ఎస్ఎస్ బారి నుంచి దేశానికి విముక్తి కల్పించడానికి ఆ పొత్తు మార్గదర్శకత్వం వహిస్తుందని ఆర్జేడీ అధినేత స్పష్టం చేశారు. యూపీలో బీఎస్పీ-ఎస్పీ కూటమిని ఆర్జేడీ స్వాగతిస్తోందని తమ పార్టీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ అభిమతం కూడా అదేనని ఆయన కుమారుడు తేజస్వీ స్పష్టం చేశారు. బీజేపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, అన్ని రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేశారని ఆయన ఆరోపించారు. ఎంఎస్ గోవాల్కర్ సిద్ధాంతాలు, నాగపూర్ చట్టాలను జొప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆర్జేడీ అధినేత తీవ్ర విమర్శ చేశారు. ఈడీ, సీబీఐను రాజకీయ విరోధులపై కక్షసాధింపునకు వాడుకుంటున్నారని ఆయన అన్నారు.

నిష్పాక్షిక ఎన్నికలకు తోడ్పాటు

❑ సామాజిక మీడియాకు ఏఐఎంఐఏ పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 14: నిష్పాక్షికంగా, నిజాయితీగా దేశంలో ఎన్నికలు జరిగేందుకు తమ వంతు తోడ్పాటు అందించాలని ఫేస్‌బుక్ సహా సామాజిక మీడియా సంస్థలకు భారత ఇంటర్‌నెట్, మొబైల్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ముఖ్యంగా ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు ఎన్నికలు నిజాయితీగా, పారదర్శకంగా జరిగేందుకు అత్యంత కీలకంగా మారనున్నాయని పేర్కొంది. ఎన్నికల కమిషన్, సామాజిక మాధ్యమాలకు చెందిన వివిధ కంపెనీలతో కూడిన ప్యానెల్ కమిటీ ఇందుకు తగిన ప్రతిపాదనలను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు గత వారం అందజేసింది. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా మాధ్యమాలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయంలో తాము సమర్పించిన సమగ్ర నివేదికపై సానుకూల దృక్పథంతో వ్యవహరించినందుకు ఐఏఎంఏఐ తమ సభ్యుల తరఫున కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపింది. దేశ సమగ్రత, పవిత్రతను కాపాడేందుకు ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిపేందుకు సామాజిక మాధ్యమాలు తగిన సమర్థవంతమైన, కీలకమైన పాత్రను పోషించేందుకు ఒకే వేదికపైకి రావడం ఆశావహ దృక్పథంగా ఏఐఎంఏఐ అభిప్రాయపడింది.


ఆర్థికంగా ధ్వంసం చేస్తాం

❑ టర్కీకి ట్రంప్ హెచ్చరిక

❑ కుర్ద్‌ల జోలికి రావద్దంటూ ఆదేశం



వాషింగ్టన్, జనవరి 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన నైజాన్ని చాటుకున్నారు. ప్రత్యర్థులనే కాకుండా నాటో దేశాలను ఇరుకున పడేస్తున్న ఆయన తాజాగా టర్కీపై నిప్పులు చెరిగారు. సిరియాలోని అమెరికా మద్దతుతో పనిచేస్తున్న కురుధ్ సైనిక దళాలపై టర్కీ దాడి చేస్తే దానిని ఆర్థికంగా ధ్వంసం చేస్తామని ట్రంప్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. సిరియా నుంచి అమెరికా దళాలు వైదొలగిన నేపథ్యంలో అక్కడి కుర్ద్ దళాలపై టర్కీ దాడి చేసే అవకాశం ఉందన్న కథనాలపై ట్రంప్ స్పందించారు. అయితే, ఈ హెచ్చరికను టర్కీ తిరస్కరించింది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. సిరియాలో ఉన్న 2 వేల మంది అమెరికా దళాలను ఉపసంహరిస్తున్నట్టు ట్రంప్ ఇటీవల చేసిన ఆకస్మిక ప్రకటన నాటో దేశాలను కలవరపాటుకు గురిచేసింది. గత వారం నుంచే సిరియా నుంచే అమెరికా దళాల ఉపసంహరణ మొదలైంది. ఇప్పటివరకు అమెరికా మద్దతుతో ఉన్న కుర్ద్ దళాలకు ఈ పరిస్థితి మింగుడుపడనిదిగా మారింది. అమెరికా దన్ను లేదు కాబట్టి టర్కీ తమపై దాడి చేసే అవకాశం ఉందంటూ ఈ కుర్ద్ అనుకూల పక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే, అమెరికా అభిప్రాయం ఎలా ఉన్నా కుర్ద్ దళాలను తాము ఉగ్రవాదులుగానే పరిగణిస్తున్నామని, తమ దేశంలోని వేర్పాటువాదులకు వీటినుంచి మద్దతు అందుతోందని టర్కీ చెబుతోంది. ఈ దళాల నుంచి తమకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఖచ్చితంగా దాడి చేస్తామని టర్కీ అధ్యక్షుడు స్పష్టం చేయడంతో ట్రంప్ తాజా హెచ్చరిక జారీ చేశారు.



అంతర్గత భద్రత పటిష్టం

❑ పాక్ వల్లే కాశ్మీర్ అశాంతి

❑ ఉగ్రవాదం, నక్సలిజం తగ్గుముఖం

❑ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ

లఖింపూఖేరి (ఉత్తరప్రదేశ్), జనవరి 14: పొరుగునున్న పాకిస్తాన్ అనుసరిస్తున్న ఉగ్రవాద అనుకూల అస్థిర కార్యకలాపాల వల్ల కాశ్మీర్ ఓ సవాల్‌గానే పరిణమిస్తోందని హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్తాన్ ఎన్ని కుయుక్తులు, కుతంత్రాలకు పాల్పడ్డా సరిహద్దుల్లో అరాచకాలకు ఒడిగడుతున్నా భారత దళాలు సమన్వయంతో తిప్పికొడుతున్నాయని సోమవారంనాడు ఇక్కడ మీడియాతో అన్నారు. సైనికులు, సీఆర్‌పీఎఫ్, కాశ్మీర్ పోలీసులు, ఇంటెలిజెన్స్ బ్యూరోలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఎప్పటికప్పుడు పాక్ ఆటలు కట్టిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశంలో నక్సలిజం కూడా క్రమంగా బలహీనపడుతోందని, గత నాలుగున్నరేళ్లలో 50 శాతానికి పైగా నక్సల్ కార్యకలాపాలు తగ్గిపోయాయని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. అలాగే ఈశాన్య భారతంలోనూ తీవ్రవాద కార్యకలాపాలు 80 శాతానికి పైగా తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోంమంత్రి తెలిపారు. అంతర్గత భద్రతను పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తీసుకుంటున్న చర్యలే ఈ సానుకూల పరిణామాలకు కారణమైందని ఆయన అన్నారు. అలాగే కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఒక్క ఉగ్రవాద సంఘటన కూడా దేశంలో జరగకపోవడానికి కారణం దేశీయ బలగాలు పటిష్టంగా అనునిత్యం అప్రమత్తంగా ఉండడమేనని ఆయన అన్నారు. అలాగే ఆర్థికాభివృద్ధిలో కూడా భారత దేశం పరుగులు పెడుతోందిని, అత్యంత వేగంగా ప్రగతి సాధిస్తున్న దేశాల్లో ఒకటిగా మారిందని అన్నారు. 2030 నాటికి ప్రపంచంలో మొదటి మూడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి అవుతుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశాడు. ఈ నాలుగున్నరేళ్లలో దేశ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించే ఆయుష్మాన్ సహా ఎన్నో సంక్షేమ, ప్రగతిశీల కార్యకలాపాలను మోదీ ప్రభుత్వం ఆవిష్కరించిందని రాజ్‌నాథ్ తెలిపారు. ఇప్పటివరకు ఆయుష్మాన్ భారత్ వల్ల 7.5 లక్షల మంది ప్రయోజనం పొందారని అన్నారు.

ఆ నియామకాన్ని రద్దు చేయాలి


❑ సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌పై సుప్రీంలో పిటిషన్ ❑ కేంద్రం చట్టాన్ని ఉల్లంఘించిందని ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 14: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం నాగేశ్వరరావునియామకాన్ని రద్దుచేయాలంటూ సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈనెల 10 నాగేశ్వరరావును జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్‌గా నియమించారు. సీబీఐలో అదనపుడైరెక్టర్‌గా ఉన్న రావుకు తాత్కాలిక డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఉన్నతస్థాయి కమిటీ అలోక్ కుమార్ వర్మకు ఉద్వాసన చెప్పిన సంగతి తెలిసిందే. అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు వర్మపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. వర్మ స్థానంలో డిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావును కేంద్రం నియమించడం జరిగింది. నాగేశ్వరరావునియామకాన్ని రద్దుచేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని స్వచ్ఛంద సంస్థ 'కామన్ కాజ్', ఆర్‌టీఐ కార్యకర్త అంజలీ భరద్వాజ్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాగేశ్వరరావునియామకం పారదర్శకంగా సాగలేదని ఆమె ఆరోపించారు. ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి నియామక కమిటీ సిఫార్సు మేరకు తాత్కాలిక డైరెక్టర్ నియామకం జరగలేదని పిటిషనర్ తెలిపారు. కమిటీలో ప్రధాన ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి/ న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారని ఆమె అన్నారు. అయితే నాగేశ్వరరావునియామకం చట్టబద్ధంగా జరగలేదని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు. ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్(డీఎస్‌పీఈ) చట్టాన్ని ఉల్లంఘించారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 23న నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించారని తరువాత సుప్రీం కోర్టు దాన్ని రద్దుచేసిందని ఆయన స్పష్టం చేశారు. తిరిగి అదే అధికారిని ఉన్నత పదవులోఎలా నియమిస్తారని ప్రశాంత్ భూషణ్ ప్రశ్నించారు. డీఎస్‌పీఈ మార్గదర్శకాలను ప్రభుత్వం పట్టించుకోలేదని, సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ నియామకం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తెలిపారు.



శబరిమల సన్నిధానంలోని అయ్యప్ప ఆడిటోరియంలో ప్రఖ్యాత గాయని సుశీలకు సోమవారం హరివరాసన అవార్డును బహూకరిస్తున్న దృశ్యం. కేరళ ప్రభుత్వం దీన్ని నెలకొల్పింది


సజ్జన్ కుమార్ అభ్యర్థనపై సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసు



న్యూఢిల్లీ, జనవరి 14: 1984 సిక్కు అల్లర్ల కేసులో అరెస్టు అయిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సజ్జన్ కుమార్ తనకు జీవితకాల శిక్ష విధించడంపై చేసిన అభ్యర్థనపై ఏమి చర్యలు తీసుకున్నారో తెలపాలని సుప్రీంకోర్టు సీబీఐకి నోటీసు జారీ చేసింది. ఢిల్లీ హైకోర్టు తనకు యావజ్జీవ కారాగారం విధించడాన్ని సవాల్ చేస్తూ సజ్జన్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీం చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ విషయంలో నాలుగు వారాల్లోగా తగిన వివరణ ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది. 'సజ్జన్ కుమార్ అప్పీల్ పరిశీలనకు వచ్చింది. నిందితుని విజ్ఞప్తి మేరకు అతనికి బెయిల్ ఇవ్వడం లేదా జైలుశిక్షను రద్దు చేయడం అనేది ఆరు వారాల్లో నిర్ణయిస్తాం. దీనికి సంబంధించిన జవాబులేమైనా నాలుగు వారాల్లో మాకు సీబీఐ సమర్పించవచ్చు' అని జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్.కే.కౌల్‌తో కూడిన సుప్రీం బెంచ్ సూచించింది. 73 ఏళ్ల సజ్జన్ కుమార్ గత ఏడాది డిసెంబర్ 31న ట్రయల్ కోర్టు ఎదుట లొంగిపోయాడు. అతనికి ఢిల్లీ హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి సజ్జన్ కుమార్ రాజీనామా చేశారు.

కేంద్రంలో అధికారం మాదే

బీజేపీని ఓడించే శక్తి కాంగ్రెస్‌కే ఉంది: సచిన్ పైలెట్



జైపూర్, జనవరి 14: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓ పెద్ద సవాల్‌గా మారి దానిని ఓడించగలిగే శక్తి ఒక్క కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని రాజస్థాన్ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలెట్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ఉద్ఘాటించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న వారిని ఓడించేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సచిన్ పైలెట్ తెలిపారు. ఇప్పటికే బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ బలహీనపడిందని, అందులో కీలక భాగస్వామ్య పక్షాలు ఇప్పటికే వైదొలిగాయని పేర్కొన్న సచిన్ పైలెట్ 'యూపీఏ మాత్రం చాలా బలంగా ఉంది. దీని భాగస్వామ్య పక్షాలు విధేయంగా ఉన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నాయకత్వం పట్ల యూపీఏ భాగస్వామ్య పక్షాల నమ్మకం రోజు రోజుకూ పెరుగుతోంది' అని సోమవారంనాడు ఇక్కడ మీడియాతో సచిన్ పైలెట్ అన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోనే లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్న ధీమాను వ్యక్తం చేసిన ఆయన దేశంలో బీజేపీని ఓడించగలిగే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉందని పునరుద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజవాది పార్టీ, బీఎస్పీలు పొత్తు కుదుర్చుకోవడం, కాంగ్రెస్‌ను ఏకాకిని చేయడంపై మాట్లాడిన ఆయన 'ఈ కూటమిలో కాంగ్రెస్ లేనంతమాత్రాన అది బలహీనపడినట్టు కాదు' అని తెలిపారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కీలక రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని, దీనివల్ల పార్టీ కార్యకర్తలకు మరింత ఉత్సాహం కలిగిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఒక పటిష్టమైన వ్యూహంతోనే కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందని పేర్కొన్న పైలెట్ ఇందులో భాగంగా ప్రతి లోక్‌సభ స్థానంలోనూ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు. గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని, ముఖ్యంగా యువతపై దృష్టి పెడతామని సచిన్ పైలెట్ తెలిపారు.

ప్రధాన పార్టీల్లో అ'టెన్షన్'!

❖ వచ్చే నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్? ❖ అమరావతి కేంద్రంగా అధినేతల వ్యూహాలు

❖ అభ్యర్థుల జాబితా, మేనిఫెస్టోలపై కసరత్తు ❖ మారుతున్న రాజకీయ సమీకరణలు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 14: వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో రాజకీయ పక్షాలు అలెర్టయ్యాయి. వచ్చే నెలలో ఎన్నికల సంఘం పరిశీలకుల బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తుందంటున్నారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ఎన్నికల వేడి రాజుకుంది. అధికార తెలుగుదేశంతో పాటు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే గుంభనంగా తొలివిడత జాబితాను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ తరహాలో ఈసారి జాప్యం జరక్కుండా కాంగ్రెస్‌తో పొత్తుపై స్పష్టత ప్రకటించి ఈ నెలాఖరులోనే అభ్యర్థుల జాబితా విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు చేస్తున్నారు. వైసీపీ నుంచి ఇక ఎటూ వలసలు ఉండవని తేలటంతో కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లకు ఆఫర్లు ఇస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం గత సార్వత్రిక ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ తిరిగి జీవం పోసుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈనేపథ్యంలో తెలంగాణ ఎన్నికల్లో టీడీపీతో కలిసి మహాకూటమి ఏర్పాటు కావటంతో కొందరు సీనియర్ నాయకులు కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. అయితే ఏపీలో పొత్తు కొనసాగించాలా, లేక ఒంటరిగా పోటీ చేయాలా? అనే విషయమై తెలుగుదేశం పార్టీలో విస్తృత చర్చ జరుగుతోంది. తెలంగాణలో ఘోర పరాజయాన్ని చవిచూడటంతో ఏపీలో పొత్తుపై టీడీపీ సందిగ్ధంలో పడింది. ఇప్పటికే లోపాయకారీగా మంతనాలు జరుగుతున్నట్లు చెపుతున్నారు. ఏ పార్టీతో పొత్తు కుదుర్చుకున్నా తగిన సీట్లు కేటాయించేందుకు టీడీపీ అధినేత 25 శాసనసభ సీట్లను సర్దుబాటు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్‌కు బయటి నుంచి మద్దతిస్తేనే మంచిదని సీనియర్ నేతలు వారిస్తున్నట్లు సమాచారం.

సంక్రాంతి తరువాత ఈ నెల మూడోవారంలో రాష్ట్ర కేబినెట్‌తో పాటు సమన్వయ కమిటీ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవటం, వచ్చే నెల మొదటి వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు ముగిస్తే ఇక జిల్లాల వారీగా పార్టీ సమీక్షలు నిర్వహించి నోటిఫికేషన్ వెలువడేలోగా అభ్యర్థులను ఖరారు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. టీఆర్‌ఎస్ తరహాలోనే ముందుగా అభ్యర్థులను ప్రకటించి ప్రచారానికి పంపితే ఆపై నియోజకవర్గాల్లో తాను పర్యటించడం ద్వారా కొత్త ఊపునిచ్చేందుకు చంద్రబాబు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నట్లు వినికిడి. ఇదిలావుంటే, పార్టీలోకి వస్తున్న వలస నేతలు తమ్ముళ్లలో మరింత టెన్షన్ పెంచుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం కూడా నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల్లో వలస నేతలకే బాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సీటు పదిలంగా ఉంటుందా, లేదా అనే భయం కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పట్టుకుంది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ నుంచి మంగళగిరి మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల టీడీపీ గూటికి చేరారు. వచ్చే ఎన్నికల్లో ఆమెకే టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది. అలాగే మరికొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

మరోవైపు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత కూడా సంక్రాంతి అనంతరం అమరావతి కేంద్రంగా ఎన్నికల సమర యాత్ర నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటికే సీట్ల కేటాయింపుపై ఆయన ఓ అవగాహనకు వచ్చారని చెపుతున్నారు. మూడు నెలల క్రితం రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల మార్పు ఇందులో భాగమేనని అంటున్నారు. విజయావకాశాలు ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారని, వారే రేపు ఎన్నికల్లో పోటీ చేస్తారని వైసీపీ నేతలు చెపుతున్నారు. ఇన్‌చార్జిల మార్పు విషయంలో ఓ సీనియర్ నేత చక్రం తిప్పుతున్నట్లు వినికిడి. దీనిపై జగన్‌కు ఫిర్యాదులు కూడా అందుతున్నాయని పార్టీ నేతలే చెపుతున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు వైసీపీకి జీవన్మరణ సమస్య కానున్నాయి. ఇప్పటికే పార్టీలో కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఐదు విడతలు ఎన్నికల్ని ఎదుర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తేనే తమకు వెసులుబాటు కలుగుతుందని వారు గంపెడాశతో ఉన్నారు. పొత్తు పెట్టుకునే పార్టీల నేతలే టీడీపీ, వైసీపీలోకి వలసలు రావటం గమనార్హం. ఓ వైపు కాంగ్రెస్ నుంచి టీడీపీకి వలసలు పెరుగుతుంటే, మరోవైపు బీజేపీ సీనియర్లు కొందరు వైసీపీ బాట పట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధ్రీశ్వరి గుంటూరు లేదా నరసరావుపేట పార్లమెంట్ స్థానాన్ని ఆశించటంతో పాటు తన తనయుడు హితేష్‌కు పరుచూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి ఖారరైతే వైసీపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇప్పటికే వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధం కావటం, ఎన్నికలు ఏప్రిల్ చివరి వారంలో జరిగే అవకాశాలు ఉండటంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల జాబితాతో సహా ఎన్నికల ప్రణాళికపై దృష్టి కేంద్రీకరించాయి. వైసీపీ ప్రకటించిన నవరత్నాలకు దీటుగా టీడీపీ ప్రభుత్వం పింఛన్ల పెంపు, వ్యవసాయానికి 9గంటల ఉచిత విద్యుత్ లాంటి వరాలను ఇప్పటి నుంచే అమలు చేస్తోంది. దీంతో మేనిఫెస్టోలో చేర్చాల్సిన మరిన్ని అంశాలను వైసీపీ పరిశీలిస్తోంది.

ఇదిలావుంటే, కొత్తగా సార్వత్రిక ఎన్నికల బరిలో నిలుస్తున్న జనసేన రాష్ట్రంలోని అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. కాంగ్రెస్ నుంచి శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌తో పాటు టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సూర్యనారాయణ జనసేనలో చేరారు. అయితే ఎన్నికల్లో డబ్బు, అభ్యర్థుల అన్వేషణ, మేనిపెస్టో, ప్రచారాలపై ఇప్పటికీ ఆ పార్టీలో స్పష్టత లేదు. పార్టీని నడపాలంటే రూ. 2500 కోట్లు అవసరమని పవన్‌కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనమని అంటున్నారు. పవన్ మినహా ఆ పార్టీలో నాయకత్వ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఇతర పార్టీల్లో ఉన్న సీనియర్లు ఎవరూ అంతగా ఆసక్తి చూపటంలేదు. పార్టీకి కేడర్ ఉన్నప్పటికీ నియోజకవర్గాల వారీ నడిపించే నాయకత్వం లేకపోవటం వెలితిగా మారింది. దీనికితోడు బూత్ కమిటీలు ఏర్పాటు కాలేదు. సంస్థాగత నిర్మాణం జరగలేదు.

దీంతో కార్యకర్తల బలం ఉన్నా ఎన్నికలను ఎదుర్కొనే సత్తా కనిపించటం లేదనే వాదనలు వినవస్తున్నాయి. సంక్రాంతి అనంతరం పార్టీని బలోపేతం చేసేందుకు పవన్‌కళ్యాణ్ పావులు కదుపుతున్నట్లు సమాచారం. బీజేపీ, టీఆర్‌ఎస్ జగన్‌కు మద్దతిచ్చే సంకేతాలు రావటంతో జనసేన ఏవైపు మొగ్గుచూపుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల ముహూర్తం దగ్గరపడుతున్నకొద్దీ ప్రధాన పార్టీలో టెన్షన్ మాత్రం మొదలైంది.

దాడికి ప్రోత్సహించింది ఎవరు?

❖ జగన్‌పై హత్యాయత్నం కేసులో శ్రీనివాస్‌ను విచారిస్తున్న ఎన్ఐఏ పోలీసులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కత్తితో దాడి చేయాల్సిందిగా ఎవరు ప్రోత్సహించారు?, ఆ కత్తి ఎక్కడిది?, ఎవరు ఇచ్చారు?, విమానాశ్రయం లోపలికి ఎలా తీసుకెళ్ళావు? తదితర ప్రశ్నలతో ఎన్ఐఏ పోలీసులు జగన్‌పై దాడి చేసిన నిందితుడు శ్రీనివాస్ రావును ఉక్కిరిబిక్కిరి చేశారు. జగన్‌పై దాడి చేసిన నిందితుడు శ్రీనివాస్ రావును వారం రోజుల పాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించిన సంగతి తెలిసిందే. శ్రీనివాస్‌ను ఎన్ఐఏ అధికారులు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు తీసుకుని వచ్చి, సోమవారం ఎన్ఐఏ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. నిందితుడు శ్రీనివాస్ రావు తరపు న్యాయవాది సలీం సమక్షంలో అధికారులు విచారణ నిర్వహించారు. దాడి చేసిన రోజున పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను కేవలం పబ్లిసిటీ కోసమే చేశానని శ్రీనివాస్ చెప్పిన సంగతి తెలిసిందే. సోమవారం కూడా శ్రీనివాస్ అదే సమాధానం చెప్పినట్లు సమాచారం. జగన్‌పై దాడి చేయాల్సిందిగా తనను ఎవరూ ప్రోత్సహించలేదని, ఎటువంటి విచారణ చేసినా ఇదే సమాధానం చెబుతానని నిందితుడు అన్నట్లు తెలిసింది. ఇలాఉండగా తదుపరి విచారణ నిమిత్తం మంగళవారం నిందితున్ని వైజాగ్ విమానాశ్రయానికి ఎన్ఐఏ అధికారులు తీసుకెళ్ళనున్నారు.

నీట్ అప్లికేషన్ విండో ప్రారంభం

❖ పొరపాట్లు సరిదిద్దుకునే అవకాశం

❖ మే 5న పరీక్ష , జూన్ 5న ఫలితాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, డెంటల్ కాలేజీల్లో యూజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించే నీట్- 2019 యూజీ పరీక్ష దరఖాస్తు విండోను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రారంభించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని తమ వివరాల్లో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు కరక్షన్ విండోను ప్రారంభించింది. జనవరి 31వ తేదీలోగా తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది. నీట్ పోర్టల్‌లోకి లాగిన్ అయి ఫోటోతో పాటు సంతకం, పరీక్ష లాంగ్వేజీ, ఎక్కడ పరీక్ష రాయాలి వంటి వివరాలను కూడా మార్చుకునే వీలుకల్పించారు. మార్పులు చేసినపుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఒకసారి కరక్షన్ విండో క్లోజ్ చేస్తే మళ్లీ మార్పులకు ఛాన్సు ఉండబోదని పేర్కొన్నారు. నీట్ పరీక్ష హాల్‌టిక్కెట్లు ఏప్రిల్ 15 నుండి అందుబాటులో ఉండనున్నాయి. పరీక్షను మే 5న నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ 5న ప్రకటిస్తారు. కరెక్షన్ కోసం ఎన్‌టీఏ నీట్ డాట్ ఎన్ఐసీ డాట్ ఇన్ అనే వెబ్ పోర్టల్‌ను దర్శించాలని అధికారులు పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్ ప్రాథమిక కీ విడుదల

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ఐఐటీ జేఈఈ మెయిన్ పరీక్ష ప్రాథమిక కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సోమవారం నాడు విడుదల చేసింది. వాస్తవానికి 16వ తేదీన కీ విడుదల చేస్తారని తొలుత భావించినా, రెండు రోజుల ముందే తొలి కీని టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. ఈసారి సీబీటీకి 9.41,117 మంది రిజిస్టర్ చేసుకున్నారు. తొలి కీని జేఈఈ మెయిన్ డాట్ ఎన్ఐసీ డాట్ ఇన్ అనే వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్టు టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది. దీనిపై ఈ నెల 17వ తేదీ సాయంత్రం వరకూ అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం నిపుణుల కమిటీ వాటిని అధ్యయనం చేసి తుది కీని ఖరారు చేస్తుంది. అనంతరం తుది కీ ప్రాతిపదికగా ఫలితాలను సిద్ధం చేస్తారు. వెబ్ పోర్టల్‌లో లాగిన్ క్లిక్‌ను లింక్ ద్వారా కీ వివరాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. తుది ఫలితాలను ఈ నెల 31వ తేదీ లోగా ప్రకటించే వీలుందని అధికారులు చెబుతున్నారు.

కంగారు పుట్టించేనా?

ఆస్ట్రేలియా- భారత్ మధ్య నేడు రెండో వన్డే

గెలుపు ఉత్సాహంతో ఆసీస్

ప్రతీకారేచ్ఛతో కోహ్లీ సేన

అడిలైడ్, జనవరి 14: సిడ్నీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో అతిథ్య జట్టుపై ఘోర పరాభవాన్ని చవిచూసిన టీమిండియా మంగళవారం జరిగే రెండో వన్డేలో గెలిచి ప్రతికారం తీర్చుకోవాలని భావిస్తోంది. టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియాకు ఏమాత్రం అవకాశమివ్వని భారత్ అనూహ్యంగా మొదటి వన్డే ఓడింది. బౌలింగ్ ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను నిలువరించినా, బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్ విఫలమవడంతో భారత్ గెలుపు కోసం చివరి దాకా పోరాడింది. టీమిండియాలో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ ధనాధన్ మహేంద్ర సింగ్ ధోని మినహా మరెవ్వరూ రాణించకపోవడంతో ఓటమి తప్పలేదు. మరోవైపు శిఖర్ ధావన్, అంబటి రాయుడు పరుగులేమి చేయకుండానే పెవిలియన్ చేరడం, రన్ మిషన్, కెప్టెన్ విరాట్ కోహ్లీ సైతం మూడు పరుగులు చేసి అవుటయ్యాడు. ఒక దశలో నాలుగు పరుగులకే మూడు కీలక వికెట్లను భారత్ కోల్పోయింది. మరోవైపు అతిథ్య జట్టు సీనియర్లకు విశ్రాంతినిచ్చి, యువ ఆటగాళ్లకు స్థానం కల్పించడం వారికి కలిసొచ్చింది. జె రిచర్డ్‌సన్ అయితే మొదటి వన్డేలో భారత పతనాన్ని శాసించాడు. 10 ఓవర్లు వేసి 2 మెయిడిన్లతో 26 పరుగులిచ్చి నాలుగు కీలక వికెట్లను కూల్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక మంగళవారం అడిలైడ్‌లో జరిగే రెండో వన్డేలోనూ వికెట్లు సాధిస్తామని ధీమాగా ఉన్నాడు. ఇదిలా ఉంటే మొదటి వన్డే విజయంతో ఆస్ట్రేలియా ఉత్సాహంగా బరిలోకి దిగుతుండగా, అదే జట్టుతో రెండో వన్డే ఆడే అవకాశముంది.

ఓపెనర్లు కుదురుకుంటేనే..

నేడు జరిగే వన్డేలో ఓపెనర్లు రాణిస్తేనే విజయం తేలికవుతుంది. అతిథ్య జట్టుకు ముందుగానే వికెట్లు సమర్పించుకుంటే వారిలో మనోస్థైర్యాన్ని నింపినట్లవుతుంది. ఓపెనర్లు కనీసం వందకు పై చిలుకు భాగస్వామ్యం నమోదు చేసే దిశగా ఆడాలి. అలాగే నాలుగో స్థానంలోనూ అంబటి రాయుడు బదులు మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనిని పంపితే జట్టుకు ప్రయోజనకరంగా ఉండే అవకాశముంది. మొదటి వన్డేలో ధోని మొదట క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించినా, క్రీజులో కుదురుకున్నాక తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించాడు. చివరగా 2017 డిసెంబర్‌లో శ్రీలంకతో జరిగిన వన్డేలో అర్ధ సెంచరీ సాధించిన ధోని మొదటి వన్డేలో మరో అర్ధ సెంచరీ చేయడంతో అభిమానులు పండుగ చేసుకున్నారు. ఇదే ఫాం కొనసాగితే మునుపటి ధోనిని చూడొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గిల్, విజయ్ శంకర్‌కు చోటు డౌటే..

సస్పెన్షన్‌కు గురైన టీమిండియా ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ స్థానంలో ఆస్ట్రేలియా పర్యటను వచ్చిన శుభ్‌మన్ గిల్, విజయ్ శంకర్‌లకు రెండో వన్డేలో చోటు కల్పిస్తారా లేదా అనేది అనుమానంగానే ఉంది. ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్ 2018లో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్ (నిదహాస్)లో దారుణంగా విఫలమై, అభిమానుల ఆగ్రహానికి గురైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి జట్టులో కనిపించని విజయ్ శంకర్ ను ఆడిస్తారా లేదా అనేది అనుమానమే. మరో ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు చోటు కల్పించాలంటే అంబటి రాయుడుని పెవిలియన్‌లో కూర్చోబెట్టాల్సి రావడంతో వీరిద్దరికి రెండో వన్డే చోటు అనుమానమే.

1వ పేజీ తరువాయి

వ్యవసాయంలో 11 శాతం వృద్ధి

ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం సీఎం రైతులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత ఆన్‌లైన్ ఉపయోగాలు ఎంతగానో రైతులకు ఉపకరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతా రెడీమేడ్!

వంటలన్నీ ఇపుడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటి తయారి తెలుసుకున్న వారు కూడా క్రమేణా తగ్గిపోతున్నారు. ఒకవేళ తయారీ వచ్చినప్పటికీ ఇంట్లో కూర్చుని తయారు చేసుకునే తీరిక కూడా దొరకని స్థితిలో మార్కెట్ నుంచి రడీమేడ్‌గా కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండగ ముందు నుంచీ స్వీట్ షాపులన్నీ తెలుగింటి పిండి వంటలతో నిండిపోయాయి. మన సంస్కృతీ, సంప్రదాయాలతో ముడిపడిన ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ సంక్రాంతి పండగను చేసుకునే విధానాన్ని విద్యాలయాల్లో భావి తరాలకు అందిస్తున్నట్టుగానే ఈ పిండి వంటలు కూడా తయారు చేసుకునే విధానం కూడా అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారంతా ఉమ్మడిగా తయారు చేయించుకునే విధానం కూడా కనిపిస్తోంది. చాలా చోట్ల సంక్రాంతి పండుగ మాదిరిగానే పిండి వంటల తయారీ కూడా డెమోగా ప్రదర్శిస్తున్న తీరు కనిపిస్తోంది. గోదావరి జిల్లాలో ఈ సంక్రాంతికి భోగి పిడకలు కూడా భారీ స్థాయిలో విక్రయాలు చోటు చేసుకున్నాయి. ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలు రూ.50ల చొప్పున విక్రయించారు. ప్రస్తుతం కొంత మంది పిల్లలకైతే ఆ దండలు ఏమిటో కూడా తెలియని స్థితి నెలకొంది. వాటిని ఎలా తయారు చేస్తారో కూడా తెలియని పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల మాటెలా ఉన్నప్పటికీ రాజమహేంద్రవరం వంటి నగరాల్లో భోగి పిడకల దండలు విక్రయాలు జరిగాయి. వీధుల్లో యువకులు బృందాలుగా ఏర్పడి వినాయకచవితి సంబరాలు నిర్వహించినట్టుగా చందాలు వేసుకుని సామిల్లుల నుంచి చెట్టు మానులు కొనుగోలు చేసి భోగి మంటలు వేసుకున్నారు. ప్రతిష్టాత్మకంగా పేరెన్నికగన్న రీతిలో వేసే భోగి మంటల ప్రాంతాలు కూడా కనుమరుగయ్యాయి. ఒక వైపు పిండివంటలు, మరో వైపు భోగిమంటలు, ఇంకో వైపు సంక్రాంతి సంబరాలు అంతా రెడీమేడ్ రూపాన్నే సంతరించుకుంది.

సంఘ ప్రముఖులపై కాంగ్రెస్ కన్ను

దించేందేకు వ్యూహం పన్నుతోంది. రాహుల్ ఆదేశం మేరకు కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు జాతీయ ప్రధాన కార్యదర్శులు దాదాపు వంద మందితో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసి సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వైద్యులు, ఇంజనీర్లు, లాయర్లు, ఇతర ప్రముఖులను గుర్తించే పని ప్రారంభించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమం కోసం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు, అనుబంధ సంస్థలను కూడా ఉపయోగించుకుంటున్నట్లు తెలిసింది. దేశ రాజధాని ఢిల్లీలో మార్చి మొదటి వారంలో జరిగే ఒక పెద్ద కార్యక్రమంలో పార్టీ గుర్తించిన వైద్యులు, లాయర్లు, ఇంజనీర్లు, ఇతర ప్రముఖులతో రాహుల్ గాంధీ సమావేశం అవుతారని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభలోని మొత్తం 533 నియోజకవర్గాల వారీగా ప్రముఖుల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ తరపున ఆధునిక ప్రచార వ్యవస్థ పని చేయాలన్నది రాహుల్ లక్ష్యమని పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఆధునిక యాజమాన్య నిర్వహణా పద్ధతులను అమలు చేయాలని పార్టీ అధ్యక్షుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అంటున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలోని ప్రముఖులను గుర్తించి పార్టీ ఎన్నికల ప్రచారంలో వీరి సేవలను ఉపయోగించుకోవాలన్నది రాహుల్ ఆలోచన. ఆయా కుల సంఘాల నాయకులను కూడా రంగంలోకి దించాలని కాంగ్రెస్ అధినాయకత్వం ఆలోచిస్తోంది. సమీకృత ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ తెర లేపుతుందని ఏఐసీసీ వర్గా లు చెబుతున్నాయి. గతంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేపట్టిన ప్రచారానికి పూర్తి భిన్నంగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఉంటుందని వారంటున్నారు. దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీలు ఒక కూటమిగా ఏర్పడినందున కాంగ్రెస్ చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుంటోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కూడా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకపోవచ్చు. రాహుల్ ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ప్రధాన కార్యదర్శుల కమిటీ జనవరి నెలాఖరుకు పార్టీ ఎన్నికల ప్రచార వ్యూహానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను సిద్ధం చేస్తారు. రాహుల్ ఈ నివేదిక ఆధారంగా ఎన్నికల ప్రచార కార్యాచరణ పథకానికి రూపకల్పన చేస్తారని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

సామరస్యం అయోధ్య అభిమతం!

పర్యటించిన అనేక మంది చైనా యాత్రికులు ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. అలాగే జైనుల ప్రముఖ యాత్రా స్థలంగా అయోధ్య విరాజిల్లింది. అమిర్ ఖుస్రో అనే యాత్రికుడు అయోధ్య గురించి ఈ విషయాలన్నీ రాశాడు. నగర ఘన చరిత్రతోపాటు జానపదాలు రానురాను తెరమరుగయ్యాయని రచయిత తెలిపారు. మందిర వివాదం తెరపైకి రావడంతో చరిత్ర మౌనంగా చూస్తూ ఉండిపోయిందని సింగ్ ఆవేదన చెందారు. రానురాను వాస్తవ చరిత్ర మరుగున పడిపోయి కల్పిత కథలు తెరమీదకు వచ్చాయని ఢిల్లీకి చెందిన జర్నలిస్టు సింగ్ పేర్కొన్నాడు. 3,300 సంవత్సరాల చరిత్రను పుస్తకంగా తీసుకొచ్చిన ఆయన 1200 ఏళ్ల పాటు రాజులు, ఫకీర్ల పాలనాతీరును ప్రస్తావించారు. అయోధ్య ఉత్తరభారతానికి గుండెకాయ అని ఆయన అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత అంశాన్ని రెండోభాగంలో సింగ్ ప్రస్తావించారు.

ఇంత దౌర్భాగ్యమా..

డీసీపీ నేతృత్వంలో ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

ఏపీ పోలీసులపై నమ్మకం లేకే..

అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర పోలీసులపై నమ్మకం లేకే హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు షర్మిల చెప్పారు. సినీ నటుడు ప్రభాస్‌తో తనకు సంబంధం ఉందని ఒక వర్గం ఆన్‌లైన్‌లో దుష్ప్రచారం చేస్తున్నదని ఆమె బాధను వ్యక్తం చేశారు. 2014 ఎన్నికలకు ముందు కూడా ఇదే విధంగా దుష్ప్రచారం చేస్తే తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె అన్నారు. కొంత కాలం ఆపేసిన ఆ వర్గం ఇప్పుడు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో తనపై అభ్యంతరకరమైన పోస్టులు పెడుతోందని ఆమె ఆవేదన చెందారు. ఇది తన ఒక్కదానికే అవమానం కాదని, ఇలాంటి రాతలను అనేక మంది మహిళలు ఎదుర్కొంటున్నారని ఆమె చెప్పారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలి వంటి ఎన్నో నినాదాలు ప్రసంగాలకు, పేపర్లకే పరిమితం అవుతున్నాయని ఆమె ఆవేదనగా అన్నారు. నైతికత ఉన్న రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, మహిళలు తన ఫిర్యాదును బలపరచాలని ఆమె కోరారు. తాను ఒక భార్యగా, ఒక తల్లిగా, ఒక చెల్లిగా తన నైతికతను, నిజాయితీని నిరూపించుకోవాల్సిన అవసరం లేదని, తన గురించి తనకు తెలుసునని అన్నారు. అయితే తన గౌరవాన్ని కాపాడుకోవాల్సి ఉంది కాబట్టి పోలీసులకు ఫిర్యాదు చేసి మీడియాకు చెబుతున్నానని షర్మిల పేర్కొన్నారు. ప్రభాస్‌ను కనీసం ముఖాముఖిగా ఎదురు కాలేదని తన పిల్లలపై ప్రమాణం చేసి చెబుతున్నానని షర్మిల స్పష్టం చేశారు.

మానవ మృగాల బారిన చిరుత పులులు!

● నిజామాబాద్ జిల్లా గుత్ప శివారులో.. మంచిర్యాల జిల్లా రంగంపేట అడవుల్లో రెండు పులుల హతం ● నలుగురు వేటగాళ్ల అరెస్ట్.. మిగిలిన వారికోసం గాలింపు



గుత్ప శివారులో లభ్యమైన చిరుతపులి కళేబరం, నలుగురు నిందితులతో అధికారులు

ఆంధ్రభూమి బ్యూరో

నిజామాబాద్, జనవరి 14: తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనల్లో చిరుత పులులు మృత్యువాతపడుతున్నాయి. అనుకోని రీతిలో సంభవిస్తున్న ప్రమాదాలు సైతం వాటిని బలిగొంటున్నాయి. గడిచిన ఏడాదిన్నర కాలంలోనే వేర్వేరు సంఘటనల్లో ఐదు చిరుత పులులు మృత్యువాతపడడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గుత్ప శివారులో వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుకుని మరో చిరుత ప్రాణాలు కోల్పోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంతో విలువైన చిరుత గోర్లు, దంతాల కోసమే చిరుత ప్రాణాలను స్మగ్లర్లు కబళించారు. ఈ సంఘటనకు సంబంధించి అటవీ, పోలీసు శాఖ అధికారులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మాక్లూర్ మండలం గుత్ప తండాకు చెందిన కేతావత్ రవి, ఎం.నరేందర్, ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్‌కు చెందిన వినయ్‌కుమార్, తులసీరాంలు చిరుతను వేటాడినట్లు నిర్ధారించుకున్న అటవీ శాఖ అధికారులు, వారిని మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. రోజువారి విధుల్లో భాగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గుత్పతండా శివారులోని అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా, సోమవారం ఉదయం చిరుత కళేబరం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. దీంతో వారు తమ పైఅధికారులకు సమాచారం అందించగా, ఆర్మూర్ ఫారెస్ట్ డివిజన్ అధికారిణి అమృత, రేంజ్ ఆఫీసర్ రాములు హుటాహుటిన తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని పరిశీలించారు. చిరుత గోర్లు, దంతాలు లేకపోవడాన్ని గమనించి, స్మగ్లర్లే చిరుతను వేటాడి ఉంటారన్న అనుమానంతో డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. దీంతో జాగిలాలు సంఘటనా స్థలానికి కొంత దూరంలో ఉన్న ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లి అందులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కేతావత్ రవిని పట్టించాయి. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, మిగతా నిందితులు నరేందర్, తులసీరాం, వినయ్‌కుమార్‌ల ప్రమేయం సైతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో అధికారులు నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుండి ఏడు చిరుత గోర్లు, నాలుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా చిరుత గోర్లు, దంతాలను తీసేందుకు ఉపయోగించిన గొడ్డళ్లు, కత్తులు, ఇతర మారణాయుధాలు కూడా వారి వద్ద లభ్యమయ్యాయి. మృతి చెందిన చిరుత వయస్సు 4నుండి 5సంవత్సరాల మధ్య ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంచనా వేశారు. వెటర్నరీ వైద్యులను రప్పించి సంఘటనా స్థలంలోనే చిరుత కళేబరానికి పోస్టుమార్టం జరిపించారు. కొన్ని అవయవాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. చిరుతను మూడు రోజుల క్రితం వేటాడినట్లు అధికారుల విచారణలో నిందితులు వెల్లడించినట్లు తెలిసింది. కాగా, ఈనెల 4వ తేదీన ఇదే మండలంలోని రాంచంద్రాపల్లి గ్రామ సమీపంలో ఓ రైతు తన పంటలకు రక్షణగా పొలానికి ఏర్పాటు చేసుకున్న ఇనుప కంచెలో చిరుత కాలు చిక్కుకుని గంటల తరబడి నరకయాతన చివరికి తన కాలును వదిలించుకుని తీవ్ర గాయాలతో అటవీ ప్రాంతంలోకి పారిపోయింది. నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం శివారులో ఓ చిరుత అయితే ఏకంగా పక్షిని వేటాడేందుకు ఇరవై అడుగుల ఎత్తుతో ఉండే కరెంటు స్తంభం పైకి నిట్టనిలువునా ఎగబాకి హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందింది.

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్

ఫెదరర్, నాదల్ శుభారంభం


రోజర్ ఫెదరర్


రాఫెల్ నాదల్

మెల్బోర్న్, జనవరి 14: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ ఆటగాడు రాఫెల్ నాదల్, డిఫెండింగ్ చాంపియన్, మూడో ర్యాంకర్ రోజర్ ఫెదరర్ తమతమ ప్రత్యర్థులను ఓడించి శుభారంభం చేశారు. గతంలో ఫిట్నెస్ సమస్యతో అల్లాడిన నాదల్, కాలికి శస్త్ర చికిత్స తర్వాత కోలుకొని మళ్లీ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో తన ప్రత్యర్థులకు సవాళ్లు తప్పవని మొదటి రౌండ్‌లో జేమ్స్ డక్‌వర్త్‌ను 6-4, 6-3, 7-5 తేడాతో ఓడించడం ద్వారా సందేశం పంపాడు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన డక్‌వర్త్ గొప్పగా పోరాడినప్పటికీ, నాదల్ అపారమైన అనుభవం ముందు అతను తల వంచక తప్పలేదు. కాగా, ఫెదరర్ 6-3, 6-4, 6-4 ఆధిక్యంతో డెనిస్ ఇస్టోమిన్‌పై సులభంగా గెలుపొంది రెండో రౌండ్ చేరాడు. ఇతర మ్యాచ్‌ల్లో, అలెక్స్ డి మినౌర్ 6-4, 7-5, 6-4 స్కోరుతో పెడ్రో సౌసాను ఓడించగా, ఐదో ర్యాంక్ ఆటగాడు కెవిన్ ఆండర్సన్ 6-3, 5-7, 6-2, 6-1 ఆధిక్యంతో ఆండ్రియన్ మనారినోపై విజయాన్ని నమోదు చేశాడు. సీనియర్ ఆటగాడు థామస్ బెర్డిచ్ 6-3, 6-0, 7-5 స్కోరుతో 13వ ర్యాంకర్ కేల్ ఎడ్మండ్‌ను ఇంటిదారి పట్టించాడు.



స్టార్ అట్రాక్షన్ షరపోవా

మెల్బోర్న్, జనవరి 14: రష్యా టెన్నిస్ బ్యూటీ మరియా షరపోవా ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్‌లో స్టార్ అట్రాక్షన్‌గా మారింది. ఉద్దేశపూర్వకంగా కాకపోయినప్పటికీ, తాను ఉత్ప్రేరకాలను వాడింది నిజమేనని ప్రకటించి ఆమె గతంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కారణంగా సస్పెన్‌కు గురైన ఆమెకు గురైంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత మళ్లీ కెరీర్‌ను కొనసాగిస్తున్న షరపోవా చెప్పుకోదగ్గ రీతిలో రాణించడం లేదు. అయితే, ఆమె రాకనే టోర్నీకి అందం తెచ్చిందని నిర్వాహకులు సంబరపడుతున్నారు. షరపోవాను చూసేందుకే ప్రేక్షకులు పోటెత్తుతారన్నది వాస్తవం. అందరి దృష్టినీ ఆకట్టుకుంటున్న ఆమె మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో క్వాలిఫయర్ హారిట్ డార్ట్‌ను 6-0, 6-0 తేడాతో చిత్తుచేసి, అభిమానులను అలరించింది.

కాగా, ప్రపంచ రెండో ర్యాంకర్ ఏంజెలిక్ కెర్బర్ 6-2, 6-2 స్కోరుతో పొలొనా హెర్కాగ్‌పై గెలుపొందింది. మూడో ర్యాంక్ క్రీడాకారిణి కరోలినా వొజ్నియాకి 6-3, 6-4 ఆధిక్యంతో అలీసన్ వాన్ ఉవాన్క్‌పై విజయం సాధించింది. డానియేల్ కొలిన్స్ 2-6, 7-6, 6-4 తేడాతో 14వ ర్యాంకర్ జూలియా జార్జెస్‌పై సంచలన విజయాన్ని నమోదు చేసింది. 15వ ర్యాంకర్ అష్లే బార్టీ 6-2, 6-2 తేడాతో లుక్సికా కుమ్‌కుమ్‌ను, మరియా సకారీ 6-1, 3-6, 6-2 ఆధిక్యంతో 22వ ర్యాంక్ క్రీడాకారిణి జెలెనా ఒస్టాపెన్కోను ఓడించి శుభారంభం చేశారు.

తొలి రౌండ్‌లోనే ముర్రే ఔట్

సిడ్నీ, జనవరి 14: బ్రిటన్ ఆటగాడు ఆండీ ముర్రే గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ ప్రస్థానం ముగిసింది. ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత తాను మేజర్ టోర్నీల్లో పోటీపడబోనని ప్రకటించిన అతను తొలి రౌండ్‌లోనే పరాజయాన్ని ఎదుర్కొని నిష్క్రమించాడు. సోమవారం జరిగిన ఓ మారథాన్ మ్యాచ్‌లో 22వ ర్యాంక్ ఆటగాడు రాబర్టో బటిస్టా అగుట్ 6-4, 6-4, 6-7, 6-7, 6-2 తేడాతో ముర్రేపై విజయం సాధించాడు. మొదటి రెండు సెట్లను చేజార్చుకున్నప్పటికీ, ఆతర్వాత నిలదొక్కుకొని, తుది వరకూ పోరాటం కొనసాగించి రెండు సెట్లను ముర్రే తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే, అప్పటికే పూర్తిగా అలసిపోయిన అతను కీలకమైన చివరి సెట్‌లో అదే స్థాయిలో పోటీని ఇవ్వలేకపోయాడు. ఫలితంగా 2-6 తేడాతో దానిని కోల్పోయి, టోర్నీ నుంచి నిష్క్రమించాడు.



క్రీడాభూమి

పాండ్య, రాహుల్ సరే..

హర్మన్‌ప్రీత్ కౌర్‌పై చర్యలేవి?

పంజాబ్, జనవరి 14: ఇటీవల ఓ టీవీ కార్యక్రమంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీమిండియా ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌పై బీసీసీఐ కఠినంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. చివరికి క్షమాపణలు చెప్పినా ఆస్ట్రేలియా పర్యటను దూరంగా ఉంచింది. బీసీసీఐ వ్యవహరించిన తీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. సోషల్ మీడియా వేదికగా క్రికెట్ అభిమానులు బీసీసీఐ తీసుకున్న క్రమశిక్షణ చర్యలను కొనియాడారు. అయితే ఇక్కడివరకు బాగానే ఉన్న అభిమానులు ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ మరో ప్రశ్న సంధిస్తున్నారు. తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించి ఉద్యోగంలో చేరిన టీమిండియా మహిళా జట్టు టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇంగ్లాండ్ వేదికగా 2016లో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన హర్మన్‌ప్రీత్. ఆస్ట్రేలియాపై 171 పరుగులు చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. దీంతో పంజాబ్ ప్రభుత్వం హర్మన్‌ప్రీత్‌కు డీఎస్పీగా ఉద్యోగ అవకాశం కల్పించింది. 2018లో ఉద్యోగంలో చేరేందుకు తప్పుడు డిగ్రీ సర్టిఫికెట్లు సమర్పించిన హర్మన్ స్వయంగా పంజాబ్ ముఖ్యమంత్రి చేతులమీదుగా బాధ్యతలు కూడా చేపట్టింది. కానీ కొద్దిరోజులకే విచారణలో అవి తప్పుడు ధ్రువపత్రాలుగా తేలడంతో ఆమెను డీఎస్పీ హోదా నుంచి తప్పించారు. అయితే దీనిపై బీసీసీఐ ఎందుకు మౌనం వహించాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని అభిమానులు, క్రికెట్ ప్రేమికులు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై హర్మన్‌ప్రీత్ కూడా తగిన వివరణ ఇవ్వకపోవడం గమనార్హం.

యార్కర్లు సాధన చేస్తున్నా: భువనేశ్వర్



అడిలైడ్, జనవరి 14: భారత పేసర్ జస్ప్రీత్ బూమ్రాకు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు విశ్రాంతినిచ్చిన విషయం తెలిసిందే. దీంతో బూమ్రాలా యార్కర్లు వేసేందుకు సాధన చేస్తున్నట్లు భువనేశ్వర్ కుమార్ చెప్పాడు. భువనేశ్వర్ మాట్లాడుతూ యార్కర్లు వేసేందుకు ప్రత్యేక నైపుణ్యాలు కావాలి. బ్యాట్స్‌మెన్ పాదాల వద్ద బంతులు విసిరేందుకు సాధన చేస్తున్నా. డెత్ ఓవర్లలో పరుగులు నియంత్రించేందుకు, వికెట్లు తీసేందుకు యార్కర్లు వేయాల్సి ఉంటుందన్నారు. కొత్త బంతిని స్వింగ్ చేస్తే వికెట్లు తీయొచ్చు. కానీ బంతి పాతబడ్డాక యార్కర్లు, స్లోగా వేసే బంతులేస్తేనే వికెట్లు దక్కుతాయని భువనేశ్వర్ కుమార్ అన్నాడు.

చైనాతో కిదాంబి రూ.35 కోట్ల ఒప్పందం




ఢిల్లీ, జనవరి 14: భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ చైనా బ్రాండ్ లి నింగ్‌తో భారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. నాలుగేళ్ల ఒప్పందానికి రూ.35 కోట్లు. మాజీ ప్రపంచ నెంబర్ వన్ శ్రీకాంత్ భారత్ తరఫున ఆరు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచిన ఆటగాడు. లీ నింగ్ చైనాలో అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాండ్. స్పాన్సర్‌షిప్‌తో పాటు క్రీడా సామగ్రి కూడా అందజేస్తుంది. ఈ విషయమై శ్రీకాంత్ మాట్లాడుతూ భారత్‌తో పాటు అంతర్జాతీయంగా లీ నింగ్‌కు ప్రచారకర్తగా ఉండడం గౌరవంగా భావిస్తున్నానని, వారి ఉత్పత్తులంటే తనకు ఇష్టమని చెప్పాడు. చైనా, ఇండోనేసియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో బ్యాడ్మింటన్ జట్లకు లీ నింగ్ మద్దతిస్తోంది. 2018 జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ భారత జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరించింది. 2020 టోక్యోలో జరిగే ఒలింపిక్స్ వరకు భారత ఆటగాళ్ల దుస్తుల స్పాన్సర్స్‌గా ఉండనుంది.

వాణిజ్యభూమి

పతనంతో మొదలు

- భారత స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపిన గ్లోబల్ ట్రెండ్స్



ముంబయి, జనవరి 14: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో ఈవారం మొదటి రోజు లావాదేవీలు పతనంతో ముగిశాయి. గత వారం చివరిలో నష్టాలను ఎదుర్కొన్న స్టాక్ మార్కెట్ సోమవారం కూడా కోలుకోలేదు. 30 షేర్ ఇండెక్స్ 156.28 పాయింట్లు (0.43 శాతం) కోల్పోయి 35,853.56 పాయింట్ల వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. 57.35 పాయింట్లు (0.53 శాతం) పతనమై, 10,537.60 పాయింట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, ఫలితంగా ఆసియా మార్కెట్ల క్షీణత బీఎస్ఈలో ట్రేడింగ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. ఈవారం సెనెక్స్ పుంజుకుంటుందని, పండగ వాతావరణం మదుపరుల్లో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తుందని స్టాక్ బ్రోకర్లు వేసుకున్న అంచనాలు తల్లకిందులయ్యాయి. ట్రేడింగ్ మొదలైనప్పటి నుంచి దాదాపు చివరి వరకూ స్టాక్స్ అమ్మకాలవైపే మదుపరులు ఆసక్తిని ప్రదర్శించారు. ప్రతికూల వాతావరణంలో సాగిన లావాదేవీల్లో లార్సన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) 2.64 శాతం, ఇండస్ఇండ్ బ్యాంక్ బ్యాంక్ 2.07 శాతం నష్టపోయాయి.

అదే విధంగా వేదాంత (1.78 శాతం), ఎన్‌టీపీసీ (1.56 శాతం), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్/ 1.50 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (1.36 శాతం), యాక్సిస్ బ్యాంక్ (1.33 శాతం), హీరో మోటార్ (1.22 శాతం), భారతీ ఎయిర్‌టెల్ (1.21 శాతం), ఏషియన్ పెయింట్స్ (1.01 శాతం) కూడా నష్టాలను ఎదుర్కొన్న కంపెనీల జాబితాలో ఉన్నాయి. అయితే, ఎస్ బ్యాంక్ వాటాల ర్యాలీ కొనసాగడంతో, 6.22 శాతం పెరుగుల సాధ్యమైంది. మేనేజింగ్ డైరెక్టర్/ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా సేవలు అందిస్తున్న రాణా కపూర్ స్థానంలో ఈ రంగంలో అపారమైన అనుభవం ఉన్న రజత్ మోంగా నియామకం దాదాపు ఖరారైందన్న వార్త ఎస్ బ్యాంక్ స్టాక్స్‌కు డిమాండ్‌ను పెంచాయి. లాభపడిన కంపెనీల జాబితాలో ఇన్ఫోసిస్ కూడా ఉంది. సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతీ, టాటా మోటార్స్ తదితర కంపెనీల వాటాలు సగటున 1.68 శాతం లాభాలను నమోదు చేశాయి. భారత స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ నష్టాల్లో కొనసాగడానికి అంతర్జాతీయ మార్కెట్లు బలహీన పడడం ఒక కారణమైతే, కేంద్ర ప్రభుత్వం నవంబర్ మాస పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు పడిపోయిందని ప్రకటించడం మరో కారణం. గత 17 నెలల్లో ఎన్నడూ లేని విధంగా పారిశ్రామిక ఉత్పత్తి రేటు 0.5 శాతం పడిపోయిందని ఆ నివేదిక స్పష్టం చేసింది. వినియోగ వస్తువులు, మూలధన వస్తువుల ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని వివరించింది. ఈ నివేదిక మదుపరులను కొత్త వాటాల కొనుగోళ్లకు దూరంగా ఉంచింది. ఎక్కువ మంది తమ వద్ద ఉన్న వాటాలను అమ్మడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో, సెన్సెక్స్ నష్టపోయింది. దేశీయ పెట్టుబడిదారులు కొంత వరకు ఆదుకోవడంతో, భారీ నష్టం తప్పిందనే చెప్పాలి. విదేశీ పెట్టుబడిదారులు 687.20 కోట్ల రూపాయల విలువైన షేర్లను అమ్మగా, దేశీయ మదుపరులు 123.17 కోట్ల రూపాయల విలువైన వాటాలను కొనుగోలు చేశారు. ఇలావుంటే, రూపాయి విలువ 32 పైసలు పడిపోయింది. ఫలితంగా డాలర్ విలువ 70.81 రూపాయలకు చేరింది.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,156.00	1 గ్రాము:	రూ. 3,088.00
8 గ్రాములు:	రూ.25,248.00	8 గ్రాములు:	రూ. 24,704.00
10 గ్రాములు:	రూ. 31,560.00	10 గ్రాములు:	రూ. 30,880.00
100 గ్రాములు:	రూ.3,15,600.00	100 గ్రాములు:	రూ. 3,08,800.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,375.401	1 గ్రాము:	రూ. 3,302.674
8 గ్రాములు:	రూ. 27,003.208	8 గ్రాములు:	రూ. 26,421.392
10 గ్రాములు:	రూ. 33,754.01	10 గ్రాములు:	రూ. 33,026.74
100 గ్రాములు:	రూ. 3,37,540.1	100 గ్రాములు:	రూ. 3,30,267.4
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.20	8 గ్రాములు:	రూ. 331.20
10 గ్రాములు:	రూ. 414.00	10 గ్రాములు:	రూ. 414.00
100 గ్రాములు:	రూ. 4,140.00	100 గ్రాములు:	రూ. 4,140.00
ఒక కిలో:	రూ. 41,400.00	ఒక కిలో:	రూ. 41,400.00

పసిడికి సంక్రాంతి మెరుపు

- రూ.225 పెరిగిన పది గ్రాముల ధర

న్యూఢిల్లీ, జనవరి 14: పసిడి ధర దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం పది గ్రాములపై 225 రూపాయలు పెరిగింది. మొత్తం ధర రూ.33,100 పలికింది. పండుగ సీజన్ కావడంతో స్థానిక వ్యాపారుల నుంచి డిమాండ్ పెరగడంతోబాటు, అంతర్జాతీయ మార్కెట్‌లో సైతం సానుకూల పరిస్థితులు నెలకొనడం బులియన్ మార్కెట్‌కు ఊతమిచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే వెండి ధరల్లో సైతం పెరుగుదల నమోదైంది. కిలో వెండి ధర రూ.250 పెరిగి 40.100కు చేరింది. ప్రత్యేకించి పారిశ్రామిక విభాగాల నుంచి, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పెరగడం వెండి ధర పెరిగేందుకు దోహదం చేసిందని అంచనావేస్తున్నారు. అమెరికన్ డాలర్‌తో రూపాయి ధర తగ్గినప్పటికీ మార్కెట్ల డిమాండ్‌తో బంగారు, వెండి ధరలు పెరిగాయంటున్నారు. కాగా అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే న్యూయార్క్‌లో ఔన్సు బంగారం ధర 1,290.22 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.73 డాలర్లు వంతున పలికింది. ఇక మన రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛ బంగారం పది గ్రాములపై 225 రూపాయలు పెరిగి రూ.33,100 పలికింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛ బంగారం ధర 32,950గా పలికింది. ఇక సవరం (ఎనిమిది గ్రాములు) బంగారం ధర రూ.100 పెరిగి రూ.25,400 పలికింది. ఇక ప్రతి వారం పద్ధతిలో సరఫరా చేసే వెండి కిలోధర రూ.39.617 పలికింది. ఇక వెండి నాణేలు ధరలో పెద్దగా మార్పేమీ కనిపించలేదు. వంద పీసుల వెండి కొనుగోలు ధర రూ.77వేలు, విక్రయ ధర రూ.78 వేల వంతున పలికింది.

కుదిరిన ఒప్పందం

- ఫారెక్స్ సంస్థల్లో ‘ఎబిక్స్‌క్యాష్’ అత్యధిక వాటాలు

ముంబై, జనవరి 14: ఎస్సెల్ ఫారెక్స్, వైజ్‌మాన్ ఫారెక్స్ సంస్థల్లో 57.35 మిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆ సంస్థల్లో సుస్థిర స్థానాన్ని ఆక్రమించడం ద్వారా ఆర్థిక సేవలను మరింత విస్తరించాలని ఎబిక్స్‌కాష్ సంస్థ సోమవారం నాడిక్కడ నిర్ణయించింది. ఈమేరకు భారత్‌కు చెందిన వైజ్‌మాన్ ఫారెక్స్ సంస్థతో ‘ఎబిక్స్‌క్యాష్ వరల్డ్ మనీ’ సంస్థ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఆ ప్రకారం వైజ్‌మాన్ ఫారెక్స్ సంస్థలోని 74.84 శాతం వాటాలను ఎబిక్స్‌క్యాష్ సొంతం చేసుకుంటుంది. వైజ్‌మాన్ ఫారెక్స్ 65.94 మిలియన్ డాలర్ల సంస్థాగత విలువ కలిగివుంది. అలాగే ఎస్సెల్ ఫారెక్స్‌లో సైతం వంద శాతం ఆస్తులను సొంతం చేసుకునేలా ఎబిక్స్‌క్యాష్ మరో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఆస్తులు మొత్తం 8 మిలియన్ డాలర్లు ఉంటాయని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఎబిక్స్‌క్యాష్ సంస్థ దేశంలోని 3,700 నగరాలు, 6000 జిల్లాల్లో విస్తరించిన ఆర్థిక సంస్థగా గుర్తింపు పొందిందింది. ప్రధానంగా అంతర్గత పరిస్థితులు, బ్యాంకు రుణాలు తదితర అంశాల ప్రాతిపదికగా వాటాల సేకరణ, నిధుల విడుదల ఉంటుందని ఎస్సెల్ ఫారెక్స్ సంస్థ తెలిపింది.

మైండ్‌విజన్ కేపిటల్ మోసం!

- జరిమానా విధించిన సెబీ

న్యూఢిల్లీ, జనవరి 14: వాటాల విషయంలో మైండ్‌విజయన్ కేపిటల్ కంపెనీ ఉద్దేశపూర్వకంగా మోసానికి పాల్పడిందని భారత స్టాక్ మార్కెట్‌ను నియంత్రీకరించే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ప్రకటించింది. పది ఖాతాలను ప్రత్యేకంగా తప్పుపడుతూ 34 లక్షల రూపాయల జరిమానా విధించింది. సెబీ సోమవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, మార్కెట్‌లో లేని డిమాండ్‌ను సృష్టించేందుకు మైండ్‌విజన్ కేపిటల్ కంపెనీ పాల్పడింది. ఎక్కువ లావాదేవీలు జరిపిన పది ఖాతాలను పరిశీలిస్తే, ఇవన్నీ ఒకరితో ఒకరికి సంబంధం ఉన్నవేనని స్పష్టమైంది. మైండ్‌విజన్ కేపిటల్ కంపెనీ షేర్ మార్కెట్‌లో కృత్రిమ డిమాండ్‌కు పాల్పడుతున్నదని అందిన ఫిర్యాదుపై సెబీ విచారణ జరపడంతో ఈ విషయం బయటపడింది. పది ఖాతాల్లోనే పరస్పర అమ్మకాలు, కొనుగోళ్లను సెబీ గుర్తించింది. మార్కెట్‌లో వాటాలకు డిమాండ్‌ను సృష్టించడానికి ఈ లావాదేవీలు జరిపారని తేటతెల్లమైంది. ఈ పది ఖాతాల్లో 94,745 వాటాలు ట్రేడైనట్టు నమోదైంది. నిజానికి మార్కెట్‌లో ఉన్న షేర్ల కంటే ఇది 12.5 శాతం అధికం. ఒక వ్యూహం ప్రకారం వాటాల అమ్మకాలను మార్కెట్‌లో చూపించడం ద్వారా కృత్రిక డిమాండ్‌ను సృష్టించడానికి ప్రయత్నం జరిగిందని సెబీ నిర్ధారించింది. 2009-2010 సంవత్సరాల మధ్య జరిగిన వాటాల అమ్మకాలు లేదా కొనుగోళ్లు ఈ పది ఖాతాల మధ్యలో ఉండడం ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన ట్రేడింగ్ అని స్పష్టమవుతున్నదని సెబీ ప్రకటించింది. లేని డిమాండ్‌ను మార్కెట్‌లో చూపేందుకు ప్రయత్నించిన కారణంగా మైండ్‌విజన్ కేపిటల్ సంస్థకు జరిమానా విధించినట్టు వివరించింది. స్టాక్ మార్కెట్‌లో ఇలాంటి అక్రమాలను సహించేది లేదని స్పష్టం చేసింది.

ప్రైవేటు ఈక్విటీలు, వెంచర్ మూలధనంపై

35 శాతం పెరిగిన పెట్టుబడులు


ముంబయి, జనవరి 14: ప్రైవేటు ఈక్విటీలు (పీఈ), వెంచర్ మూలధనం (వీసీ)పై 2018లో పెట్టుబడులు పెరిగాయి. దేశం మొత్తం మీద ఈ పెట్టుబడులు సుమారు 35 శాతం అంటే 35.1 బిలియన్ డాలర్ల మేర పెరిగాయి. 2017లో పెరిగిన 26.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులకంటే ఇది అధికం. అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల కారణంగా ఈ పెట్టుబడులు గతేడాది పెరిగాయని ఆర్థిక నిపుణులు అంచనావేస్తున్నారు. పీఈ, వీసీల నుంచి వెనక్కు మళ్లిన పెట్టుబడుల విలువ (ఎగ్జిట్ వాల్యూ) మొత్తం 26 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇది గడచిన మూడేళ్ల కంబైన్డ్ ఎగ్జిట్ వాల్యూస్‌కు సమానం. కాగా 2018వ సంవత్సరం పీఈ, వీసీల్లో పెట్టుబడులకు, అదే క్రమంలో పెట్టుబడులు వెనక్కు తీసుకోవడంలోనూ మంచి ఫలితాలిచ్చిన సంవత్సరంగా మిగిలింది. ముందే అంచనా వేసిన విధంగా ఇవి ఈయేడాది అత్యధికంగా రికార్డు స్థాయిలోనే జరిగాయి. యేడాది ద్వితీయార్థంలో పెట్టుబడులు చాలావరకు వెనక్కు వెళ్లినప్పటికీ అవసరానికి మించి తర్వాత ఇన్వెస్టర్లు మదుపుచేశారని ప్రైవేటు ఈక్విటీ సర్వీసెస్‌కు చెందిన ఆర్థిక నిపుణుడు విశ్లేషించారు. 2018లో ప్రధానమైన 500 మిలియన్ డాలర్ల విలువైన 12 వాణిజ్య ఒప్పందాలు జరిగాయని, మరో ఎనిమిది ఒక బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు జరిగాయన్నారు. సంవత్సరం మొత్తం మీద 761 ఒప్పందాలు జరిగి అంతకు క్రితం యేడాదికంటే 28 శాతం పెరిగాయని ఆయన వివరించారు. ప్రత్యేకించి స్టార్టప్‌ల్లో కొలుగోళ్లు, పెట్టుబడులతో ఈ వాణిజ్య ఒప్పందాల్లోనూ పెరుగుదల నమోదైందంటున్నారు. సాఫ్ట్‌బ్యాంకు మూలధన వెంచర్ పెట్టుబడుల వంటి మెగా ఒప్పందాలు సైతం ఈ సందర్భంగా జరిగాయి. టెన్సెంట్ అండ్ నాస్పర్స్ సంస్థ పెద్దమొత్తంలో పెట్టుబడులు మదుపుచేసింది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 52శాతమే

- క్రమంగా తగ్గించుకోవాలని బ్యాంకులకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 14: కార్పొరేట్ బ్యాంకులతో సమానమైన ప్రగతి సాధించే దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకులను క్రమక్రమంగా ప్రభుత్వ వాటాలను (ఈక్విటీలను) 52 శాతానికి తగ్గించుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సహజంగానే ప్రభుత్వ వాటాలు అధికంగా ఉంటాయి. ఐతే కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వ వాటాలు తగ్గించాలన్నది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యూహం. ఈక్రమంలో తొలివిడతగా 52 శాతానికి ఈ వాటాలు తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్ స్థితిగతులు సానుకూలంగా మారిన వెంటనే ప్రభుత్వ రంగ బ్యాంకులు కేంద్ర ఆదేశాలను అమలులోకి తెస్తాయని, ఇందుకు సంబంధించి అన్ని అనుమతులూ వారికి ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవడం ద్వారా మరో 25 శాతం ప్రజల వాటాలు సంతరించుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. దేశంలో అతి పెద్ద బ్యాంకింగ్ వ్యవస్థ కలిగిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్స్ (క్యూఐపీ) ద్వారా 20వేల కోట్ల రూపాయల విలువైన షేర్ల అమ్మకాలకు ముందుకు వచ్చింది. తొలుత ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవాలని నిర్ణయం జరిగింది. గత నెలలో బ్యాంకుకు చెందిన వాటాదార్లు వ్యాపార విస్తరణలో భాగంగా చేపట్టిన షేర్ల అమ్మకాలకు అంగీకారం తెలిపారు. పలు ఇతర బ్యాంకులు సైతం ఈ విధానాన్ని అనుసరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

తెలంగాణ పులిబిడ్డ 'పొడ'



పులులను సైతం తరిమే తెగువ

- రోగాలు, రోస్టులు తట్టుకునే జన్యు
- నల్లమల పరివాహంలో అరుదైన గోజాతి
- దేశంలో 39వ పశు సంతతిగా గుర్తింపు
- నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనిటిక్స్ రిసోర్స్ పరిశీలన
- తెలంగాణ జీవ వైవిధ్య మండలి, ఎన్జీవోల పరిశోధన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ఎంతటి క్రూర మృగ కైనా అడవికి రారాజు పులి తారసపడితే గజ గజ వణికిపోతుంది. ప్రాణ భయంతో పరుగు లంకిం చుకుంటుంది. కానీ నల్లమల అభయారణ్య పరి వాహక ప్రాంతంలో పులులు, చిరుతలు, ఎలుగు బంటి వంటి అతి క్రూర మృగాలకు కూడా వంట్లో వణుకు పుట్టించగలిగిన ఓ పశుజాతి సంతతి ఉందంటే కాస్త ఆశ్యరకరమైన విష యమే. అది చిరుత కాదు, పులి అంతకంటే కాదు. కానీ పులులను సైతం తిరిగి తరమి కొట్టగ లిగిన ధైర్యం, తెగవ కలిగిన అరుదైన గోజాతి ఈ ప్రాంతంలో ఉందంటే కాస్త ఆశ్చర్యకరమైన విష యమే. అదే 'పొడ' సంతతి గోజాతి. ఇది నల్ల మల అటవీ పరివాహక ప్రాంతానికే పరిమితమైన అరుదైన గోజాతి.



ఈ వారసత్వ గోజాతిని కాపాడుకోవడానికి వాసన్ (వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టి విటీస్ నెట్‌వర్క్) అనే స్వచ్ఛంద సంస్థ, తెలం గాణ జీవ వైవిధ్య మండలి సహకారంతో అమి తంగా కృషి చేసింది. ఈ సంస్థల సంయుక్త పరి శోధనలతో సమర్పించిన నివేదికల కృషి ఫలి తంగా తెలంగాణకు పులిబిడ్డలాంటి పొడ జాతికి ప్రపంచస్థాయి గుర్తింపు త్వరలోనే లభించబో తుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని (ప్రస్తుతం నాగర్‌కర్నూల్) నల్లమల అటవీ పరివా హక ప్రాంతానికే పరిమితమైన 3990 పొడ జాతి పశువుల పొడవు, బరువు, తోక, కాళ్లు, కొమ్ములు, వయసు తదితర జన్యుపరమైన అంశాలు పరిశీ లించిన ఢిల్లీ కేంద్రంగా ఉన్న నేషనల్ బ్యూరో ఆఫ్ ఏనిమల్ జెనిటిక్ రీసోర్సెస్ (ఎన్‌బిజిఆర్) పరిశోధన సంస్థ వచ్చే నెల ఫిబ్రవరిలో కానీ, మార్చి మొదటి వారంలో కానీ దేశంలో 39వ గోజాతిగా పొడను ప్రకటించబోతుంది. దేశంలో తెలంగాణ 29వ కొత్త రాష్ట్రం కాగా, పొడ జాతి 39వ పశుజాతిగా గుర్తింపు పొందడం మరో విశేషం. ఈ ప్రకటన వెలువడగానే తెలంగాణ రాష్ట్ర పశువుగా పొడ జాతికి గౌరవం దక్క నుంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా పాలమూరు కూలీలకు కష్టజీవులుగా ఎంతటి పైరు ప్రఖ్యాతలున్నాయో అదే జిల్లాకు చెందిన పొడ జాతి ఎద్దులు, ఆవులకు కూడా కష్టజీవు లుగా పేరు తెచ్చుకున్నాయి. ఎంతటి చలి, ఎండ, వానలను తట్టుకోగలిగిన జన్యుపరమైన శక్తి, రోగాలు, రోస్టులకు నెరవని శారీరతత్వం పొడ జాతి పశువులకు సొంతం. నల్లమల అటవీ ప్రాంతంలో ఔషద గుణాలు కలిగిన ఆకులు, అలముల వల్లనే వీటికి రోగ నిరోధకశక్తి ఎక్కు వని పరిశోధనల్లో తేలింది. తెల్లని దేహంపై ఎరుపు, గోదమ కలగలిసిన చారలు, గోదమ రంగు దేహంపై తెలుపు, గోదమ రంగులు కలగ లిసిన చారలతో దూరం నుంచి చూస్తే జింకలను తలపించేలా పొడ కోడెలు, ఎద్దులు, ఆవులు ఉంటాయి. సూది మొనలాంటి కురస కొమ్ములు కలిగి ఉంటాయి.

పులులు, చిరుతలు తోడేళ్ల వంటి క్రూరమృగాలను అల్లంత దూరం నుంచే గ్రహించగలిగిన వాసన, వినికిడి, చూపువీటికున్న మరో ప్రత్యేకత. వర్షాన్ని, పిడుగుపాట్లను కూడా పసిగట్ట గలగడం వీటికున్న మరో ప్రత్యే కతగా పొడ జాతి పశువులపై పరిశోధనలు చేసిన వాసన్ సంస్థకు చెందిన మేఘవర్ధన్‌రెడ్డి ఆంధ్రభూమి ప్రతినిధికి చెప్పారు. నల్ల మల అటవీ ప్రాంతంలోనే పుట్టి పెరగ డంతో ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని అనుసరించి రాళ్ల రప్పలు, కొండలు, గట్లను పొడ జాతి పశువులు సులువుగా ఎక్కుతాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పచ్చగడ్డి లభించకపోయినా ఎండుగడ్డితోనే ఇష్టంగా పొట్టపోసుకోగలవని మేఘవర్ధన్‌రెడ్డి వివ రించారు. బలమైన గిట్టలు కలిగి ఉండటం వల్ల కొండ ప్రాంతాల్లోని రాళ్లు, రప్పల నేల స్వభా వంలో సేద్యానికి అనుకూలంగా ఇవీ పని చేయడం వల్ల నల్లమల అటవీ ప్రాంత గిరిజనలు సేధ్యానికి పొడ జాతి కోడెలు, ఎద్దులనే ఉపయో గిస్తున్నారు.

నల్లమల పరివాహక ప్రాంతంలోని అమ్రా బాద్, లింగాల, అచ్చంపేట, పదర నాలుగు మండలాల పరిధిలో సుమారు 15 వేల పొడ జాతి సంతతిని గుర్తించారు. కర్నా టకలోని యాదగిర్, గుల్బర్గ, గురుమిట్‌కాల్, రాయచూరు ప్రాంతాల్లో సాగునీటి వనరులు తక్కువ. అక్కడ నేల స్వభావం ఎక్కువగా రాళ్లు, రప్పలతో కూడు కున్నవి కావడంతో ఆ ప్రాంత రైతులు పొడ జాతి ఎద్దులను కొనుగోలు చేయడానికి కురు మూర్తి జాతర సందర్భంగా జరిగే పశువుల సంతకు వస్తారని అమ్రాబాద్‌కు చెందిన మన్యం అనే రైతు చెప్పారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఒంగోలు గిత్త, కర్నాటకకు చెందిన మైసూర్ ఎద్దు, తమిళనాడుకు చెందిన పుంగనూర్, గుజరాత్‌కు చెందిన కంక్రీజ్ జాతి గోజాతికి మాత్రమే ప్రత్యేక గుర్తింపు లభించగా త్వరలో వీటి సరసన తెలంగాణకు చెందిన పొడ చేరబోతుంది.



16న శ్రీవారి ఆలయంలో అంగప్రదక్షిణ రద్దు

తిరుపతి, జనవరి 14: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతిరోజూ తెల్లవారుజా మున భక్తులకు కల్పించే అంగప్రదక్షిణను జనవరి 16వ తేదీన టీటీడీ రద్దుచేసింది. ప్రతి యేడాది శ్రీవారికి నిర్వహించే పార్వేట ఉత్సవం సంక్రాంతి కనుమ పండుగనాడైన ఈనెల 16వ తేదీ అత్యంత ఘనంగా జరుగనుంది.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్ర మాలు నిర్వహించనున్నారు. అందువల్ల టీటీడీ అంగ ప్రదక్షిణను రద్దు చేసింది. కాగా 16న శ్రీవారి ఆలయంలో గోదాపరిణయోత్సవం జరపాలని టీటీడీ నిర్ణయించింది. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్దజీయ్యర్‌స్వామి పీఠం నుంచి మాడ వీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆల యానికి తీసుకువెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు శ్రీ మలయప్ప స్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండ పానికి వేంచేపుచేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారు ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే తోమాలసేవ, అర్చన, సహస్ర కలశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దుచేసింది.

గుమ్మిలేరులో భారీ పిడకల దండ

ఆలమూరు, జనవరి 14: సంక్రాంతి పండుగ సోమవారం మండల పరిధిలో భోగి మంటలతో కన్నులపండువగా ప్రారంభమైంది. తూర్పుగోదావరి జిల్లా గుమ్మిలేరులో ఊదాలమ్మ గ్రామదేవత ఉత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్థులు గత ఏడాది డిసెంబరులో పది టన్నుల ఆవుపే డను సేకరించిన 60మంది మహిళలు 1.56 కిలోమీటర్ల మేర తయారు చేసిన భోగి పిడకల దండను సుమారు 500మంది భక్తులు గుమ్మిలేరులో గ్రామోత్సవం నిర్వహించి గుమ్మిలేరు సెంటర్ వద్ద భోగి మంటలో వేశారు. ఈ దండ భారత్, స్టేట్ రికార్డులను కైవసం చేసుకోగా, గిన్నిస్ బుక్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులకు ఆ బుక్ సాధన సంఘం అధ్యక్షుడు శ్యామ్ జాదూ పంపించినట్లు తెలిపారు. ఈ భారీ భోగిపిడకల దండను రెడ్డి రుద్రయ్య చౌదరి, అముజూరి శ్రీనివాసు, గుణ్ణం బొడ్డుబాబు, కోరా సత్యవతి ఆధ్వర్యంలో తయారు చేశారు.



గుమ్మిలేరులో భోగి దండను ఊరేగిస్తున్న దృశ్యం



భోగి మంటలో భారీ పిడకల దండ

కొక్కొరోకో

యథేచ్ఛగా కోడి పందేలు

- ప.గో. జిల్లా ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో జూదాల జాతర
- ఇళ్లకే పరిమితమైన పోలీసు అధికారులు





జంగారెడ్డిగూడెం, జనవరి 14: సంక్రాంతికి కోడి పందేలు నిర్వహించరాదని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసినప్పటికీ, కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసు బాసులు హెచ్చరికలు చేసినప్పటికీ ఈ ఏడాది కూడా చివరకు కోడిపుంజే నెగ్గింది. రాజకీయ నేతలదే పైచేయి అయ్యింది. చట్టం, న్యాయం అమలు చేసేందుకు పోలీస్, రెవెన్యూ అధికారులు చేసిన ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో భోగిరోజు ఉదయం 11 గంటలకే ఏజన్సీ, మెట్ట ప్రాంతాల్లో కోడి పందేలు మొదల య్యాయి. నిజాయితీగా పనిచేయాలనుకున్న కొంతమంది పోలీసు అధికారు లకు రాజకీయ వత్తిడులు చేదు అనుభవాన్నే మిగిల్చాయి. వారు భోగిరోజు మధ్యాహ్నం నుండి ఇళ్లకే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఏటా జరిగే తంతే ఈ నాలుగు రోజులు జరుగుతోంది. చట్టాలు, న్యాయస్థానాలు తమను ఏమీ చేయ లేవనే ధీమా కోడిపందాల నిర్వాహకుల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం చూసీచూడ నట్టు వ్యవహరించాలని పోలీసులను ఆదేశించడం వల్లే ఉదయం వరకు బిగిం చిన పట్టును పోలీసులు ఒక్కసారిగా పట్టు సడలించాల్సి వచ్చింది. బరుల వద్ద నిఘా వేసిన పోలీసులు మొహం చాటేయక తప్పలేదు. దీనితో భోగిరోజు సోమవారం ఉదయం 11 గంటల నుండి ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో కోడి పందేలు, జూదాల జాతర యథేచ్ఛగా ప్రారంభమైంది. సంప్రదాయం ముసు గులో భోగి పండుగను పురస్కరించుకుని కోడి పందేల బరులను ప్రారంభిం చారు. అధికార, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు, నేతలు జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మొగపర్తి సోంబాబు కోడి పందేల బరిని ప్రారంభించారు. పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు పుంజును విడిచిపెట్టారు. వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు పరిమి రాంబాబు ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీనివాసపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పోల్నాటి బాబ్జీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరిని డికెడి సత్యనారాయణ, వైసీపీ చింతలపూడి నియో జకవర్గ కన్వీనర్ ఉన్నమట్ల ఎలీజా ప్రారంభించారు. శ్రీనివాసపురం గ్రామం పరిధిలోనే జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డుకు సమీపంలోని మామిడితోటలో కాంగ్రెస్ నేతలు పోల్నాటి ప్రసాద్, ఓరుగంటి నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు బల్లే రాజారావు ఏర్పాటు చేసిన మరొక బరిని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ రెండు బరుల్లోను మహిళలు, చిన్నపిల్లలు సైతం పందేలను ఆసక్తిగా తిల కించారు. జంగారెడ్డిగూడెంలోని పామాయిల్ తోటలో బరిని తెలుగుదేశం నేతలు పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ పుంజులు వదిలి ప్రారంభించారు. మండలంలో పలు బరులను ప్రజాప్రతినిధులు, రాజ కీయ నేతలు ప్రారంభించడం విశేషం. కోడి పందేలతోపాటు బరుల వద్ద మూడుముక్కలాట, కోత ముక్కాట, లోన బయట వంటి పేకాటలు, గుండాటలు, మద్యం విక్రయాలు భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. మండలంలో లక్కవరంలో రెండుచోట్ల బరులు నిర్వహిం చారు. మండలంలోని పేరంపేట, ఎ పోలవరం, గురవా యిగూడెం, దేవులపల్లి, మైసన్నగూడెం గ్రామాల్లో కూడా కోడి పందేలు, గుండాటలు, పేకాటలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. శ్రీనివాసపురం బరిలో జిల్లాకు చెందిన పుంజులతో వేలేరు పాడు మండలం భూదేవిపేట, రామసింగా రంల నుండి వచ్చిన లక్ష్మయ్య పుంజులు తలపడ్డాయి. బైపాస్ రోడ్డు వద్ద జరిగిన బరిలో ఇతర ప్రాంతాల నుండి పందెగాళ్ళు కోళ్లతో వచ్చి బల్లే రాజారావు పుంజులపై జోరుగా పందేలు కాశారు. కోళ్ల యజమాను లతో పాటు పై పందాల రాయుళ్లు, పేకాటరా యుళ్లు, గుండాటల్లో పాల్గొన్న వారు రూ.లక్షలు కోల్పోయినట్టు తెలుస్తోంది. కాగా, సంక్రాంతి, కనుమ రోజుల్లో రాత్రి కూడా ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడి పందాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పా ట్లలో నిమగ్నమై ఉన్నారు.



శ్రీనివాసపురం బరిలో గుండాటలు



దేవులపల్లి బరిలో మూడు ముక్కలాట

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

మంగళవారం, 15 జనవరి 2019



సంక్రాంతి ముచ్చట్లు



తెలుగువారు సంస్కృతీ ప్రియులు. సంప్రదాయబద్ధులు. ఆచార వ్యవహార పరాయణులు. తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలలో పండుగలు ఒక భాగం. తెలుగువారికి ముక్కోటి దేవతలు ఉన్నట్లే, అందుకు తగినట్లుగానే పండుగలు కూడా ఉన్నాయి. చైత్ర వైశాఖాది ద్వాదశ మాస పర్యంతం, పాడ్యమి మొదలగు ముప్పది తిథులకు సంవత్సరం మొత్తంమీద ఏదో ఒక పండుగ ఉంటూనే ఉంటుంది. ఎన్ని పండగులు వచ్చినా శ్రమను లెక్కచేయకుండా, ఖర్చుకు వెనుకాడకుండా తెలుగువారు ప్రతీ పండుగను ఇనుమడించిన ఉత్సాహంతో జరుపుకుంటారు. ఇల్లు అలికి ముగ్గులు పెట్టి ఇంటిని, పూజామందిరాలను ఆయా పండుగలకు పూజలకు అనుగుణంగా అలంకరించి ఆయా పూజలను, పండుగలను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

అయితే, పండుగలను జరుపుకోవడమనే సంప్రదాయం తరతరాలుగా, యుగయుగాలుగా నాటి నుండి నేటివరకు అప్రతిహతంగా, అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వస్తున్నప్పటికీ ఇటీవలి కాలంలో మారుతున్న కాల మాన పరిస్థితుల దృష్ట్యా క్రమేపీ ఆ సంప్రదాయం సన్నగిల్లుతూ వస్తోన్నట్లుగా కనిపిస్తోంది.

ఉదాహరణకు తెలుగువారు పెద్ద పండుగగా పిలుచుకునే 'సంక్రాంతి' పండుగనే తీసికొంటే- గతంలో సంక్రాంతి పండుగకు నెల రోజుల ముందే హడావుడిమొదలయ్యేది. ధనుర్మాసం ప్రారంభమైన నాటినుండి అంటే నెల పట్టిన నాటినుండి తెలుగువారి లోగిళ్ళలో ఇంతులు తెల్లవారుజామునే నిద్ర లేచి ఇంటిముందు కలాపి జల్లి రంగు రంగుల రంగవల్లికలు తీర్చిదిద్దటం మొదలుపెట్టేవారు. మరోవైపు కాళ్ళకు గజ్జెలు, ఒక చేత చిఱతలు, మరొకచేత వీణ, కంఠహారాలు, నుదుట తిరునామం, తలపై భిక్షాపాత్రతో సంప్రదాయ పంచెకట్టుతో 'హరిలో రంగ హరీ', 'శ్రీమద్రామాయణ గోవిందో హరి' అంటూ హరి కీర్తనలు పాడుతూ అపర నారదునిలా హరిదాసు గ్రామంలో వీధి వీధికీ తిరుగుతూ గడప గడపన భిక్ష స్వీకరిస్తూ ప్రతీ గ్రామాన్ని వైకుంఠధామంగా మార్చేసేవాడు. దారికిరువైపులా బంతి, చామంతి పూలు స్వాగత కుసుమాంజలి సమర్పిస్తున్నట్లు తలలూపుతుంటే, తెలిమంచుతెరలను చీల్చుకుంటూ వస్తోన్న హరిదాసు రూపం కానవచ్చేది. ఆపై హరిదాసు గొంతు శ్రావ్యసుభగమై, కావ్య తరంగమై గుడి గోపురాన చిరుగంటలు గణ గణధ్వనులతో గోమాత దరిజేరే లేగదూడ మెడలోని చిరుమువ్వల సవ్వడితో సమ్మిళితమై చిరుగాలి అలలపై తేలుతూ వచ్చి నిద్దుర మంచుతెరలను చీల్చుకుంటూ కర్ణ భేరి ప్రహరీ దాటి గుండె గదులలో దూరి మానస తంత్రులను మీటి మేలుకొలుపు పాడేది.

సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందే గ్రీటింగ్‌కార్డుల కోసం యువతీ యువకుల ఆరాటం మొదలయ్యేది. తెలుగు సంస్కృతి ప్రతిబింబం చేలా బాపు గీతలు, రమణ రాతలతో కూడిన అచ్చమైన స్వచ్ఛమైన తెలుగు గ్రీటింగ్ కార్డుల ఎంపిక హడావుడి మొదలయ్యేది. ఒకవైపు నూనూగు మీసాల న్నూ యవ్వనుల ఆటల పోటీలు, మరోవైపు రంగు రంగుల సీతాకోక చిలుకల్లాంటి కన్నెపడతుల గొబ్బెమ్మల ముచ్చట్లు, పంట వసూళ్ళ హడావులో అటు రైతులు, అరిసెలు, పోకుండలు, సున్నుండలు, జంతికలు, చక్కిలాల వంటి సంక్రాంతి పిండి వంటల తయారీలో ఇటు గృహిణులు తలమునకలై ఉండేవారు. ఆపై బాల బాలికలకు భోగిపళ్ళు పోయడం, పెద్ద పండగ -అనగా సంక్రాంతి రోజున పెద్దలను స్మరించుకోవడం, బొమ్మల కొలువుల ఏర్పాటు, విందు భోజనాలు, కొత్త అల్లుళ్ళ అలకలు- పెద్ద పండగ పేరు సార్థమయ్యేంత హడావుడి. పండగ చివరి రెండు రోజులు -కనుమ, ముక్కనుమ రోజులలో పాడి పంటలలో తమకు చేదోడువాదోడుగా వున్న పశు సంతతి పట్ల కృతజ్ఞతగా రైతులు పశువులను, కొట్టాలను, ముఖ్యంగా ఎడ్లబండ్లను అందంగా అలంకరించేవారు. ఈమధ్యలో 'డూడూ బసవన్న', 'అయ్యగారికీ దండం పెట్టు' అంటూ గంగిరెడ్ల వాళ్ళు, 'అంబ పలుకు జగదాంబ పలుకు' అంటూ బుడబుక్కలవాళ్ళు, జంగమదేవరలు, పిట్టలదొరదూర వంటి పగటివేషగాళ్ళు ఊరంతా సందడి చేసేవారు.



సంక్రాంతి ప్రత్యేక వ్యాసాలతో కవితలు, కథనాలు, చిత్రాలతో పత్రికల ప్రత్యేక సంచికలు కళకళలాడిపోయేవి.

ఇక సంక్రాంతి సంబరాలలో చివరగా చెప్పుకుంటున్నప్పటికీ అత్యంత ముఖ్యమైనది కోడిపందేలు. అలనాటి పలనాటి వీర చరిత్రకు తార్కాణంగా బ్రహ్మనాయుడు, నాగమ్మల పౌరుషానికి ప్రతిరూపాలుగా కోడిపందేలు జరుగుతాయి.

సంక్రాంతి నెల రోజుల సందడి అంతా సంక్రాంతి పండుగ చివరి రోజున ఇంటి ముంగిట రథం ముగ్గు వేసి సంక్రాంతి లక్ష్మికి వీడ్కోలు పలకడంతోను, అలాగే "అల వైకుంఠపురంబులో నగరిలో ఆ మూల సౌధంబు దాపల' దాగిన వారిని సైతం తన హరి నామ సంకీర్తనామృతంలో ఓలలాడించిన హరిదాసును దక్షిణ తాంబూలాదులతో సత్కరించి సాగనంపడంతోను పరిసమాప్తమయ్యేది.



అయితే ఈ సంక్రాంతి వైభవమంతా ఈనాటి టెలివిజన్, స్మార్ట్‌ఫోన్‌ల పుణ్యమా అని కనుమరుగైపోతోంది. తెల్లవారు జామున నిద్రలేచి ముగ్గులు వేసేవారు లేక ఇంటివాకిళ్లు వెలవెలపోతున్నాయి. నేడు సంక్రాంతి ముగ్గులు ఇంటి వాకిళ్ళల్లో కాకుండా 'ముగ్గుల పోటీ' ప్రాంగణాల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇంటి ముంగిట భోగిమంటలు నాలుగు రోడ్ల కూడలిలోకి చేరిపోయి కట్టెల పొయ్యిల్లా మారిపోయాయి. హరిదాసు, గంగిరెద్దుల వాళ్ళు, బుడబుక్కల వాళ్ళు వంటి కళాకారులు సరైన ఆదరణ లేక బక్కచిక్కిపోయారు. ట్విట్టర్ శుభాకాంక్షలు, ఫేస్‌బుక్ పోస్టింగులు, వాట్సప్ మెస్సేజ్‌ల ఉరవడిలో గ్రీటింగ్ కార్డుల ప్రాభవం కోల్పోయాయి.

శారీరక శ్రమకు వెరసి ఇంటిలో అరిసెలు, పోకుండలు వంటి సంక్రాంతి పిండివంటల తయారీ కొండెక్కి అంగట్లో కొనితెచ్చుకోవడం లేకుంటే ఆన్‌లైన్‌లో ఆర్డర్ బుక్ చెయ్యడం వ్యవహారమైపోయింది. ఆవుపేడ, భోగి పిడకలు సైతం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారంటే ఈనాటి సంక్రాంతి పండుగ పరిస్థితి ఏమిటో అర్థం చేసికోవచ్చు.

పత్రికలు సైతం ఏవో ఒకటి రెండు కవితలో, వ్యాసాలో ప్రచురించి మమ అనిపించేస్తున్నాయి. టెలివిజన్ ఛానల్స్ వారు ఆదిలో సంక్రాంతి సంబరాలు పతిబింబించే కార్యక్రమాలు ప్రసారం చేసినప్పటికీ, ప్రజలు టెలివిజన్‌కు అడిక్ట్ అయిపోయారని, టిఆర్‌పి రేటింగ్‌లు పెరిగాయని గమనించి రాను రాను కార్యక్రమాల తీరుతెన్నులు మార్చేసి సంక్రాంతి సినిమాల తాజా విశేషాలతోను, సినిమా తారల ఇంటర్వ్యూలతోను కార్యక్రమాలను నింపేస్తున్నారు.

సంక్రాంతి పండుగ సంబరాల ఆనవాళ్ళు, ఆచారాలు ఒకటొకటిగా కనుమరుగవుతున్నప్పటికీ, నాటికి నేటికి నిలిచివున్న ఆచారం మాత్రం ఒకటి ఉంది. అదే కోడిపందేలు. ఈ కోడిపందాలు సంక్రాంతి ప్రాభవాన్ని దశదిశలా వ్యాపింపజేసి సంక్రాంతికి పేరుప్రఖ్యాతులు తెచ్చాయి. ఎంతగా అంటే సంక్రాంతి అంటే కోడిపందేలు, కోడిపందేలు అంటే సంక్రాంతి అన్నంతగా! నిజం చెప్పాలంటే నేడు తెలుగునాట క్రికెట్ పోటీలకంటే కోడిపందేలకే ఎక్కువ ఆదరణ వున్నదనటంలో అతిశయోక్తిలేదు.

సంక్రాంతి యొక్క గత వైభవాన్ని, ప్రాభవాన్ని ఏళ్ళ తరబడి ప్రత్యక్షంగా చూసినవారికి కళావిహీనమైన నేటి సంక్రాంతిని చూస్తుంటే 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు?' అని బరువెక్కిన గుండెలు, బోసిపోయిన లోగిళ్ళు ప్రశ్నిస్తున్నట్లుంటాయి.

ఈమధ్య నోస్టాల్జియా ఒక ఫ్యాషనైపోయిందని కొందరు విమర్శిస్తే విమర్శించవచ్చుగాక, వాస్తవ చిత్రమైతే ఇలాగే ఉంది. "సంప్రదాయం నిలిచే వుంటుంది హమేషా అదే తమాషా" అన్న కవివాక్కుకు అపప్రథ తెచ్చేలా!

- అశ్వని
99892 48635

అంబరమంత సంబరం



సంక్రాంతి పర్వదినం శుద్ధ అష్టమి భద్రాష్టమి నవమినాడు ధ్వజ నవమి నాడు వస్తాయి. ఉత్కళ దేశంలో శుద్ధ దశమిని శాంబరీ దశమిగా పాటిస్తారు. ద్వారాలకు, గడపలకు పూజలు నిర్వహిస్తారు. ఏకాదశినాడు పుత్రదైకాదశి వస్తుంది. శుద్ధ చతుర్దినాడు విరూపాక్షుడయిన శివుణ్ణి పూజిస్తారు. దాన్నే వినూపాక్ష వ్రతం అని అంటారు. పుష్యమీ నక్షత్రం రోజులుండే పూర్ణిమ వచ్చిన మాసాన్నే పుష్యమాసం అంటారు. శ్రావణపూర్ణిమనాడు వేదపఠనం మొదలెడతారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లాలో వడ్డాదిలో తీర్థాలు నిర్వహిస్తారు. తమిళనాడులో ప్రతీ దేవాలయంలో చాలా గొప్పగా ఉత్సవాలు జరుపుతారు. తమిళనాడులో తైపూసమ్ అంటారు.

పుష్యకృష్ణపక్షం

కృష్ణపాడ్యమినాడు విద్యావ్యాప్తి వ్రతం, అష్టమిరోజున కాలాష్టమి, నవమి రోజున అన్వాష్టకాశ్రాద్ధం, ఏకాదశి రోజున షట్‌తిలైకాదశి, ద్వాదశి రోజున సంప్రాప్తి ద్వాదశి, చతుర్దశినాడు యమతర్పణ పూజాదులు నిర్వహించడం సంప్రదాయం. అదే గోదావరి తీరవాసులు దానినే చొల్లంగి అమావాస్య గా పాటిస్తారు. తూర్పుగోదావరి జిల్లా ఏడుపాయలలో ఒక్కటైన తుల్యభాగ సాగరంలో కలవటంవలన ఈ రోజు స్నానం ఇందులో చేస్తే సర్వశుభాలు కలుగుతాయి.

ఉత్తరాయణం రోజు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తరగతుడవుతుండంవల్ల ఈ రోజును మకర సంక్రాంతి అంటారు. ఈరోజున తెలుగు ప్రజలు ఇళ్లన్నీ గొబ్బెమ్మలతో అలంకరించి, ముగ్గులు వేసి ఎంతో సుందరంగా తీర్చిదిద్దుతారు. కొత్త ధాన్యం ఇంటికి రావడంతోనే దేవునికి నైవేద్యాలు సమర్పిస్తారు. ఇక చివరి రోజైన కనుమ రైతులకు సంబంధించినది. దీనినే అధర్వణవేదంలో అనడుత్సవం అంటారు. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత వుండటంవలన ఈ పుష్యమాసమంతా చాలా శుభప్రదమైనది.

సంక్రాంతి అంబరాన్నంటే సంబరాల పండగ. పుడమి పులకించిపోతుంది రంగు రంగుల ఇండ్ల ముంగిళ్ళలో వేసే ముగ్గులతో. క్రొత్త ధాన్యంతో గ్రామీణ ప్రాంతాల్లోని గాదెలన్నీ కూడా కళకళలాడు సందర్భం. భోగి పండగ రోజున భోగిమంటల్లో ఇంట్లో వున్నటువంటి పనికిరాని కట్టె వస్తువులను ఆ భోగిమంటల్లో వేస్తారు. భోగిమంటల కార్యక్రమం అయిపోగానే భోగిపళ్ల స్నానాల కార్యక్రమం వుంటుంది. సంక్రాంతి పండగ రోజున ఇళ్ళ ముంగిళ్ళన్నీ రంగు రంగుల ముగ్గులతో, హరివిల్లులతో, రంగవల్లికలతో ప్రతీ ఇంటి ముంగిలి కళకళలాడుతుంటాయి. అలా వేసిన ముగ్గుల్లో గొబ్బెమ్మలు ఉంచి అందులో గరికపోచలు రేగుపళ్ళు, పూలు ఉంచుతారు. గొబ్బెమ్మకు సంబంధించిన పాటలు కూడా బాగానే వాడుకలో వున్నాయి. గొబ్బెమ్మను గౌరీదేవి ప్రతిరూపంగా చూస్తారు. ఈ సంక్రాంతి పండుగకు హరిదాసులు కాషాయ వస్త్రాలు ధరించి, మెడలో పూలమాలలు, రుద్రాక్ష దండలు వేసుకొని నామలు పెట్టుకొని తలపై అక్షయపాత్ర పెట్టుకొని, ఒక చేత్తో చిడతలు, భుజం మీద తుంబుర పెట్టుకొని, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని పద్యాలు, నృత్యాలు చేసుకుంటూ ఊరంతా కలియతిరుగుతారు. అదేవిధంగా బసవన్నలయితే గంగిరెద్దులను పట్టుకొని వాటిపై రంగు రంగుల వస్త్రాలతో అలంకరించి, కొమ్ములకు వస్త్రాలు కట్టి, గజ్జెలతో అలంకరించి సన్నాయి మేళాలతో విన్యాసాలు చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో కన్పిస్తారు. ఈ పండగకు బొమ్మలకొలువులను కూడా మన ఇండ్లల్లో ఏర్పాటుచేసుకుంటాం. పేరంటాండ్రకు ఆకులు, వక్కలు, పండ్లు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

ఇక అసలు ఘట్టం సంక్రాంతి వచ్చిందంటే చాలు, ప్రతీ ఇంట్లో కట్టెల పొయ్యి వెలిగించి పిండి వంటల కార్యక్రమాన్ని చేపడతారు. ఇలాంటి పండుగలే మానవుల్లో కలివిడితనాన్ని, ఉమ్మడి కుటుంబాల్లోని వ్యక్తులమీద ప్రేమాభిమనాలు తగ్గిపోకుండా చూస్తున్నాయి. ఇక కనుమ రోజున అంటే సంకాంతి పండగ మరుసటి రోజు పశువులకు ప్రధానమైనది. ఇలా సంక్రాంతి పండుగను మూడు రోజులు-భోగి, సంక్రాంతి, కనుమలుగా ఎంతో సంబరాలతో ఆడంబరంగా జరుపుకుంటాము.

-పర్వతాల శ్రీనివాస్

సంక్రాంతి

మకరరాశిలో సూర్యుని ప్రవేశమే
ఉత్తరాయణం మకర సంక్రమణం
ఇంటింటి ముగ్గుల ముంగిళ్ల ముత్యాలు
స్వచ్ఛతా సంస్కృతి క్రాంతి సంక్రాంతి!

ఎడ్ల మెడలో మువ్వల గంటల గలగల
ఇరు సంజల రేగు ధూళి సువర్ణ రజను
పరిపూర్ణతల పల్లెలు పరిఢవిల్లిన


రాజనాల సొబగు ప్రజానీరాజనాల
ధనధాన్య సమన్విత శ్రీలక్ష్మి కళల
తరళతల వన్నెలిచ్చు క్రాంతి సంక్రాంతి!

ఇహభోగాల నిచ్చు సకలం భోగి
హరిదాసు కీర్తనల హరిలోరంగస్మరణ
బుడబుక్కలవాని హరహర ధ్యానం
బసవన్న నృత్య మృదుపద సంగతి గతుల
పశువులకు పలు వన్నె చిన్నె అలంకరణ
పొలాల పొలివేయడం కనుమ ప్రత్యేకం!

ఆనందాల ఆవాహన పెద్దల స్మృతి పెద్ద పండుగ
సౌభాగ్యాల సౌజన్యాలకు మూలాధారం
ధనమే కదా జనులకు నిజ ఇంధనం
పండుగ పరమార్థం పరులకై సాయపడాలి
అందరం
ధాన్యం ధనం దేశాన సరిగ అందరిదరి
ప్రవహించిన అన్నం పరమాన్నంగా
గొంతుగొంతునా నిండుగ పండు పరమార్థం
సంక్రాంతి పండుగ! క్రాంతి సంక్రాంతి!!

- యల్. రాజాగణేష్
92474 83700


రంగవల్లి



19 చుక్కలు 19 వరుసలు



కట్టమూరి సుభాషిణి
(గుంటూరు)



30 చుక్కలు 10 వరుసలు
10 వచ్చే వరకు
సరిచుక్క



జంజనం త్రివేణీ శివ
(మంగళగిరి)

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటె ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి మంగళవారం, 15 జనవరి 2019

సంక్రాంతి లక్ష్మీ దేవికి ఆహ్వానం

సంక్రాంతంటే బంతిపూల తోరణాలు కానేకాదు!
బతుకు పూల తరంగమై బడుగు జీవులు ఎదగాలి!!
సంక్రాంతంటే నువ్వుల చకినాలు, బెల్లం అరిసెలు అసలే కాదు!
నవ్వుల కేరింతల పిల్లలు, తీయని అనుబంధపు స్పర్శలు
వూరు వాడలంతా వెల్లివెరియాలి!!
సంక్రాంతంటే ముగ్గుల అల్లికలు, గొబ్బెమ్మల ఆటలు అంతేనా?
రంగుల రంగువల్లుల లోగిళ్లల్లో
హరిదాసులకు, గంగిరెద్దుల విన్యాసాలకు స్వాగతోరణాలుకదూ!!
రేగుపండ్లు భోగిపండ్లై చిరుపాపల పెదవుల్లో నవ్వులు పుట్టిస్తాయికదూ!
సంక్రాంతి భోగిమంటల చలిసందళ్లు సరదాగా తీరుతాయి!
అల్లుళ్ల గాలి పటాలు ఆకాశానికి ఎగిరిపోతే
బతిమిలాటి బామాలి నేలదింపదగ ఆలోచించి
ఆటలాడే వేళ పండగ సందడి అంతా పల్లెలోనే కాదు ,పట్టణాల్లోనూ కదూ!
హాయిగాఉయ్యాల సయ్యాటలూ, పంట చేల నవధ్యానాల సాక్షిగా
సంక్రాంతి లక్ష్మి ని మనసారా స్వాగతిద్దాం.

-బి. రాజేశ్వరి
9160908045

అనంతం

36 -గోపరాజు నాగేశ్వరరావు

"ఎనిమిదిగొంటే?" అని అడిగాడు గోపీ నాయక్.

కిలాడి వ్యాపారి మొహం వాడిపోయింది!

ఏదో ఒకటి చెప్పాలి. చెప్పకపోతే తన మోసం బైటపడుతుంది.

ఇక యంత్రాలు అమ్ముడుపోకపోగా, ఇప్పటికే కొన్నవాళ్ళు గొడవ చేస్తారు.

ఏం చెప్పాలా? అని.

ఒక్క క్షణం ఆలోచించి-

"ఎనిమిది అదృష్ట సంఖ్య బాబూ... యంత్రాలు కొనండి! ఎనిమిది కొని మెడలో వేసుకుంటే, రాబోయే రోజుల్లో కాబోయే రాజులు మీరే! మీ రాజ్యంమీరేలండి. అదృష్టాన్ని కాలదన్నుకోకండి.

రాండి బాబూ రాండి..

ధనలక్ష్మి యంత్రాలు కొనండి అని మళ్ళీ అరిచాడా కిలాడి వ్యాపారి.

గోపీనాయక్‌కి వొళ్ళుమండింది!

యీతాకుల చాప మీదనుంచి ఎనిమిది సత్తురేకుబిళ్ళలు అందుకున్నాడు. కిలాడి వ్యాపారి మెడలో వేసి-

"ఇంక నువ్వీడ అగుపిచ్చావంటే సంపుతాను! డిల్లీకో, అయిద్రాబాదుకో బోయి రాజువిగా యీ రాజ్జెవ్ మాకొద్దు"అన్నాడు.

అతని అనుచరులు కిలాడి వ్యాపారి చుట్టుముట్టారు.

అతనికి పరిస్థితి అర్థమైంది!

మహామహిమాన్వితమైన సత్తురేకుల ధనలక్ష్మి యంత్రాలను పాత గోతాల్లో మూటకట్టుకొని, అక్కడ్నించి ఉడాయించాడు!

అంతలో-

సాయుధ పోలీసుబలగాలు నల్లకొండ దగ్గిరికి చేరాయి.

కవాతులు మొదలయ్యాయి.

ఉన్నట్టుండి వాతావరణం మారిపోయింది!

అడవి పుత్రుల మొహాలు పాలిపోయాయి. నెత్తురు చుక్కలేదు. భయంభయంగా పోలీసులవైపు చూస్తున్నారు. వొణికిపోతోన్నారు.


అలా ఎందుకు జరుగుతున్నది?

గతంలోకూడా కొండదేవర జాతర్లు చాలా సార్లు జరిగాయి. ఎప్పుడూ అంతమంది సాయుధ పోలీసులు రాలేదు. కవాతులు చెయ్యలేదు. అడవి పుత్రుల్ని భయపెట్టలేదు.

అలాంటిది, ఇప్పుడలా పరిస్థితి వుందంటే ఏం జరుగుతుంది?

జాతరకి తయారై వెళ్ళేందుకు రెడ్డియానాయక్ తండావాళ్ళు బయల్దేరే సమయానికి కబురు అందింది!

పోలీసులు బాగా మోహరించారనీ, అడవి పుత్రుల్ని డేగకళ్ళతో చూస్తూ, తుపాకులు సిద్ధంగా ఉంచుతున్నారనీ...



బాణావతు, కాళీచరణ్, నగ్గూరాం మొహాలు వాడిపోయాయి.

ఆలోచనలో పడ్డారు!

అప్పుడు-

తేనెపట్టు కొట్టబోతే బాణావతునీ, కాళీచరణ్ణీ చావబాది, తండా ఖాళీచేసి వెళ్ళిపోవాలని పోలీసులు హెచ్చరించటం.. కోపంలోవున్న తండావాళ్ళు ఎమ్మెల్లేగారి 'తండాబాట' కార్యక్రమాన్ని విఫలం చెయ్యటం..

అదేనేమో యీ అనర్థాలన్నింటికీ మూల కారణం!

చాంద్‌నీ విషయంలో పంచాయితీకి భయపడిఅయిన వాళ్ళనూ, తండానీ ఒదిలిపెట్టి వెళ్ళి నాగరికులతో చేతులు కలిపిన రాగ్యా హస్తం ఉందేమో!

ఇప్పుడేం చెయ్యాలి?

ఉపద్రవంనుంచి ఎలా బైటపడాలి?

ఏం చెయ్యాలో వాళ్ళకి అర్థంకావటం లేదు.

తరతరాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో విద్యకీ, జ్ఞానానికీ, వైద్యానిక్కూడా నోచుకోకుండా పరమనికృష్టంగా జీవిస్తున్న అడవి పుత్రులు- అమ్మవడిలాంటి అడవితల్లి వొడిలో సేదతీర్తుంటే,

అక్కడా వాళ్ళని బ్రతకనివ్వకపోతే ఎలా? సందేహం లేదు!

బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకోసం అమాయకులైన అడవి పుత్రుల జీవితాలతో చలగాటమాడుతున్నారు. బ్రతుకుల్ని ఛిద్రం చేస్తున్నారు.

అంతవరకూ దీర్ఘాలోచనలో మునిగిపోయిన బాణావతు నెమ్మదిగా గొంతువిప్పి-

"ఆరునూరైనా తండా ఇడ్సిపెట్టి యాడికో బోయే పన్లేదు.

తుపాకులు గాల్సినా యీడ్నే ఉందావ్ు... సత్తే సద్దావుగానీ అడివిని మాత్తరంవ్ ఇడ్సిపెట్టవ్"అన్నాడు, ఉద్వేగంగా.

అందరూ అతన్ని సమర్థించారు.

"రాగ్యాగాడి యవ్వారంవేటి శాద్దావూ కాళీచరణ్ అడిగాడు.

"కొండకాడికి బోదాంవు. రాగ్యా కనిపిత్తే కట్టితెద్దాంవు. ఇశారణ జెయ్యాలికదా" అన్నాడు బాణావతు.

రెడ్డియానాయక్ తండావాళ్ళందరూ బయల్దేరారు.

"ఆడోళ్ళు యనకంవాల రాండి.. ఆడ పరిత్తితి ఎట్టాగుందో! గొడవేటైనా జరిగితే సెడ్డసిక్కొచ్చుద్ది"అన్నాడు బాణావతు.

పిల్లలు, స్త్రీలు, వృద్ధులు తండాలోనే ఆగిపోయారు.

నగ్గూరాం బాణావతు కాళీచరణ్ ముందు నడుస్తున్నారు. వాళ్ళవెంట మిగతా వాళ్ళంతా కదిలిపోతున్నారు.

తండా దండు కదిలింది.

నల్లకొండ వైపుకు సాగిపోతోంది.

అందరి చేతుల్లోనూ సాంప్రదాయక ఆయుధాలున్నాయి.

⁂

ఇంకొంత సమయం గడిచింది.

మేళ తాళాలతో, బాజాలతో, డప్పుల చప్పుళ్ళతో, కేరింతలతో పరిసరాలు హోరెత్తిపోతోన్నాయి.

ఇంకా తండాల్లోనుంచి జనం తరలివస్తూనే ఉన్నారు.

ఆ హడావుడికీ, చప్పుళ్ళకీ బెదిరి, దేవరకి బలిచ్చేందుకు తెచ్చిన మేకలు గొర్రెలూ చింతులు తొక్కుతూ గొంతు చించుకొని అరుస్తున్నాయి.

అప్పుడే డోలీనుంచి క్రిందికి దిగిన ఎవ్వరో వృద్ధుడు, దేవర దగ్గరికి నడిచి వెళ్ళలేక, కోర్కె చంపుకోలేక, అక్కడ్నించే దణ్ణం పెడుతూ-

"దేవరా! ఇదే నాకు సివరాకరి సూపు. అడవి బిడ్డల్ని సల్లంగ సూడు..."అంటున్నాడు.

రాళ్ళని పొయ్యిలుగా పెట్టి దూరంగా కొంత మంది సంకటి వొండుతున్నారు.

(ఇంకా ఉంది)

అనుక్షణికం

-వడ్డెర చండీదాస్

ఆమె లేని అనంత్ పిచ్చివాడై హాస్పిటల్‌లో గొలుసులమధ్య బంధించబడతాడు. వీరి ముగింపు ఎప్పటికీ చెరగని ఒక గాఢ విషాదానుభూతిని మిగులుస్తుంది.

హిమజ్వాలలోని గీతాదేవి మరణంను, అనుక్షణికంలోని స్వప్నరాగలీన మరణంను- మామూలుగా తీసుకోలేడు పాఠకుడు. వాళ్ల జీవితాలు అసంపూర్ణంగా, అసహజంగా ముగుస్తాయి. మానవ జీవితాన్ని సార్థకం చేసి, లక్ష్యాత్మం చేసే అనుభవాతీతమైన విలువలు -అంటే అల్టిమేట్ వాల్యూస్ కల్గిన అతి కొద్దిమంది వాళ్లు గీతాదేవి, స్వప్నరాగలీనలు. అలాంటివాళ్లు అసంపూర్ణంగా, అసహజంగా జీవితాలను చాలిస్తే ఆ విలువలకేమర్థం? ఏం ప్రయోజనం? నవలలోని ఇద్దరి నాయికలనూ అలా ముగిస్తే- ఆ విలువల వ్యక్తిత్వమున్నవారికి అలాంటి ముగింపే ఉంటుందని అన్యాపదేశంగా రచయిత చూపుతున్నాడని పాఠకుడు భావించకుండా ఎలా ఉంటాడు? రచయితను ప్రశ్నించే హక్కు మనకు లేనప్పటికీ, ఔచిత్యం కానప్పటికీ- యిలాంటి పాత్రలకు ఇంతటి అన్యాయాన్ని చేయటానికి మనసు ఎలా వొప్పుకుందా అని సందేహపడతాము. ట్రాజిక్ ఎఫెక్ట్ కోసం పొయిటిక్ జస్టిస్‌ను వదులుకున్నారా అని అనిపిస్తుంది.

మానవుని జీవితంలో కొన్ని సంఘటనలు, మానవుని అభిమతానికి, యిచ్ఛకు, ప్రయత్నానికి సంబంధం లేకుండా మానవాతీత శక్తులచేత ముందుగానే నిర్దిష్టాలవుతాయనేది విధి వాదానికి అంటే ఫాటలిజమ్‌కు ఉదాహరణగా స్వప్నరాగలీల, అనంతారెడ్డి, అలానే గీతాదేవిల జీవితాలు చూస్తాము.

గాయత్రీ, మోహనరెడ్డిల పాత్రలు కూడా పాఠకులను ఆకట్టుకుంటాయి. వాళ్ళిద్దరూ విప్లవ కమ్యూనిస్టు పార్టీలో ఏక్టివ్ మెంబర్స్. సిన్సియర్‌గా పార్టీలో పనిచేసే వీళ్లలాంటి వాళ్లతోపాటు, ఆ పార్టీలోనే అవకాశవాదులైన సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్ లాంటి వాళ్లను కూడా చూస్తాము. తల్లిదండ్రులను ఎదిరించి, బయటకు వచ్చి మోహన్‌రెడ్డితో కలిసి జీవిస్తుంది. పెళ్లి చేసుకుందామని మోహన్ అంటే వొప్పుకోదు. పెళ్లి అనేది యిరువురు వ్యక్తుల ఆంతరంగిక సొంత విషయం. నా మెళ్లో వో తాడు కట్టి, ఆ చట్టంతో నిన్నూ, నన్నూ మన పిల్లల్ని బంధించటం నీచం- 'యిఫ్ నాట్ అన్‌మార్రియస్, డోన్ట్ బికం యె సెంటిమెంటల్ ఫూల్' అని అంటుంది.

కాని తనకు పుట్టిన తన అపూర్వపు 'చిట్టి అరుణ' కొద్ది నెలలకే చనిపోతే- ఆ సెంటిమెంటల్ ఎటాచ్‌మెంట్ నుంచి ఎప్పటికీ తప్పుకోలేకపోతుంది. ఆ క్షణాన కన్న తల్లిదండ్రులకు కూడా తనకు తన కూతురు మీద ప్రేమ వున్నట్లే వాళ్లకూ తన మీద వుంటుందని గ్రహించి- అప్పుడు

వినమరుగైన..

రామిశెట్టి చంద్రశేఖర అజాద్

మొదటిసారిగా తనంతట తాను, తాను వొదిలివచ్చిన తన పుట్టింటికి వెళుతుంది. ఆ తరువాత ఎమర్జెన్సీలో అన్యాయంగా జైల్లోకి నెట్టబడి, ఆనక తప్పించుకొని అడవుల్లోకి వెళ్లిపోతుంది. 'ఈ సమస్త వ్యవస్థనీ మసిలా తగలబెట్టే కార్చిచ్చులా'. ఆ తరువాత చాలా రోజులకు ఆమె నుంచి ఉత్తరాన్ని అందుకొని తనూ అడవుల్లోకి వెళతాడు మోహన్ రెడ్డి. చనిపోయిన అరుణ విషయంలో గాయత్రి ఆవేదన, గాయత్రి విషయంలో మోహన్‌రెడ్డి అనుబంధాలు- సహజాతబంధాలు భౌతిక విలువలకంటే గట్టివని అన్యాపదేశంగా తెలియజేస్తాయి.

రాజకీయ వ్యసనం ఎంతటి భయంకరమైనదో రవి పాత్ర ద్వారా తెలుస్తుంది. డిగ్రీ ఫైనలియర్‌లో వున్న రవి తనని సంప్రదించకుండా, తన పెళ్లిని తన మేన మరదలుతో నిశ్చయించినందుకు అలుగుతాడు. కోపం తెచ్చుకుని ఇపుడు ఏమి చేయాలా అని దీర్ఘంగా ఆలోచిస్తుంటాడు

- సశేషం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ **1846**

■	1		2			■
3	■	■		■	■	4
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
■	14					■

అడ్డం	ఆధారాలు / నిలువు
1. సంక్రాంతి రోజుల్లో పల్లెల్లో నిషేధించినా ఆగక జరిగేవి	2. పర్వము
	3. భూమి.
5. సూర్యుడు	4 మజ్జిగ
7. అబద్ధం	6.తడవ
8. ఆడు తాబేలు	7. పశువుల పండుగ కాకి అయినా కదలని రోజట
9. శరీరము	
10. బ్రహ్మ	10. వడ్లు మొదలగునవి
12. బుద్ధి , 14. పతంగులు	11. అనంతరము , 13. వాన, నక్షత్రాలు తోడిది

మాటాట-1845 సమాధానాలు

అడ్డం		నిలువు	
2. సంకురాత్రి	10. శంక	1. దాసరి	9.భోగిమంట
5. సరదా	11. జోగి	3. కుప్ప	10. శంఖము
7. తృప్తి	13. ముగ్గులు	4. త్రిదండి	12. ఎద్దుకు
8. కోడి	14. టముకు	6. దాతృత్వం	*

నవ్యతకు నాంది సంక్రాంతి

జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు మకరరాశిలోనికి పరివర్తనం చెందే రోజు సంక్రాంతి. ఈ రోజు నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. ఈ సంక్రాంతి పండుగ తెలుగువారికి మూడు రోజుల పండుగ పెద్దపండుగ. ముందు రోజు భోగిపండుగ. ఈ రోజున గోదాదేవి మార్గళి వ్రతాన్ని ఆచరించి శ్రీరంగనాథుని చేపట్టిన రోజు అని గోదారంగనాథుల వివాహాన్ని చేస్తారు. అన్నీ వైష్ణవాలయాలు, శివాలయాలు విశేషపూజల జరిపించుకునే జనాలతో కిటకిటలాడుతుంటాయి.

మరుసటిరోజు అంటే ఉత్తరాయణం ఆరంభమయ్యే రోజు సంక్రాంతి కొత్తవెలుగులు చిందే రోజు. ఆ రోజునే సూర్యుడు ధనురాశి నుంచి మకర రాశిలో ప్రవేశించటమే మకర సంక్రమణం లేక 'సంక్రాంతి'. మకర సంక్రాంతి నాడు సూర్యుడు ఉత్తరాభిముఖుడై, భూమిపైన ఉత్తరార్ధ గోళంలో ప్రవేశిస్తాడు. పితృదేవతలను పూజిస్తారు. పితృదేవుళ్లకు తర్పణాలు వదులుతారు. వూరందరికీ పండుగ. వారు వీరు అనే తేడాల్లేకుండా జరుపుకునే సంక్రాంతి రోజున విశేషగౌరవాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు.

వ్యవసాయదారుల చేతికి పంట వచ్చేకాలం ఇది. కనుక రైతన్నలందరూ కొత్తపంటలను ఇంటికి తెచ్చుకుని ఆనందంతో ఉంటారు. తమకు పంట పండించడానికి సాయంచేసినవారు, తన జీవనం సాఫీగా నడవడానికి సాయం చేసిన కర్మచారులను అందరినీ పిలిచి తాను పండించిన పంటలో కొద్దిభాగాన్ని వారికి కూడా ఇచ్చి వారినీ కూడా ఆనందింపచేస్తాడు.





జానపద కళాకారులైన బుడుబుక్కలవాళ్ల పాటలు, దాసరుల వైష్ణవ సంకీర్తనలు, జంగందేవర శైవనామాలు, గంగిరెద్దుల వాళ్ల ఆట పాటలు, సన్నాయి మేళాలు వాయించేవారిని - ఇలాంటి వారినందరిని పిలిచి వారు పంచే జానపద సంపదను అందు కుంటూ తాను పండించిన పంటలో వారికి కొంత భాగాన్ని పంచుతూ వారిని గౌరవిస్తారు.

స్త్రీలు సావిత్రి గౌరీవ్రతం చేస్తారు. సంక్రాంతినాడు నువ్వులు బియ్యం కలిపి శివుణ్ణి అభిషేకిస్తారు. సంక్రాంతి రోజున శివునికి నువ్వుల నూనెతో దీపం పెడితే శని దోషాలు తొలగిపోతాయని పురాణవచనం. స్త్రీలందరూ పండు తాంబూలాలను, పసుపుకుంకుమలను పంచుకుని ఆనందిస్తున్నారు.

మూడవరోజు అసలు కారకాలైన ఎడ్లను గోవులను పూజించుకునే రోజు. పశుజాతి చేసిన సాయాన్ని గుర్తించుకుని వాటిని గౌరవించేరోజు కనుమ పండుగ.. కొత్తపంటతో వండిన పొంగళ్లను పెట్టి కొమ్ములకు రంగులు పూసి ఉత్సవాలు చేసే పండుగే కనుమ. వ్యవసాయవృద్ధిలో తమకు చేదోడుగా వున్న పశుగణాన్ని పూజించే రోజు. పశువులను కడిగి అలంకరించి వాటిని పూజించి సాయంత్రంవేళ ఎడ్లబండ్లకు కట్టి ఊరు ఊరంతా తిప్పుతారు. దీన్ని బండ్లు తిప్పటం చేసే పండుగ ఇది. జాజు, సున్నం పట్టీల అలంకరణతో ఈ బండ్లు ఎంతో కన్నుల పండువుగా ఊరేగింపులో ఉంటాయి.

సంక్రాంతి మూడుదినాలలో బొమ్మల కొలువులను తీర్చుస్తారు. కొత్త అల్లుళ్ళను, కూతుర్లను ఇంటికి పిలిచి ఆనందంగా పిండి వంటలతో భోజనాలను ఆరగిస్తారు.ఈ పండుగకు నెలముందు నుంచి వాకిళ్లల్లో రంగవల్లులు తీర్చడం తెలుగునాట ప్రత్యేకత. కోడిపందేలు, గాలిపటాలు, హరిదాసులు, పితృతర్పణాలు, గంగిరెద్దులు, భోగి పళ్ళు, బొమ్మల కొలువులు, పశువుల పూజలు, నోములు మొదలైనవెన్నో ఈ సంక్రాంతిలో చోటుచేసుకుం టాయి. శ్రీమద్భగవద్గీత పఠనం, గంగాస్నానం, త్రికాల గాయత్రి సంధ్యావందనం, గోవిందనామ స్మరణం ఇలాంటి వాటితో పాటుగా కూష్మాండం, కంబళి, ధాన్యాదులు, లోహాలు, వస్త్రాలు, తైలదీపదానాలు చేస్తే మంచిదని శాస్త్ర వచనం. కొత్తధాన్యంతో అరిసెలు, పొంగలి, పులగం మొదలన పిండివంటలు వండి బంధుమిత్ర జనంతో కలసి భోజనం చేసి ఆనందించే పండుగే సంక్రాంతి.

- జంగం శ్రీనివాసులు

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మానసికాందోళనలతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయప్రయాసలుంటాయి. మానసికాందోళనతోనే కాలం గడుపవలసి వస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించాలి.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. వ్యవహారంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం వుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి. గృహంలో మార్పును కోరుకుంటారు. ఇతరుల విమర్శలకు లోనవుతారు. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేరు. ఆకస్మిక ధనవ్యయం అయ్యే అవకాశం.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోసపోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
బంధు, మిత్రులతో మనస్పర్థలు రాకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనుకోకుండా డబ్బు చేజారే అవకాశాలున్నాయి. ఆరోగ్య విషయంలో మిక్కిలి శ్రద్ధ అవసరం. శారీరక శ్రమతోపాటు మానసికాందోళన తప్పదు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ధైర్యసాహసాలతో కొన్ని పనులు పూర్తిచేస్తారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తుల సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది.

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి మంగళవారం, 15 జనవరి 2019

ఐక్యతా భావానికి చిహ్నం



అన్ని పండుగలలో 'సంక్రాంతి' అతి ముఖ్యమైనది. దీనిని 'పెద్ద పండుగ', 'పెద్దల పండుగ' అని అంటారు. పెద్దలను స్మరించుకొని, వారికి తర్పణములు, పిండ ప్రదానములు జరిపే రోజు సంక్రాంతి. సం, క్రాంతి- అను రెండు సంస్కృత పదముల కలయికతో ఏర్పడేది సంక్రాంతి. 'సం' అంటే మంచి, 'క్రాంతి' అంటే పరివర్తనము. మనిషిలో మంచి పరివర్తనము కలిగించడమే 'సంక్రాంతి' పరమార్థము.

జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు మకర రాశిలోనికి పరివర్తనం చెందే రోజు సంక్రాంతి. మకర సంక్రమణం అని కూడా అంటారు. ఉత్తరాయణ పుణ్యకాలంతో ప్రారంభమయ్యే సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యత కలదు. సంక్రాంతి రావడానికి ముందు - నెల రోజులు ''నెలగంటు''తో ప్రారంభమవుతాయి. అప్పటి నుండి పండుగ పనులు ప్రారంభమవుతాయి. ప్రతి యింటి ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దుతారు. ముగ్గులు పెట్టడంలో ఎంతో శాస్త్రీయత దాగి ఉంది. ఖగోళంలో ఆ రోజు నక్షత్రాలు, గ్రహాలు ఏవిధంగా ఉంటాయో, ఆ విధంగా గీయడం ముగ్గులోని అంతరార్థం. పిండితో పెట్టే చుక్కలు, ఆకాశంలో కనిపించే చుక్కలకు ప్రతీకలు. ఖగోళ శాస్త్ర రహస్యాన్ని ఎనిమిదేళ్ళ ఆడపిల్లకి మొదలు అర్థమయ్యేలా తెలిసేలా మన ప్రాచీనులు రంగవల్లి విధానంలో యిమిడ్చారు. అంతేకాదు స్త్రీల్లో చిన్నప్పటి నుంచే సహనం, ఓర్పు అలవడేలా చేయడానికి ఈ ముగ్గులు సహకరిస్తాయి అని అంటారు. ఆ రంగవల్లుల మధ్యలో ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పెడతారు. గొబ్బెమ్మలను గౌరీదేవీగా సంభావిస్తారు. గుమ్మడి, తంగేడులతో అలంకరిస్తారు. పసుపుకుంకుమలు పెట్టి తమఇల్లు పాడిపంటలతో అలరారేలా చేయమని గౌరీదేవిని వేడుకుంటారు. ధనుసంక్రమణతో ధనుర్మాసం మొదలవుతుంది.

ప్రతి దేవాలయంలోను తిరుప్పావై పాశురాలను అను సంధానిస్తూ గోదాదేవిని శ్రీమన్నారాయణుని పూజిస్తారు. శ్రీరంగనాథుని పూజిస్తారు. అలనాడు గోదాదేవిని చేపట్టిన శ్రీరంగనాథుని స్మరిస్తూ గోదాకల్యాణాలను భోగి పండుగ రోజున చేస్తారు. మరుసటి రోజే సంక్రాంతి కనుక కొత్తకాంతులు తమ ఇండ్లలో వెల్లివిరియాలని దేవుని మొక్కుకుంటారు.

ఈకాలంలోనే రైతన్నలకు పంటలు చేతికి వస్తాయి. ఆ ఆనందంలో తనకు తోడ్పడిన ఇతరులందరినీ పిలిచి కొత్తబట్టలు పెట్టి వారికి పండిన పంటలో కొంతభాగాన్నిచ్చి గౌరవిస్తారు. జానపదులు ప్రదర్శించే జానపదుల కళలను ఆవిష్కరించే కళాకారులనుకూడా సంక్రాంతిరోజే గౌరవిస్తారు. చక్కని బొమ్మల కొలువువను కూడా తీరుస్తారు. సాయం సంధ్య వేళలలో ముత్తదు వులను చిన్న పిల్లలను పిలిచి వారికి పండు తాంబూలాలు, పిండివంటలను, నువ్వులుం డలను దానం ఇస్తారు. ఇలా బొమ్మల కొలువు పేర్చడంలో ఓ పరమార్థం దాగి ఉంది. మనమందరం భగవంతుని చేత చేయబడిన బొమ్మలలాంటివారం. భగవంతుని భారం అంతా భగవంతునిపై వేసి, నిరహంకారంగా, జీవితం గడపాలనేది దీని అంతరార్థం. తాంబూలాలు ఇవ్వడం, పిండివంటలను నలుగురూ కలసి పంచుకోవడం వెనుక దానగుణం చిన్ననాటి నుంచి పెంచుకోవాలన్న సందేశం ఇస్తుంది. చెప్పులు, గొడుగు, వస్త్రాలు నువ్వులు, పెరుగు, గుమ్మడికాయ ఇలాంటివన్నీ దానం చేస్తారు. ఇవి అన్నీ రాబోయే వేసవికాలంలో జాగ్రత్తపడడానికి ముందుచూపును కలుగచేస్తాయి. మూడవనాడు కనుమ. 'కనుమ' అంటే 'పశువు' అని అర్థం. ఏ యెద్దు మన పొలాన్ని దున్ని పంటని యింటికి తేవడంలో సహకరించిందో, ఏ ఆవు మనకు పాడిని యిస్తూ, మన పిల్లల యొక్క, మన యొక్క ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉంటుందో, అట్టి పశువులను కడిగి, కొమ్ములకు పసుపు కుంకుమలు పెట్టి చక్కగా అపూపములను పెట్టి, నీరు త్రాగించి, ఒళ్ళు నిమిరి, వాటిని ఆనందింపజేసి, వాటియెడ తమ కృతజ్ఞతను ప్రకటించే రోజు ఇది. ఈరోజున పొంగళ్ళు వండి పశువులచేత తినిపించి పంటపొల్లాల్లోను, ఇంటిపైన చల్లుకుంటారు. వరి, జొన్నకంకులను ఇంటి చూరుకు (పైభాగంలో) కట్టి పిచ్చుకలు, పావురాళ్లలాంటి పక్షిజాతులకు కూడా విందులు చేస్తారు. ఇలా ఈ సంక్రాంతి సమైక్యంగా, సృష్టిలోని చరాచరజీవజాలమంతా పరస్పరా సహకారం తో జీవించాలనే సందేశాన్నిస్తుంది. ఐక్యత, సోదరభావం, కృతజ్ఞతలను కలిగి ఉండాలనే ఈ సంక్రాంతి అందరి మనస్సుల్లో నవ్యకాంతులను వెదజల్లాలని కోరుతూ సంక్రాంతి శుభాభినందనలు

-చోడిశెట్టి శ్రీనివాసరావు

కైకయోపాఖ్యానం



100 మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

ధర్మరాజుకు ఒకసారి ఒక సందేహం కలిగింది. ''రాజు ఎవరి ధనానికి స్వామి అవుతాడు. అతని ప్రవర్తన ఏవిధంగా ఉంటే ఆదర్శమైన రాజు అని ప్రజలు అంటారు. ఈ సందేహాలకు సమాధానం చెప్పుమని అతను పితామహుడైన భీష్ముని ప్రార్థించాడు. అప్పుడు భీష్ముడు అతనికి ధర్మ సందేహాలన్నీ తీర్చి, ఉదాహరణగా ఒక రాజు గురించి ఇలా చెప్పాడు

- ''బ్రాహ్మణులు కాని వారి ధనానికి మాత్రమే రాజు స్వామి అవుతాడు. కర్మ భ్రష్టులైన బ్రాహ్మణులను కూడా రాజు ఉపేక్షించరాదు. ఎవరి రాజ్యంలో ద్విజుడు దొంగ అవుతాడో, ఆ అపరాధం రాజుదే కాని ఇంకొకరిది కాదు. ఆపాపం కూడా రాజుదే అవుతుంది. బ్రాహ్మణులను రక్షించవలసిన బాధ్యత కూడా రాజుదే. ఆ కారణంగా రాజు నకుడి లాంటి రాజర్షులు తప్పక విప్ర రక్షణ కర్తవ్యంగా భావించే వారు. దీని గురించి ఒక కథ ఉంది. పూర్వ కాలంలో కైకయదేశాన్ని పాలించిన రాజు వ్రతశీలి. అతను వేదాధ్యయన చేస్తున్న అతనిని ఒక క్రూర రాక్షసుడు పట్టుకున్నాడు. అప్పుడు ఆ రాక్షసునితో ఇలా అడిగాడు -''నాగ్రామాల్లో దొంగ, లోభి, మద్యం సేవించే వాడు, యజ్ఞం చేయనివాడు కాని లేరు. మరి నువ్వు ఎందుకు నన్ను పట్టుకొన్నావు. అలాగే విద్వాంసుడు కాని బ్రాహ్మణుడు వ్రతనిష్ఠ లేని వాడు, ఆహితాగ్ని కానివాడు, యజ్ఞం చెయ్యని వాడు నా రాజ్యంలో లేరు మరి నువ్వెందుకు నువ్వు నాలో ప్రవేశించావు?

ఇంకా నా రాజ్యంలో బ్రాహ్మణులు భూరి దక్షిణలతో యజ్ఞాలు చేస్తున్నారు. బ్రాహ్మణులు షట్కర్మలలో నిలిచి ఉన్నా వారు వేదం చదువుతారు, చదివిస్తారు. యజ్ఞం చేస్తారు. చేయిస్తారు. దానం చేస్తారు, దానం తీసుకొంటారు. వారు ఇతరులను పూజిస్తారు, పూజింప బడతారు. వారికి వివేకం, జ్ఞానం ఉన్నాయి. వారు సత్యమే పలుకుతారు. ఇలాంటి బ్రాహ్మణులు కల రాజ్యం నాది. మరి నా రాజ్యంలో ఎందుకు ప్రవేశించావు?

ఇంకా నా రాజ్యంలో క్షత్రియులు యాచించరు. సత్యాన్ని ధర్మాన్ని అనుసరిస్తారు. వారు వేదాలు చదువుకుంటారు కాని చదివింపరు. క్షత్రియ ధర్మ నిరతులు వారు యజ్ఞాలు చేస్తారు కాని చేయించరు. వారు బ్రాహ్మణులను కాపాడుతారు కాని భీరువుల్లాగ యుద్ధ భూమినుండి పారిపోరు. మరి నీవు నాలో ఎందుకు ప్రవేశించావు?

ఇంకా నా రాజ్యంలో తక్కినవారి గురించి వివరిస్తాను ఆలకించు. నారాజ్యంలోని వైశ్యులు వ్యవసాయం, పశుపాలనం, వాణిజ్యం- వీటితో కపట రహితంగా జీవిస్తారు. వారు అధిక ప్రసంగం చేయరు. క్రియాశీలురు సత్యమే మాట్లాడుతారు. వారి ఇంద్రియ నిగ్రహం శుచిత్వం, వివేకం, స్నేహం ఎన్నడూ వదలరు. తమ విధులను కూడా వదలరు అయినా నీవు నాలో ఎందుకు ప్రవేశించావు?

అదే విధంగా నా దేశంలోని శూద్రులు ఏ అసూయ లేకుండా, తమ తమ కర్మలను చేయుటలో శ్రద్ధవహిస్తారు. వారు తక్కిన మూడు వర్ణాలవారిని ఆశ్రయించి ఉంటారు. ఈ విధంగా నా రాజ్యంలో నాలుగు



వర్ణాలప్రజలు తమ ధర్మాలను నిర్వహిస్తూ ఉన్నారు అయినా నీవు నన్ను ఆవేశించావు.

నేను వ్యక్తిగతంగా రాజ్యంలోని దీనులు, అనాథలు వృద్ధులు, బలహీనులు, రోగులు, స్త్రలు- వీరందరి పట్ల వివేకంతో ప్రవర్తిస్తాను. దేశ ధర్మాలు, కుల ధర్మాలు విచ్ఛిన్నం అవకుండా కాపాడుతున్నాను. అయినా నీవు నాలో ఎందుకు ప్రవేశించావు?

నా రాజ్యంలో తాపసులు పూజించబడి రక్షిప బడుతారు. వారు నా చేత సత్కరింపబడతారు. నేను ఇతరులకు పెట్టకుండా ఏదీ భుజించను పరస్త్రీలను తలవను. నారాజ్యంలో బ్రహ్మచారి కానివాడుఎవడూ భిక్షాటన చేయడు. సన్యాసి బ్రహ్మచర్యం పాటిస్తాడు. ఋత్విక్కు కాని వాడు హుతం చెయ్యడు.

అయినా నీవు నాలో ప్రవేశించావు. నేను ఎన్నడూ విద్వాంసులను, తాపసులను వృద్ధులను అవమానించలేదు. నేను ధర్మాన్ని ఆచరిస్తాను. గృహస్థును. అదే విధంగా నా యొక్క పురోహితుడు గొప్ప తపస్సంపన్నుడు. సర్వధర్మాలు తెలిసిన వాడు. నేను దానంతో విద్యను వాంఛిస్తాను. సత్యంతో ధనాన్ని కోరుతాను. సేవించి గురువులను పొందుతాను. మరి ఇలాంటి గుణాలు ఉన్న నన్నెందుకు ఆవహించావు? నాకు నీ వంటి రాక్షసులంటే భయం లేదు.

నా రాజ్యంలో విధవలు లేరు, జూదరి అయిన విప్రుడు లేడు. దొంగ లేడు. అధికారం లేకుండా యజ్ఞం చేయించేవాడు లేడు. ధర్మ కోసం నిరంతరం పోరాడే నాశరీరంలో గాయపడని భాగం లేదు. అలాంటి ధర్మ దత్తమైన నాదేహంలో నువ్వు ప్రవేశించావు. గో, బ్రాహ్మణ, యజ్ఞాలవల్ల నాప్రజలు నిరంతరం నా శుభాన్ని కోరుతారు. మరి నువ్వెలా ప్రవేశించావు'' రాజు అప్పటి వరకూ విశదీకరించి తన రాజ్యం గురించి, పాలన గురించి, ప్రజలు ధర్మబుద్ధి గురించి, సకల వివరాలు మౌనంగా అతని లోపలకి ప్రవేశించి అన్ని వింటున్న రాక్షసుడు అప్పుడు రాజుతో ఇలా అన్నాడు.


'స్త్రీల వ్యభిచారం వలన రాజులు చేసే అక్రమాల వల్ల విప్రుల కర్మ దోషం వల్ల ప్రజలకు భయం కలుగుతుంది. అటువంటి రాజుల రాజ్యంలో వర్షాలు పడవు, ప్రాణం తీసే రోగాలతో ప్రజలు బాధపడతారు. వారు ఎప్పుడూ యుద్ధ భయంతో ఆకలి భయంతో జీవిస్తూ ఉంటారు.

విప్రులు సంయమనంతో ఎక్కడ ఉంటే అక్కడ యక్ష రాక్షస పిశాచాల వల్ల, అసురుల వల్ల ఏ భయమూ ఉండదు. నీవు సర్వావస్థలలోను ధర్మాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలను పాలించావు. కనుక ఓ మహారాజా నీవు ఇంటికి వెళ్ళు.

నీకు శుభమగుగాక. గో, బ్రాహ్మణులను ప్రజలను రక్షించే రాజుకు రాక్షసుల వల్ల అగ్నివల్ల భయం ఎక్కడిది? ఏ రాజు ముందు శుభాశీసులు చేస్తూ పలుకుతూ వేద బ్రాహ్మణులు నడుస్తారో, ఎవరికి బ్రాహ్మణుడు ఒక ముఖ్యమైన బలమో ఎవరి ప్రజలు అతిథులను ఆదరించటంలో ప్రియంకలిగి ఉంటారో, ఆరాజులు స్వర్గాన్ని జయిస్తారు. ఈ మాటలు కైకయ రాజుతో చెప్పి రాక్షసుడు రాజు దేహాన్ని విడిచి పెట్టి వెళ్ళి పోయాడు.

-ఇంకావుంది

సుందరకాండ



లేళ్ళ మాంసం అడవి పందుల మాంసాలు అక్కడుంచబడ్డాయి. నెమళ్ళు కోళ్ళు వీటి మాంసాలు ఆ వెండి గిన్నెల్లో సగం సగం తినగా మిగిలినవి. అలాగే అడవి పంది మాంసాన్ని, వార్ధ్రాణసక మాంసాన్ని రుచికమనే లవణంలో కలిపి పెరుగుతో వండుతారట. అదిగో ఆ వంటలు- అలాగే మృగమయూరాల్ని తినేసేరు. ఎంతవరకు శల్యావశిష్టంగా. అవిగో-వాటి స్వరూపాల్ని - ఇలా స్వామి చూస్తూ నడుస్తున్నాడు.

లేహ్యానుచ్చావచాన్ పేయాన్ భోజ్యాని వివిధానిచ
తథా మ్ల లవణోత్తం సై ర్వివిధై రాగ షాడబైః

అనేక రకాల లేహ్యములు భక్ష్యములు పానీయాలు భోజ్యాలు.

ఆమ్ల లవణ సంయుక్తాలయిన రాగ షాడబాలు.

తెల్లకల్లు, ద్రాక్ష, దాడిమ మొదలైన రసాలతో తెల్ల ఆవాల వంటి ఇతర సామగ్రులతో కలిపి చేసిన రసాయనం.

ఇది చిక్కగా ఉంటే షాడబం (క్రీమ్) పల్చగా ఉంటే రాగం. (జూస్) త్రాగుడుచే ఒడలు తెలియక వెదజల్లిన పండ్లు. పూలు, వాటి సౌరభాలు ఈ పాన భూమిలో దీపాలు లేవు. మరెలా కనిపిస్తుంది. తినే వాళ్ళెలా- తిన్నారు. స్వామెలా చూస్తున్నాడు.

తత్ర తత్ర చ విన్య స్తై స్సుశ్లిష్టైశ్శయనాసనైః
పాన భూవిర్వినా వహ్నిం ప్రదీప్తే నోపలక్ష్యతే.

ఆ ఆసనాల ప్రకాశ ఉంది. ఎవరి ఆసనం వారికెదురుగా ఉన్న భక్ష్యవేదికను చూపిస్తుంది. అంతే. అంత మాత్రంచేతనే దీపం లేకుండానే దీపిస్తున్నాయి. ఇక కేవల పానవేది కల రంగం. అందులో ఉంచబడిన సుర, కృతుసర మాధ్వీకం శర్కరాసవం పుష్పాసవం ఫలాసవం వంటి రకరకాల ఆసవాలు. వాటితో నిండిన వెండి-బంగారు- స్ఫటిక పాత్రలు. ఆ పాత్రలలో

క్వచిదర్ధావ శేషాణి క్వచిత్పీతాని సర్వశః
క్వచిన్నైవ ప్రపీతాని పాపాని సదదర్శహ.
క్వచిద్భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్సానాని భాగశః
క్వచిదన్నావ శేషాణి పశ్యన్వై విచాచార హ.

కొన్నిచోట్ల సగం త్రాగిన పాత్రలు. కొన్నిచోట్ల ఖాళీగాఉన్న పాత్రలు కొన్నిచోట్ల నిండుగా ఉండిపోయిన పాత్రలు. అలాగే భక్ష్యాలు. ఇలా స్వామి చూసికొంటు వెడుతున్నాడు. ఇక్కడ మహర్షి 'హ' అన్నారు.

ఇదొక చిత్రం.

వీటినెందుకు చూడాలి. తాను చూడవలసినది సీతను కదా!

ఆ సీతకోసం స్త్రీముఖాల్ని చూస్తూవస్తూన్న స్వామి ఆడది లేనిచోట ముందుకు వెళ్ళాలిగాని ఈ పరీక్ష ఎందుకు?

రావణ పాన భూమి- కేవలం అన్న మయ కోశం. కేవల అన్నమయ కోశాన్ని నమ్ముకొన్న వాడు తామసుడు. అది సాత్వికుణ్ణి కూడా మోహింపచేస్తుంది. సామాన్యుడు రోజూ సారాదుకాణాన్ని చూసి ఏదో ఒకరోజున దానికి లొంగిపోయినట్లు. దీన్ని దాటాలి. స్వామి బుద్ధిమంతుడు. వీటన్నింటిని తిరస్కరించినవాడు అందుకనే ఆ భూమిలో ఆగిపోలేదు. చూస్తూ వెడుతున్నాడట.

ఈ చూడటం మనవంటి సామాన్యుల మనోవికారాల్ని చెప్పటంకోసం ఆ వెళ్ళటం జితేంద్రియుల లక్షణాన్ని తెలియజేయటంకోసం. సరే అలా తిని తాగి ఒళ్ళు తెలియక

కాచిచ్ఛ వస్త్ర మన్యస్యా స్వపంత్యాః పరిధాయచ
ఆహృత్యచా బలా స్సుప్తా నిద్రాబల పరాజితాః

అంటారు మహర్షి. చెప్పటంలో సంప్రదాయాన్ని సంస్కృతిని ఎలా తెలియజేస్తారో చూడండి.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



అహంకారం చాలా చెడ్డది. అది నిర్మూలము కానిదే ముక్తి లేదు. ఆ లేగదూడను జూడుడు, అహంకారముచే దానికెన్ని యిక్కట్లు వాటిల్లుచున్నవో కనుడు. అది పుట్టిన తోడనే ''హంహై'' నేనున్నాను'' అనియరచును. ఫలితమేమి? అది పెద్దదై (ఎద్దై)న యెడల దానిని నాగలికి గట్టుదురు. లేదా బరువులతో నిండిన బండ్లకు గట్టుదురు. అవైన యెడల గుంజకు కట్టివేయుదురు. ఒక్కొక్కప్పుడు చంపియు తిందురు.

కాని ఎన్నిదండనల పాలైనను ఆ పశువు అహంకారమును విడువదు. దాని చర్మముతో డోలు చేసినను గూడా 'హంహం' నేను, నేను అనియే శబ్దించును. దూదేకులవాడు దాని ప్రేవులను దన వింటినారిగా జేసికొనినప్పుడు గాని అది వినయము నవలంభింపదు. అపుడు 'తుహై'- 'నీవున్నావు' అని గానము చేయును. 'నేను, నేను' అను భావము పోయి (పరమేశ్వరా! అంతయు) 'నీవే' అను భావము కలుగవలయును. జ్ఞానోదయమైననే కాని ఈ స్థితి ప్రాప్తము కాజాలదు.

107. అహంకారము తొలగి పరతత్త్వమున లయించినప్పుడు ముక్తి లభించును.

108.ప్రశ్న: మానవునకెప్పుడు ముక్తి లభించును?

ఉ. అహంకారము నశించినప్పుడే.

109. ప్రశ్న: నేనెప్పుడు ముక్తుడనగుదును?

ఉ. ఆ 'నేను' అనుభావము నీ నుండి తొలగినప్పుడు, 'నేను, నాది' అనుకొనుటయే అజ్ఞానము. 'నీవు, నీది' అనుకొనుటయే జ్ఞానము. నిజమైన భక్తుడిట్లు భావించును: ''దేవా! నీవే కర్తవు. సకలము నీవే చేయుచున్నావు. నేను నీ చేతిలోని ఉపకరణ మాత్రమును. నీవు నన్నేమి చేయించిన నేను అది చేయుదును. ఈ సర్వము నీ విభూతియే. ఈ యిల్లు, ఈ సంసారము అన్నియు నీవే, నావి కావు; నీ యాజ్ఞానుసారము సేవ చేయుటకు మాత్రమే నాకధికారము కలదు''.

అహంకారమును జయించుట దుర్లభము

110. అందరి అహంకారములను క్రమముగా తొలగిపోగలవు గాని మహాత్మునకు తన మాహాత్మ్యమును గూర్చిన అహంకారము తొలగిపోవుట దుర్లభము.

111. వెల్లుల్లి రసము పోసియుంచిన గిన్నెను వేయిసార్లు కడిగినను ఆ వాసన పోదు అజ్ఞానముచే గలుగుచున్న అహంకారము అంతటి మొండిది. దానిని తొలగించుకొనుటకెంతటి విశ్వప్రయత్నము చేసినను అది పూర్తిగా తొలగిపోదు.

112. అజీర్ణరోగి పులుపు వస్తువులు తనకు హానికరములని బాగుగా ఎరుగును. కాని అవి వాని కండ్లకగుపడిన చాలును, నోరూరును. చేరిక యొక్క ప్రభావము అట్టిది. అటులనే 'నేను, నాది' అను భావము నెంతగా అణచివేయ బ్రయత్నించినను కర్మరంగంలోనికి దిగినంతనే అపక్వపుటహంకారము తలఎత్తుచునే యుండును.

113. అహంకారమును నిర్మూలించి సమాధి స్థితిని సాధింపగల్గువారు అరుదుగా నుందురు. సాధారణముగా అది పోనే పోదు. విధి విరామములనునవి లేక నీవెంత విచారము చేసినను ఈ అహంత మరల మరల తల ఎత్తుచునే ఉండును. రావి చెట్టును ఈనాడు మీరు నరికివేసితిమి గదా అనుకొనిన, మరునాడే చిగుర్చుచున్నది.

ఇంకావుంది...

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

194

కాని నీవద్ద గల ధనరాశికి తరుగుదల కానరాదు.

త్వాం హి సత్యమద్రినో విద్మ దాతారమిషామ్। విద్మ దాతారం రయీణామ్॥
(ఋ.8-46-2)

''ఓ దీనదయాళో! మాకు నిజమైన అన్నదాతవు, ధనదాతవు నీవే.'' ఈ సృష్టిలో ఆహారాన్ని తీసుకొనే జీవులను లెక్కించలేము. నా దృష్టిలో ఆ జీవులు అనంతం. ఒక్కొక్క జీవజాతిలో వేలాది కోట్ల జీవులున్నాయి. ఆ జీవులన్ని తినే ఆహార సామగ్రి కూడ అనంతమే. అంత అనంత ఆహార సామగ్రిని అనంత ధనవంతుడవైన నీవే యీయగలుగుతున్నావు. అందుచేత 'దశస్యా నో మఘవన్ నూ చిత్' ''ఓ ధనేశ్వర! మాకాధనాన్ని శీఘ్రంగా ఇమ్ము'' నీవాలస్యం చేస్తే మా అశాంతమైన మనస్సు మరింత అశాంతమైపోతుంది. ఓ పరమేశ్వర! 'దదీ రేక్ణస్తన్వే దదిర్వసు దదిర్వాజేషు పురుహూత వాజినమ్...'॥(ఋ.8-46-15)

నీవు ఈ శరీర పోషణకు తగిన ధనాన్ని, నివాసాన్ని ఇస్తున్నావు. మాకు జ్ఞానప్రబోధార్థం జ్ఞానిని కూడ అనుగ్రహిస్తున్నావు. సమస్తమూ అనుగ్రహించే ఓ ప్రభూ! శారీరక ధనాన్ని బుద్ధి ధనాన్ని ఇమ్ము.

తమింద్రం దానమీమహే శవసానమభీర్యమ్। ఈశానం రాయ ఈమహే॥ (ఋ.8-46-6)

''ఓ అనంత బలశాలీ! నిన్ను దానాన్ని అర్థిస్తున్నాం. అభయప్రదాతా! ధనేశ్వరుడవైన నిన్నే కోరుతున్నాం.''

ధనమూ మరియు జనమూ వినాశనమైపోవుట చూస్తున్నా. ధనం తప్పక వినాశనమైపోతుందని భయం కలుగుతూ ఉంది. కాబట్టి ఓ అభయదానశీలా! మాకు ధనమే వద్దు. నీవే కావాలి. ధనస్వామివైన నీవే కావాలి. ఈ సద్బుద్ధి మాలో స్థిరంగా ఉండనిమ్ము అందువలన 'ధియో వాజేభి రావిథ' ''మా బుద్ధులను జ్ఞానంచేత పవిత్రం చేయి.''

ప్రభంగం దుర్మతీనామింద్ర శవిష్ఠా భర। రయి మస్మభ్యం యుజ్యమ్॥
(ఋ.8-46-19)

''దేవాధిదేవ! సదా మావెంట ఉండి దుర్బుద్ధులను నాశనంచేసే ధనాన్ని ఇమ్ము''

''ఓ దేవాధిదేవా! మానవుడు ధనాన్ని పొంది ఉన్మత్తుడైపోతాడు. బుద్ధియందు సమతౌల్యాన్ని కోల్పోతాడు. ఒకప్పుడు మూఢునిగా మారిపోతాడు. కొన్ని సందర్భాలలో జ్ఞానియయిన వాని మనస్సులోకూడ అహంకారాన్ని, దురభిమానాలను పుట్టిస్తుంది. అందుచేత అనంత జ్ఞాన సంపన్నా! బుద్ధి సంశోధకమూ, దుర్బుద్ధి నివారకమూ, విమల ప్రకాశమూ, అజ్ఞాన నివారకమూ, దుష్టజ్ఞాన వినాశకమూ అయిన సుజ్ఞానాన్ని మాకు వరప్రదానంచేయి. కాని ఓ త్రిలోకాత్మా! ఇంత మాత్రం దయను తప్పక చూపు. ఎందుకంటే-

సనితః సుసనితరుగ్రచిత్ర చేతిష్ఠ సూనృత।
ప్రాసహా సమ్రాట్ సహురిం సహంతం భుజ్యం వాజేషు పూర్వ్యమ్॥ ఋ.8-46-20

ఓ ధనాధిపతీ! పరమేశ్వరా! నీ వరప్రదానమైన ధనమూ నీ కరుణాపూర్ణమైన రక్షణ మమ్ము పెడదారి పట్టించకుండ ఉండుగాక! నీ రక్షణలో మేము మూడుపూవులు ఆరుకాయలుగా వర్ధిల్లెదముగాక! నీ ధన వరప్రదానంతో సమాజంలో ఔన్నత్యాన్ని కూడ పొందెదముగాక! కాని ఎన్నడూ నీ ఆజ్ఞోల్లంఘన మాత్రం చేయకుందుముగాక! అల్పజ్ఞతవలన మేమట్టి తప్పిదానికి పాల్పడకుండెదముగాక! నీవు చెప్పిన పవిత్ర సందేశ వాక్యాలలోనే నేనొక మాట చెబుతున్నాను.

త్వం విశ్వా దధిషే కేవలాని యాన్యావిర్యా చ గుహా వసూని।
కామ మిన్మే మఘవన్మా వి తారీ స్త్వమాజ్ఞాతా త్వమింద్రాసి దాతా॥ (ఋ.10-54-5)

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

మంగళవారం 15, జనవరి 2019

భయపెడతారట



ప్రముఖ చలనచిత్ర నిర్మాణ సంస్థలు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా ఓ చిత్రాన్ని పలు భాషల్లో నిర్మించటానికి సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళం, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మితమవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమిది. 'హారర్ థ్రిల్లర్'గా రూపొందుతున్న చిత్రంలో మాధవన్, అనుష్కశెట్టి, అంజలి, షాలిని పాండే, అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి కోట వెంకట్, గోపీసుందర్, షనీల్‌డియో, గోపీమోహన్, నీరజ కోనలు సాంకేతిక నిపుణులు. ఇతర తారాగణం, మిగతా సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తారట. మార్చిలో షూటింగ్ అమెరికాలో మొదలవుతుందని, 2019 ద్వితీయార్థంలో చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్టు చెబుతున్నారు.


అర్జున్‌లిద్దరూ కలిస్తే..



విజయ్ దేవరకొండను అర్జున్‌రెడ్డితో ఒక్కసారిగా స్టార్ హీరోను చేసిన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగ ప్రస్తుతం అదే అర్జున్‌రెడ్డిని బాలీవుడ్‌లో షాహిద్‌కపూర్‌తో కబీర్‌సింగ్‌గా రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్‌లో కూడా ఈ సినిమా భారీ విజయాన్ని దక్కించుకోవడం ఖాయం అంటున్నారు. ఇక అర్జున్‌రెడ్డి సినిమా తర్వాత సందీప్‌రెడ్డి వంగ దర్శకత్వంలో నటించేందుకు స్టార్ హీరోలు కూడా ఆసక్తిగా ఉన్నారు. సందీప్‌రెడ్డి వంగ దర్శకత్వంలో నటించేందుకు ఇప్పటికే మహేష్‌బాబు ఓకే చెప్పాడు. మహేష్‌కోసం పలు కథలు తయారుచేసి సందీప్ వినిపించాడు. ఎట్టకేలకు సందీప్‌రెడ్డి చెప్పిన కథకు మహేష్‌బాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. మహేష్‌బాబు కోసం పోలీస్ స్టోరీని తయారుచేసినట్లుగా టాక్. ప్రస్తుతం మహేష్‌బాబు తన 25వ సినిమా మహర్షిని పూర్తిచేసే పనిలో ఉన్నాడు. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్నాడు. ఈ ఏడాదిలో సుకుమార్ మూవీని పూర్తిచేసి ఆ తర్వాత సందీప్‌రెడ్డి వంగ దర్శకత్వంలో సినిమా చేస్తాడని టాక్.

జ్యాక్ బాక్స్‌లో మిస్టర్ మజ్ను

అఖిల్ అక్కినేని హీరోగా వస్తున్న తాజా చిత్రం మిస్టర్ మజ్ను. నిర్మాత బీవీఎస్‌ఎన్ ప్రసాద్ సారథ్యంలో వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రం షూటింగ్ పూర్తిచేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి జనవరి 25న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన పాటలకు, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ఏమైనదో... ఏమైనదో', మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, 'హార్ట్ బ్రేక్' పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా చిత్రం జ్యాక్ బాక్స్‌ను విడుదల చేశారు.



ఆసనం.. వర్కౌటైంది!



వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ కౌర్ హీరోహీరోయిన్లుగా దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'ఎఫ్ 2... ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. ఈ నెల 12న సినిమా విడుదలై సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతున్న సందర్భంగా దర్శకుడు అనిల్‌రావిపూడి మీడియాతో ముచ్చటించాడు.

మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలో ఉన్న ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచననుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్‌కి ఓ మెనరిజమ్ పెట్టి దాన్ని కథకు లింక్ చేస్తే బావుంటుందని పించి వెంకీ ఆసనం డిజైన్ చేశాను. ఆడియెన్స్ దాన్ని బాగా ఓన్ చేసుకున్నారు. చాలామంది థియేటర్‌లో ఆ ఆసనాన్ని వేస్తున్నంతగా పాపులరైంది. ఈవీవీ, ఎస్వీ కృష్ణారెడ్డి, జంధ్యాల సినిమాలను చూస్తే అన్ని వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. అది ఈ సినిమాతో తీరింది. అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివి, జంధ్యాలతో పోలుస్తూ కొందరు కామెంట్స్ చేస్తుండటం హ్యాపీ అనిపిస్తోంది. అయితే వారి స్థాయికి నేనింకా ఎదగలేదు. కాకపోతే, ఎక్కడో ఒకచోట వాళ్ల ప్రభావం నాపై ఉంటుందనే మాట వాస్తవం. సినిమాలో వెంకీ అదరగొట్టాడని అంటున్నారు. అలాగే వరుణ్ చక్కగా చేశాడు. వరుణ్ కూడా ఇప్పటివరకు కామెడీ జోనర్‌లో సినిమా చేయలేదు. తను వెంకటేష్‌తో ఎలా కామెడీ టైమింగ్‌లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో కామెడీ జోనర్‌లో తొలిసారి చాలా చక్కగా నటించాడు. 'పటాస్' నుండి 'రాజాది గ్రేట్' వరకు కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే రాజా ది గ్రేట్ సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా కమర్షియల్ సినిమా చేద్దామనే ఆలోచన వచ్చింది. పెళ్ళాం చెబితే వినాలి, క్షేమంగావెళ్లి లాభంగా రండి జోనర్‌లో ఈమధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా సినిమాను పూర్తిచేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నా టీం సాయి, ప్రవీణ్, నారాయణలతో కథపై నాలుగైదు నెలలు వర్క్‌చేశాం. హిందీలో గోల్‌మాల్, హౌస్‌ఫుల్ సినిమాల సిరీస్ ఉంది. మన తెలుగులో ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేయాలని ఉంది. కచ్చితంగా ఎఫ్2కు సీక్వెల్‌గా ఎఫ్ 3 చేస్తాను. వెంకటేష్‌గారికి, వరుణ్‌కి చెప్పేశాను. వాళ్లు ఎప్పుడైనా రెడీ అన్నారు. చర్చల్లో ఉంది. నెక్స్ట్ సినిమా అంటే.. వెంకటేష్‌గారికి ఓ లైన్ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. కథాచర్చలు జరుగుతున్నాయి. నెక్స్ట్ సినిమా విషయంలో ఇంకా ఏమీ అనుకోలేదు. పండుగకు ఊరెళ్లి ఎంజాయ్ చేసి... మూడువారాలు రిలాక్స్‌అయ్యి... ఓ కొత్త జోనర్‌లో చేయాలనేది ఆలోచించుకుని చేస్తాను. బాలకృష్ణగారికి కూడా ఓ ఐడియా చెప్పాను.



పెళ్లి తర్వాత అక్కినేని నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న మజిలి సెకెండ్ లుక్‌ను సంక్రాంతి సందర్భంగా విడుదల చేశారు. చిత్రంలో సెకెండ్ హీరోయిన్‌గా నటిస్తున్న దివ్యాంశ కౌశిక్ నాగచైతన్యతో కనిపించటంతో సెకెండ్ లుక్ ఆసక్తి పెంచుతోంది.

యమ్ 6కు యు/ఏ



విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్లపై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'యమ్ 6'. సెన్సార్ పూర్తైన చిత్రానికి యు/ఏ సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా క్వాలిటీగా నిర్మించామన్నారు. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే అద్భుతమైన కథని దర్శకుడు జైరాం అంతే అద్భుతంగా తెరకెక్కించారన్నారు. ఫిబ్రవరి మొదటివారంలో ఈ సినిమాను విడుదల చేస్తామన్నారు. దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ నిర్మాత విశ్వనాథ్ సినిమాను మంచి క్వాలిటీతో నిర్మించారని, నేచురల్‌గా తెరకెక్కించామన్నారు. ప్రత్యేకంగా పోరాట దృశ్యాలు కళ్లముందే జరుగుతున్న భావన కలుగుతుందన్నారు. సినిమాని ఒక ప్రయోగంలా తెరకెక్కించామని, ఆడియన్స్ థ్రిల్ ఫీలవుతూనే లవ్, కామెడీ ట్రాక్స్‌ని ఎంజాయ్ చేస్తారన్నారు. హీరో ధ్రువ మాట్లాడుతూ మంచి చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమవ్వడం హ్యాపీగా ఉందన్నారు. టాలెంట్‌ను గుర్తించి అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



తెలుగులో మహాచంద్ర

నైనా ఫిలిమ్స్ పతాకంపై యశ్, ప్రేమ్‌కుమార్, శ్రియ ప్రధాన పాత్రలుగా రూపఅయ్యర్ దర్శకత్వంలో షాన్వాజ్ నిర్మించిన చిత్రం 'మహాచంద్ర'. ప్రస్తుతం డబ్బింగ్ దశ పూర్తవుతున్న నేపథ్యంలో నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ కన్నడలో హిట్టయిన చంద్ర చిత్రాన్ని మహాచంద్ర పేరిట తెలుగు ప్రేక్షకుల ముందుకు తెస్తున్నామన్నారు. యశ్ ఈ చిత్రంలో ప్రముఖ పాత్ర పోషించాడని, శ్రియ తన అద్భుత నటనతో ఆకట్టుకుందన్నారు. డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసి ఫిబ్రవరి రెండోవారంలో ప్రేక్షకుల ముందుకు తేనున్నట్టు చెప్పారు. దామోదర వనాచార్య సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రానికి సంగీత సహకారం గౌతమ్ శ్రీవాస్తవ, కెమెరా సహకారం దాస్ అందించారు.

ట్రైలర్‌లో అదృశ్యం

వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణంశెట్టి నిర్మించిన చిత్రం 'అదశ్యం'. హారర్, థ్రిల్లర్, కామెడి ప్రధానాంశంగా రూపొందిన చిత్రం సెన్సార్ పూర్తిచేసుకుని ఫిబ్రవరిలో విడుదలకానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్‌లో హీరో జాన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆల్‌డ్రిన్ మాట్లాడుతూ తెలుగులో ఇది మొదటి చిత్రమని, తెలుగువాడిన అయినా చెన్నైలో సెటిలయ్యానన్నారు. టాలీవుడ్‌లో తనను తప్పక ఆదరిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశాడు. హీరో జాన్ మాట్లాడుతూ అదే నువ్వు అదే నేను, బంటీ ద బ్యాడ్ బోయ్ తర్వాత చేస్తున్న మూడో చిత్రమే అదృశ్యమన్నారు. అవకాశమిచ్చిన డైరెక్టర్ రవికి కృతజ్ఞతలు తెలిపారు. అతి పెద్దదైన తెలుగు ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలనన్న నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ దిగ్గజ దర్శకులు కె.విశ్వనాథ్, సింగీతం శ్రీనివాస్ ఎన్నో చిత్రాలకు పని చేసిన అనుభవంతో ఈ చిత్రం చేశానన్నారు. బంటీ ద బ్యాడ్ బాయ్‌కి చేసిన జాన్‌నే ఈ చిత్రానికీ హీరోగా తీసుకున్నట్టు చెప్పారు. ఇదొక థ్రిల్లర్ కంటెంట్ అని, ఇంట్రెస్టింగ్‌గా సాగే కథనం ఆడియన్స్‌కి బాగా కనెక్టవుతుందన్న నమ్మకంతో ఉన్నామన్నారు.



మెహ్రీన్‌కు కలిసొచ్చేనా



అందం ప్రతిభ ఉన్న హీరోయిన్స్ లక్ కలిసి రాకపోవడంతో చిన్న చిన్న తప్పులు చేయడంవల్ల కొన్నాళ్లకే కనుమరుగయ్యారు. అందమైన రూపం ఉన్న మెహ్రీన్ ఇప్పటివరకు కెరీర్‌లో పడుతూలేస్తూ వస్తోంది. ఒక్క సక్సెస్ దక్కితే రెండుమూడు ఫ్లాప్స్ పడుతున్నాయి. తాజాగా ఈ అమ్మడు 'ఎఫ్ 2' చిత్రంతో మంచి సక్సెస్‌ను దక్కించుకుంది. ఈ చిత్రంలో హనీ పాత్రలో నటించి ఆకట్టుకుంది. దీంతో మరోసారి మెహ్రీన్ జోరు పెరిగే అవకాశముందంటున్నారు. అంతకుముందు సక్సెస్ లేక కెరీర్ ఎలా సాగుతుందో నమ్మకం లేక ఉన్న మెహ్రీన్‌కు 'రాజా ది గ్రేట్' చిత్రంతో బూస్ట్‌ఇచ్చాడు. ఆ సక్సెస్‌తో మెహ్రీన్ వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. కాని ఏ ఒక్కటీ ఆమెకు క్రేజ్‌ను తెచ్చి పెట్టలేకపోయాయి. మళ్లీ మునుపటి లాగే కెరీర్ ప్రమాదం పడినట్టయ్యింది. అలాంటి సమయంలో మెహ్రీన్‌కు 'ఎఫ్ 2'తో దర్శకుడు అనీల్ రావిపూడి సక్సెస్‌ను తెచ్చిపెట్టాడు. సినీ ఇండస్ట్రీలో సక్సెస్ దక్కిన సమయంలో ఆ సక్సెస్‌ను సరిగా సద్వినియోగం చేసుకుని సినిమాలను ఎంపిక చేసుకుంటేనే ఆ సక్సెస్ కొనసాగుతుంది.



అసలేంజరిగింది?

ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న అసలేం జరిగింది? చిత్రం పోస్టర్‌ను ఎంపీ సంతోష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీలిమ ప్రొడ్యూసర్‌గా శ్రీరాం హీరోగా రూపొందుతున్న చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణలో ఇంతవరకూ ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకోసం చిత్ర యూనిట్ ఆరు నెలలపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయమన్నారు. చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కెమెరామన్ ఎన్‌వీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాం హీరోగా రూపొందుతున్న చిత్రానికి మ్యూజిక్‌ను మహావీర్ అందిస్తున్నారు. రామ్‌గోపాల్‌వర్మ నిర్మించిన భైరవగీత విలన్ విజయ్ రామ్ చిత్రంలో ప్రతి నాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. చిత్రానికి కథ నెర్లపల్లి వాసు అందించారు. ఫిబ్రవరి 11నుంచి సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని, రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తి చేస్తామని నిర్మాత కె నీలిమ తెలిపారు.